అధ్యాయం - 1

నీవెవరివో నువ్వు కనుక్కో

మెలకువలో మనం నిరంతరం ప్రతీక్షణం యేదో ఒకటి ఆలోచిస్తూనే ఉంటాము. స్వప్నంలో కూడా అంతే. కానీ యెవ్వరైనా యెప్పుడైనా ఒక్క క్షణం ఆగి, యిలా యెందుకు ఆలోచిస్తున్నామని అనుకోరు, ప్రశ్నించుకోరు. మనసు యిలాగే ఉంటుంది. అప్రయత్నంగానే ఆలోచనలు ఉంటాయని, ఎందుకు పట్టించుకోము. ఇదే నిజం అయితే ఎవరూ చేయగలిగిందేమీ లేదు. మనస్సు యొక్క పరుగుల్ని లెక్కలేనన్ని విధాలుగా వర్ణించవచ్చు. దానియొక్క వేగం, నిలకడలేనితనం, దాని నియంత్రణ.... యిలా యెన్నో విషయాలుగా చెప్పవచ్చు. ఈ రకంగానే దాన్ని విశ్లేషించవచ్చు. ఎందుకంటే, మన మనస్సు, దాని ఆందోళనలు, కోరికలు, భయాలు ఏవో సాధించాలని ఆరాటాలు, పోటీలు... యిలా మనకు అనుభవమే కాబట్టి. ఆలోచించడమనే గాఢమైన వ్యసనం, అప్రయత్నంగా యెంత అలవాటయిందంటే దాని పర్యవసానాలను అందరూ ఆమోదించాల్సిందే. మనసులోని దుఃఖాలు, వాటి రకరకాల ఫలితాలు, బాధలు, కష్టాలు, యిటూ అటూ యెన్నో తలంపులు, భావనలు, అర్థంలేని ఆలోచనలూ యిలా యెన్నో పర్యవసానాలు. ఈ మనసు యొక్క వాతావరణం నిన్నెప్పుడూ వదలదు. మంచైనా - చెడైనా, లాభమైనా - నష్టమైనా, సుఖమైనా - కష్టమైనా ఆ వాతావరణంలో బ్రతకాల్సిందే.

ఇలా ఆలోచనలు, తలంపులు, భావనలు మనసుకు సహజమైనవే అని అందరూ సాధారణంగా అనుకుంటారు. కానీ భగవాన్ కాదు అంటారు. జీవితంలో ఎన్ని రకాల వ్యాపారాల్లో, పనుల్లో, సంబంధాలలో మునిగివున్నా మనసుకు మౌనంగా ఉండటము, ప్రశాంతంగా ఉండటం - మౌనం, శాంతి - మాత్రమే సహజమైనవని భగవాన్ చెప్పారు. ఈ విషయాన్నే మళ్ళీ మళ్ళీ నొక్కి నొక్కి చెప్పేవారు. భగవాన్ శ్రీరమణ మహర్షి సత్యాన్ని యెన్నిసార్లు పదే పదే చెప్పినా ఉచితమే. 1900ల సంవత్సరంలో, ప్రపంచ గురువుగా మొట్టమొదట తన పాత్ర నిర్వహించడం ప్రారంభించినపుడు భగవాన్ శ్రీ గంభీరం శేషయ్యరు గారితో 'నిజంగా మనసు అంటే' ఎరుక (ఆత్మ) మాత్రమే. ఎందుకంటే అది సహజంగా శుద్ధం, నిర్మలం అయినట్టిదే. అట్టి స్థితిలో మనస్సు భావనారహితమై

తలంపులు లేనిదై ఉంటుంది. అది అద్వితీయం, ఏకం, సర్వశక్తివంతం, ఆకాశంలా విశాలం. అలా కాకుండా మలినమైన మనసుగా ఆరోపింపబడితే, 'సహజ మనసుయొక్క అసలు తత్త్వమును మరచిపోవడం వలన మాత్రమే అలా జరుగుతుంది'. మనసు ఆకాశమంత నిర్మలమైనది, శుద్ధమైనది. దాని అసలు సహజత్వం, మనసులోని విషయాలనుబట్టి యెలాంటి మార్పు, వేదన చెందదు.

అంటే రెండు మనసులు, ఒకటి శుద్ధం యింకొకటి అశుద్ధమైనది ఉన్నాయా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. కానీ కాదు. మనకు మనసుయొక్క తప్పుడు గ్రహింపు, భావన ఉన్నంతకాలం, విచారణ శోధనకు అవసరం యెంతైనా ఉంది. శోధించి తెలుసుకుని, మనసుయొక్క సహజమైన అనంత శాంతిని అనుభూతి పొందు. ఇక ఆ స్థితిలోనే ఉండు. ఎలాంటి విచారణ అయినా, పద్ధతి అయినా జయం పొందాలంటే, మన అంతర్గత స్వభావమును ప్రశ్నించేదిగా ఉండాలి.

'అసలు ఈ మనసు అనేది యేమిటి?' అని మనం ప్రశ్నిస్తే, మనకు రెండు తెలుస్తాయి. ఆలోచన, ఆలోచించేవాడు. ఆలోచన, ఆలోచించే వాడికి చెందినది. ఆలోచించేవాడు లేకపోతే ఆలోచన లేదు, అవకాశం లేదు. ఈ సర్వసాధారణమైన ఆలోచన (శోధన) మిగతా అన్ని తలంపులను అధిగమిస్తుంది. ఇక్కడ జాగ్రత్తగా గమనించితే, ఒకటి విధితమౌతుంది. తలంపులు రావడం, లేకుండా పోవడం అనేది వ్యక్తియొక్క ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. ఆలోచించే వాడి వలన ఉంటుంది. మనసు దానికదే యెక్కడికక్కడ తుడుపేస్తుంది. ఉదయం ఫలహారంపై దృష్టి ఉండి ఆస్వాదిస్తున్నప్పుడు రాత్రికి యే సినిమాకి అన్న తలంపు రాదు. అలాగే ఆఫీసులో పనిలో నిమగ్నమైనపుడు స్నేహితులవద్దకు పోలేదేమని అనిపించదు. కొన్నిసార్లు యిలా, గాఢమైన నియంత్రణ వలన జరుగవచ్చు. దీనివలన అర్థం అవుతున్నది యేమిటి? అసలు అంతా, ఆ ఆలోచించేవాడు/అహంకారం పైనే మొత్తం ఆధారపడి ఉంది. అతనే కేంద్రం, కీలకం. ఆలోచనలకు స్వతంత్రత లేనేలేదు. వాటినుంచి దృష్టిని యీ కీలకమైన కేంద్రంపై సారిస్తే, మనసుయొక్క సహజమైన అసలు తత్త్వం అర్థం కావడానికి, కనుక్కోవడానికి అవకాశం కలుగుతుంది.

'నేను యెవరు?' అనే విచారణ ద్వారా, అలా కేంద్రంపై దృష్టిని లగ్నం చేయడం సాధ్యమేనని భగవాన్ తెలిపారు. ఈ విచారణనే 'నేను యెవరు? విచారణ' అన్నారు. ఎందుకంటే, యెవరైనా తనను తాను మనసుగానే

భావించుకుంటున్నారు కాబట్టి. తనంటే మనసే అనుకుంటున్నారు కాబట్టి. మనసే చూచేది, మిగతా అన్నీ చూడబడేవి. మనసును కనుక్కోవడానికి, భగవాన్, యీ విచారణ మార్గం సార్థకత చాలా సూటిది, సరళము, సులభమూ అయినది అని గట్టిగా చెప్పేవారు. ఎందుకంటే, యీ విచారణ తీవ్రంగా, నిలకడగా, శ్రద్ధగా చేస్తుంటే, మనస్సును కేంద్రంపై, ఆలోచనలకు దూరంగా ఉంచుతూ, లగ్నం చేయగలదు. అలాకాకుండా ఆలోచనలను తగ్గించడానికి వాటిని తీసివేయడం అనేది చేస్తే, చెట్టును వదిలేసి ఆకులను తురిమినట్లు ఉంటుంది. మూలం అట్లానే ఉంటుంది. మనసు కేంద్రంపై లగ్నం చేసిన ధ్యాస, తన సహవాసులైన తలంపులపై తన ధ్యాసను తగ్గించుతుంది. అలా అన్ని తలంపులపై తన ధ్యాస యెప్పుడైతే కత్తిరింపబడుతుందో అపుడు తనను యింతకాలం బాధించుతున్న తప్పుడు గ్రహింపు, 'తనకొక ప్రత్యేక గుర్తింపు స్వతంత్రత ఉన్నదని, గురించి అర్థం అవుతుంది. అపుడు తను సహజంగా పూర్ణమైన చైతన్యమేనని, మౌనం పరమశాంతితో శుద్ధ నిర్మల మనసేనని తెలుస్తుంది.

ఇది తెలియగానే అన్ని బంధాలు కొట్టుకుని తుడిచిపెట్టుకుపోతాయి. తన ఆధారాన్నే మరచిన పరిమితమైన ప్రత్యేక గుర్తింపు, సహజమైన ఆనంద వరద ప్రవాహంలో కొట్టుకుపోకుండా యెలా నిలచి ఉండగలదు? ఈ ఆనంద అనుభూతిని వర్ణించసాధ్యం కాదు. వర్ణించినా గ్రహింప సాధ్యంకాదు. ఎందుకంటే అది మనసుయొక్క సృష్టికాదు. అహంకార భావన అయిన 'నేను', తాను అయిన 'నేను, నేను'లో కరగిపోతుంది. నాశనమౌతుంది. 'నేను, నేను...' హృదయంలోని నిరంతర ఆనంద తరంగమే. ఇది సహజం, వర్ణించలేనిది. అనుభూతి చెంది తెలుసుకోవల్సిందే. అది అంతటా యెప్పుడూ ఉన్నదే.

ఈ మరచిన తనను, తాను తెలుసుకోవడంలో గురువు పాత్ర యేమిటి? అని అడగవచ్చు యెవరైనా. గురువు యీ కార్యక్రమంలో యెక్కడ యెలా అమరుతాడు. నీవెవరివో తెలుసుకోవడం, నిరంతర ఉత్సాహంతో విచారణ సాధన వలన జరుగుతుందని అన్నాము కదా మరి! కానీ 'కాదు' అనేదే నిరుత్సాహకర సమాధానం. సాధన, యింకా సాధన, నిరంతర సాధన తప్పక చేయవలసిందే అనడంలో సందేహమే లేదు. అంతేచాలదు, సద్గురువు యొక్క అనుగ్రహం మార్గదర్శకత్వము తప్పకుండా అవసరమే. అంతర్ముఖంగా ఉండే సద్గురువు యెల్లప్పుడూ సాధకుడిని నడిపిస్తూనే ఉంటాడు. సాధకుడు అంతర్ముఖుడై తనలోని లోతులకు పోతున్నకొద్దీ సద్గురువు అక్కడ మార్గ నిర్దేశకునిగా ఉండడం అనుభూతి

కలుగుతుంది. తన సహజమైన స్థితిలో, తానుగా నిలచి ఉండటంలో సద్గురువు సహాయం, అనుగ్రహం లెక్కించలేనిది.

తనను తాను తెలుసుకున్న తరువాత, తన రోజువారీ జీవితంలో దాని ప్రభావం యెలా యెంత ఉంటుందని ఆశ్చర్యం కలుగవచ్చు యెవరికైనా. ఒకరు యెలా మారుతారు? తన కర్తవ్యం విధులను అన్నీ వదిలేసి నిరంతరం ధ్యానంలోనే ఉంటారా? ఇక్కడ కూడా సమాధానం 'కాదు' అనే. చేయవలసిన పనికి, తనయొక్క జ్ఞానానికి యెప్పుడూ యెలాంటి ఘర్షణ ఉండదు అని భగవానే చెప్పేవారు. 'నేను యెవరు? విచారణ' సాధన చేస్తున్నప్పుడు కూడా, రోజువారీ పనులన్నీ చేస్తూ చక్కపెడుతున్నపుడు కూడా అంతర్గత ప్రశాంతత ఆనందం చెదరక నిలుస్తూనే ఉంటుంది. ఈ విచారణ వలననే, చేసే పనిలో నిమగ్నమై, శాంతంగా శ్రద్ధగా, స్థిరంగా చేయడం వలన చేసేదంతా చక్కని ప్రమాణాలతో ఉన్నతంగా జరుగుతుంది. తనయొక్క సహజత్వ జ్ఞానం నిలకడగా నిలచిన తరువాత ఆ పూర్ణత్వాన్ని, అంతర్ముఖస్థితిని ప్రపంచంలో యేదీ యెవరూ కూడా వేధించలేరు, చెదరగొట్టలేరు.

తనను తాను కనుక్కున్న తరువాత వారికి చేయవలసిన పనులపై యెలాంటి భావం ఉంటుంది? వారు పని చేయాలని ఆసక్తి కానీ, చేయకూడదని విరక్తీ, వ్యతిరేకం కానీ యేమీ అనుకోరు, భావించరు. ఎంతో తర్ఫీదు పొందిన ఆటగానిలా లేక నిపుణిడిలా తీవ్రంగా, తను యే పని చేయవలసి వచ్చినా దానిలో నిమగ్నమై యెంతో శ్రద్ధగా, చక్కగా పూర్ణనైపుణ్యంతో చేస్తారు. అలాచూస్తూ కూడా ఆ పని గురించిగానీ, దాని ఫలితాలపై గానీ ఆశ, బంధం, కోరిక, భావన యేమీ లేకుండా ఉంటారు. మనసు/అహంకారం, దాని బంధాలనన్నింటినీ వదిలించుకున్న తరువాత తను చేస్తున్న యెన్నో రకాల విధుల్లో పాత్రల్లో నటిస్తున్నట్లే ఉంటారు. తను తాత్కాలికంగా పోషిస్తున్నది ఒక పాత్ర మాత్రమేనని, తాను కాదు అనే స్ఫురణతోనే ప్రతీక్షణం ఉంటారు. చేయవలసింది యెలాంటిదైనా, చిన్నదైనా, పెద్దదైనా, సులభమైనా, కష్టమైనా, పవిత్రమైనా, అపవిత్రమైనా యెలాంటి భయం, సందేహాలు లేకుండా సంపూర్ణ ఉత్సాహంతో చేస్తారు. వారు యీ ప్రపంచంలో గతం భవిష్యత్తుల్లో కాకుండా వర్తమానంలోనే పూర్ణంగా జీవిస్తారు. తనలో చైతన్యం ఆనందం ప్రసరించగా, వారు జ్ఞాన జ్యోతిగా దివ్యంగా వెలుగుతారు. వారు, తీరాలే లేని మహా ఆనందసాగరమై ఉంటారు. వారి ఆ చైతన్య ఆనందాన్ని యితరులందరూ పంచుకుని అనుభూతి పొందుతారు.

అధ్యాయం - 2

రమణుని బోధనలు

రమణుని బోధనలన్నీ ఒకే ఒక్క విషయంపై లగ్నమై ఉంటాయి. అవన్నీ తాను స్వయంగా అనుభూతి చెందిన, దేహంతో తాద్యాత్మం చెందని అమృత తత్త్వమైన 'నేను, నేను' పైన ఆధారపడినవే. 1896వ సంవత్సరము జూలై 17న మధురైలో తన మావయ్యగారి యింటిలో ఉండగా జరిగిన సంఘటనే రమణుల బోధనలన్నింటికీ మూలం, ఆధారం. అదే, తాను అంటే యీ దేహం అనే భావన నశించగానే, స్ఫురణ అంతా తనపైనే తప్పనిసరిగా కేంద్రీకృత మవుతుంది. అపుడు 'నేను' చైతన్యం ఆనందమే తప్ప వేరు కాదని, అనుభూతి కలిగి, ఉన్నది అదొక్కటి మాత్రమే తప్ప వేరుగా యేమీలేదని, మానసిక ప్రవృత్తులన్నీ దానివలన దానిలోని కదలికలేనని విశదమవుతుంది. ఇది రమణులకు నేనెవరనే విచారణ వలన, 'నేను' కేంద్రంగా జరిగిన విచారణ వలన అనుభవంగా తెలుస్తుంది. తన మృత్యుభయం మనసును అంతర్ముఖంచేసి, యీ దేహ మరణమే అంతిమమా అని విచారణ చేయిస్తుంది. ఈ విచారణ తన దేహం/అహంకారంతో తనకు కలిగిన తప్పు గుర్తింపును అంతంచేసి, అదే సమయంలో అకస్మాత్తుగా తనలోని 'నేను, నేను' అనే చైతన్యం స్ఫురిస్తుంది. అప్పటినుంచీ రమణులు సహజమైన పొరలిపొంగే ఆనందసాగరంలో నిలకడగా నిలచారు. అతనికి భయాలన్నీ యిక యెలాంటివీ లేకుండా మాయమయ్యాయి. ఈ అనుభవంపై ఆధారపడిన అతని బోధ చాలా సరళమైనది. తన స్వస్వరూప జ్ఞానము, ఆత్మజ్ఞానము నేనెవరనే విచారణ ద్వారానే సాధ్యం. తన నిజస్వరూపం యేమిటి అనే విచారణ, వ్యక్తి/నేను అనే భావన/అహంకారం పుట్టే మూలస్థానంకు తీసుకుని వెళుతుంది. ఈ విచారణే ప్రఖ్యాతిగాంచిన ప్రశ్నలు 'నేనెవరు?', 'నేను యెక్కడ నుంచి?'గా రూపుదాల్చాయి. ఈ ప్రశ్న విచారణతో అంతమయి, 'నేను, నేను' అనుభవం కలిగి, 'నేను ఫలానాఫలానా' అనే అహంకారభావం మాయమైపోతుంది.

ఈ పద్ధతి సూటితనం యెంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. మానవజన్మ పరాకాష్టగా, గమ్యంగా యెంతో ఆధ్యాత్మిక సాధనతో లభించే ఆత్మసాక్షాత్కారము, యింత సులభంగా దొరుకుతుందా? నియంత్రించలేని మనసు సంగతి యేమిటి? సాధారణంగా పాటించి ఆచరించవలసిన యెన్నో విధాల నియమనిష్టలు సంగతి

యేమిటి? రమణుని బోధ అర్థం చేసుకోవడంలో యిదే ప్రథమ ఆటంకం. సత్యం యెప్పుడూ, యెలాంటి అడ్డదారులూ లేకుండా సూటిగా, స్పష్టంగా సరళంగా ఉంటుంది. కానీ మనస్సే, యెన్నో ఆకర్షణీయమైన తలంపులు, మేధోపర అల్లికలు అల్లుతుంది. సత్యం యెక్కడైనా యెప్పుడూ అంతటా ఉన్నదే, ఉండేదే. ఎవరికైనా దాన్ని పొందడానికి యెలాంటి షరతులూ అవసరం లేదని భగవాన్ గట్టిగా చెపుతారు. తన సహజస్థితిలో తానుగా నిలచి ఉండటానికిగల ఆటంకాల గురించి యెవరైనా చాలా జాగ్రత్తగా గమనించాలి.

మనస్సు నిజతత్త్వమును అర్థం చేసుకొనకపోవడమూ, అనంతమైన తలంపులే అసలైన ఆటంకాలని రమణుల బోధ స్పష్టం చేస్తుంది. అంతటా ఉన్నదంతా ఒకే ఒక్క ఎరుక (ఆత్మ/నేను/సత్) కాబట్టి, మనస్సు అనేది యింకొకటి స్వతంత్రమైనదిగా ఉండదు. అది ఎరుక చైతన్యాన్నే ప్రతిఫలిస్తుంది. చంద్రుడు సూర్యకాంతిచే ప్రతిబింబించినట్లు, తలంపులే అయిన మనస్సు, స్వతంత్రత ఉనికి లేనిదే, మిథ్యయే. మెలకువలో లేచి, గాఢనిద్రలో లేని మనస్సు మిథ్యాతత్త్వము, దాని నిజతత్త్వము గురించి విచారణ జరుపనంతకాలం భ్రమ ఉంటుంది. తలంపుల పుట్టుకస్థానంపై దృష్టి నిలిపితే, మనసు తనకు ఆధారమైన మూలంలో కలసిపోతుంది. ఇక శేషించేది శుద్ధచైతన్యం (ఎరుక) మాత్రమే, దాన్ని ప్రతిబింబించేదే శుద్ధ మనస్సు.

రమణులు తరుచూ వాడే 'మనో నాశనం' అనే పదం చాలా అపార్థంకు గురయింది. అందువలన చాలామంది భయపడిపోతున్నారు. మనసనే పనిముట్టుతోనే వ్యక్తి జీవితం నడుస్తుంది. జీవించి ఉన్న భావన కలుగుతున్నది. మరి మనస్సును నాశనంచేస్తే యెవరైనా యేం చేయగలరు? ఇక్కడే మనం ఆగి, దీని అర్థం యేమిటో తెలుసుకోవాలి.

ఇంతకుముందు వివరించినట్లుగా మనస్సు ఉంది. అది శుద్ధనిర్మలమైనది. ఎలాంటి బంధాలు, భావాలు లేకుండా ఆత్మను (నేనును) అది ప్రతిబింబిస్తుంది. మానసిక శక్తులైన తలంచడం, బుద్ధి, జ్ఞాపకం, విచక్షణ, ఇంద్రియ నిర్వహణ లాంటివన్నీ పూర్ణంగా ఉంటాయి. కానీ, లెక్కలేనన్ని అనంతమైన ఆలోచనలతో, భావాలతో మానసిక శక్తి వ్యర్థం, ఖర్చు జరుగదు. ఎన్నో రకరకాల ఆలోచనల వలన కృశించిన మనసు బదులు, ఒకేదానిపై లగ్నమై, నిమగ్నమై, సమగ్రంగా, పూర్ణంగా భావనారహితమైన యెంతో శక్తివంతమైన మనసు ఉంటుంది.

ఇంకో సాధారణముగా అందరికీ కలిగే భయం యేమిటంటే, రమణుల పద్ధతిన తన్ను తానుగా (ఆత్మగా, నేనుగా) నిలచి ఉన్నట్లయితే, తనకు యీ ప్రపంచం యింక ఉండదు, గ్రహించబడదు అని. ఇది కూడా పూర్తి అపార్థమే. జ్ఞానికి, అజ్ఞానికి యిద్దరికి కూడా ప్రపంచం ఉంటుంది. అజ్ఞాని యీ నామరూపాలను శాశ్వతం అనుకుని భ్రమతో వాటిలో లీనమై ఉంటాడు. జ్ఞాని యీ నామరూపాలను గుర్తిస్తూనే వాటి అన్నిటి వెనుక అంతర్గతంగా నిలచివున్న శాశ్వత అఖండ పూర్ణచైతన్యం స్ఫురణతో ఉంటాడు.

అనంతమైన మనస్సు యొక్క గుప్తశక్తినీ, హద్దులే లేని పొంగిపొరలే అనంత పరమానందాన్నీ పొందే అవకాశం ఉండటం వలన, అందరూ రమణుని పవిత్ర దివ్యబోధనలపై దృష్టి నిలపాలి. అపుడు, యీ సాధన విచారణ మనలోని యెన్నో రకాల భయాలను, సందేహాలను తొలగించి రమణుల మార్గంలో స్థిరంగా నిలుపుతుంది. చాలామంది రైల్వే ప్రయాణికులిలా, గమ్యానికి ముందే మధ్య స్టేషనుల్లోనే దిగిపోతారు. గమ్యం వరకు కొనసాగించరు. మధ్యలోనే ఆగిపోవడం జాలి కలిగించేదే, ఎందుకంటే అలా వారు అపరిమిత అనంత మనసుయొక్క అనంత అఖండ పరమానందాన్ని చేజార్చుకుంటున్నారు.

అధ్యాయం - 3

శుద్ధ నిర్మల మనస్సు - అహంకార పూరిత మనస్సు

భక్తుడు : నేను, ఆత్మయొక్క బ్రహ్మానందాన్ని అనుభూతి చెందలేకపోతున్నాను.

మహర్షి : తేనెటీగలు అమృతమును గ్రోలుటకు పుష్పము రేకులు విప్పి వికసించవలెను. రేకులు ముడుచుకుని ఉంటే తేనెటీగలు యెట్లా లోపలికి పోగలవు? పుష్పము వికసిస్తే, తేనెటీగలకు ప్రత్యేక ఆహ్వానం అవసరమే లేదు. వాటికవే వస్తాయి. ఆ మాదిరిగానే, అహంకారం, నేనును కప్పి మూసి ఉంచితే ఆత్మజ్ఞానం యెలా కలుగుతుంది.

నేను జ్ఞానము (ఆత్మజ్ఞానం)నకు 'నేను' ఉండటమే ఋజువు అంటారు భగవాన్. అందుకే, 'నేను' యొక్క జ్ఞానం, అరచేతిలోని పండును చూచి తెలుసుకోవడం కంటే సులభం. తన అరచేతిలోనిదే అయినా చూడాలంటే చూచేవాడు, చూడబడే పండు, చూడడం అనేవి ఉండాలి, అవసరం. ఇంత సమంజసమైన చిన్న విషయం చూచి తెలియాలి అంటే అంధుడైతే చూడలేకపోవచ్చు లేదా మనస్సు దానిపై లగ్నంకాక చూడకపోవచ్చు. లేక అక్కడ పండు లేకపోవచ్చు. కానీ 'నేను' (ఆత్మ/చైతన్యం/ఎరుక అనంతం, సర్వవ్యాపితం, సర్వాంతర్యామి, సర్వకాల సర్వ అవస్థల్లో సర్వత్రా అంతటా ఉన్నవాడిని) ఉన్నాను. ఎప్పుడూ సదా అంతటా అన్నింటిలో ఉన్నాను. 'నేను' ఉన్నట్లు స్ఫురణలోనే ఉంది. ఈ స్ఫురణకు దేని అవసరం లేనేలేదు. అయినాసరే, నేను-జ్ఞానం చాలా కష్టమయినది అనే తప్పు భావనకు బాగా అలవాటయి బానిస అయిపోయి ఉన్నాము. అందుకే యెన్నో సాధనలు, పద్ధతులు, ప్రయత్నాలద్వారా యీ మనసు కల్పించిన తప్పు అలవాట్లను శుద్ధిచేస్తే, అంతిమంగా తన స్వస్వరూప జ్ఞానం, తన యెప్పుడూ ఉన్న అనుభూతి కలుగుతుంది. మనసుయొక్క నిజతత్త్వం యేమిటి అని గ్రహించకుండా, ఒక ప్రత్యేక మనసు ఉందనుకున్నంత కాలం (అదీ మనసు/ కల్పించే భ్రమే) యీ ప్రయత్నాలు తప్పవని భగవాన్ చెప్పేవారు.

భగవాన్, గంభీరం శేషయ్యర్ గారికి మొట్టమొదటి లిఖించి చేసిన బోధలో, మనస్సు స్వభావము గురించి యెంతో వివరంగా ఉదహరించారు. 'నిజానికి మనస్సు సహజంగా శుద్ధం నిర్మలమైనది. కాబట్టి అది ఆత్మ చైతన్యమే, వేరు కాదు. మలినమైన మనస్సు యింకో తప్పు గుర్తింపును ఆపాదించుకుని

మిథ్య భ్రమను కల్పించుతుంది. ఆత్మచైతన్యమే అయిన శుద్ధ నిర్మల మనసు మలినముల వలన తన సహజత్వాన్ని మరచి, 'నేను'కు బదులుగా 'అహంకార నేను'నే సత్యమని భావించుతుంది.

అందువలన ఒకటి శుద్ధ నిర్మల మనసు, రెండోది మలినమైన మనస్సు అని రెండు మనస్సులున్నాయా? అనే ప్రశ్న వస్తుంది. అలాగే ఒక వ్యక్తిలో, రెండు 'నేను'లు, ఒకటి సత్, ఆత్మ అయిన 'నేను', రెండవది 'అహంకార నేను'లు ఉన్నాయా అన్న ప్రశ్న కూడా ఉదయిస్తుంది. కానీ ఉన్నది, ఉండసాధ్యమయ్యేది ఒకే ఒక్క మనసు, ఆత్మచైతన్యం ప్రతిబింబించడం వలన సమగ్రంగా సర్వశక్తివంతంగా ఉంటుంది. అయినాసరే, యీ జ్ఞానం మరుగై, అజ్ఞానం ఆవరించి యీ సత్యాన్ని విస్మరిస్తుంది. అలా, యీ అజ్ఞానం వలన తానంటే స్వతంత్ర ప్రత్యేక ఉనికిగల దేహం/అహంకారం/ మనసు అని భావించుకుంటూ ఆలోచనలు, కార్యాలు చేస్తాడు. అసలు 'నేను'ను సత్ అయిన దాన్ని మరచిపోతాడు. ఇలా మరుగునపెట్టిన అజ్ఞాన ముసుగు వీడిపోయేంతవరకు తనదే అయిన సహజ పరమానందం, సర్వశక్తి, సర్వామిత్వం నుంచి వేరుగా దూరమవుతాడు. ఎన్నో జన్మలనుంచి అలవాటై యెంతో బలంగా స్థిరపడిన యీ అజ్ఞానం వేర్లుతో సహా, నేను యెవరు విచారణ, మనసు స్వభావం యేమిటో తెలుసుకొనడం వలన, సద్గురు అనంత అనుగ్రహంతో మాత్రమే పెకలింప వేయబడుతుంది. 'అహంకార నేను' భావన వలన తను యెన్నో పరిమితులకు, దుఃఖాలకు, అలజడి, ఘర్షణలకు లోను అవుతూ, జనన-మరణ చక్రభ్రమణంలో చరించే గతి వలన, నేను యెవరు విచారణ యెంతో ముఖ్యమని భగవాన్ గట్టిగా చెప్పేవారు.

'అహంకార నేను' భావనల నేను అంటే ఫలానా పేరు, ప్రతిష్ఠ, హోదా, తండ్రిని, కుమారుడిని, పుత్రికను, తల్లిని, యజమానిని, బానిసను, డాక్టర్ని, లాయర్ని, మినిష్టర్ని, నేను అది ఇదీ, నాది, వాడు, వీడు... యిలా మొత్తం 'అహంకార నేను'కు యెంతో అలవాటైన కార్యక్రమం అంతటా పూర్తిగా ఉంటుంది. వీటికి యింకా ఒక్కొక్కటీ వచ్చి చేరేటప్పటికి బాహ్యంలో యెన్నోరెట్లు పెరిగి బాంధవ్యాలు, కక్షలు, సిద్ధాంతాలు, నమ్మకాలు, ఆస్తులు, రాగద్వేషాలు... ఎన్నో బంధాలు తయారవుతాయి. వీటి ఫలితంగా కోరికలు, ఆశలు, భయాలు, ఆందోళన, ఘర్షణ... ఎన్నో మనసును కలుషితం చేసి మలినపరుస్తాయి.

ఇలా మలినమైనాసరే, మనసు యొక్క సహజ స్వభావమునకు యేమీ

కాదు, పోదు, ఉన్నదే కానీ మరుగున పడుతుంది అంతే. బంగారం మలినమైతే శుభ్రం చేయగానే తన సహజమెరుపు ఉంటుంది. దానికేమీ హాని జరుగలేదు, పోలేదు. ఆకాశంలో నుంచే పంచభూతాలు వచ్చాయి. కానీ వాటి గుణాలు, తత్త్వాలు ఆకాశానికి అంటలేదు. ఆకాశం ఆకాశంలానే ఉంది. భూమిపై కలుషితాలు, గాలిలోని మలినాలు ఆకాశాన్ని మలినం చేయలేవు. ఒకసారి మిథ్యా నేను / అహంకారం / మనసుయొక్క తప్పు గ్రహింపు పోయిన వెంటనే మిగిలేది శుద్ధ నిర్మల మనసు, ఆత్మగా ఉన్నది, పరిపూర్ణంగా సర్వశక్తిమంతంగా ఉంటుంది. మరపులేని దారిమళ్ళని, ఒకే ఒక్క సహజమైన మనోస్థితి వలన యిది సాధ్యమవుతుంది.

తన సహజశక్తిమయ పరమానంద స్థితిని, శుద్ధ నిర్మల మనసునూ మరుగునపెట్టి అడ్డుగా ఉన్న యీ తప్పుడు గ్రహింపును యెట్లా పోగొట్టుకొనవలెను? తన సహజస్థితిని మరపించినది అజ్ఞానం కారణమయినందు వలన, తన స్వస్థితిని తెలుసుకోగల జ్ఞానం సంపాదించడానికి ప్రయత్నం మొదలు కావాలి. నేనెవరో కనుక్కొనే పద్ధతి కావాలి. అది జ్ఞానం వలన కలిగిన అనుభవం అనుభూతి కావాలి. జ్ఞానంతో కూడిన అనుభవం లేకపోతే, మేథోపరమైన తెలివితేటలు యెక్కడైనా యెప్పుడైనా తడబడతాయి. అందుకే భగవాన్ దృఢంగా 'నేనెవరు విచారణ జ్యోతిలా యీ తప్పుడు గ్రహింపును నాశనంచేసి, సత్ అయిన 'నేను'ను ఆవిష్కరిస్తుంది. ఈ విచారణ చాలా సరళం సూటి అయిన సాధనం. ఇది అహంకారం నాశనం అయిన సహజ స్థితిని తెలియపరుస్తుంది. ఏమైనా వేరే తలంపు వచ్చినపుడు, యీ తలంపు యెవరికి కలిగినదో ప్రశ్నించు, నాకు అని జవాబు వస్తుంది. యీ నేను యెవరు? తలంపులు యెన్నో లేచి వస్తుంటే, అంతర్ముఖమై అవి యెక్కడ నుంచి పుడుతున్నాయో గమనించు, వెదుకు. ఆ చోటనే వాటిని మూలంలోనే కత్తిరించు. ఇదే సరి అయిన ఫలితమిచ్చే పద్ధతి, సాధన, మార్గం.

భగవాన్ యింకా ఆచరణలో జరిగేవి తెలిపారు. ఒకరు విచారణ చేస్తుంటే ఫలితాలు కనుపించలేదని అంటే 'జవాబు రావడానికి యిది సాధారణ మానసిక ప్రశ్న విచారణ కాదు. ఇది మనసును తన మూలంవైపు మళ్ళించడానికి ఒక సాధనం మాత్రమే. ఈ విచారణను నీవు స్థిరంగా, దృఢంగా చేయాలి. ఈ పద్ధతిని ప్రతీ తలంపు, భావన వద్ద మళ్ళీ మళ్ళీ చేస్తుంటే, నీ అహంకారం, నేను అనే భావనపై నీ ధ్యాస అంతా లగ్నం అవుతుంది. ఈ అహంకారం మూలాన్ని

అన్వేషించు. చేరుకోవడానికి ప్రయత్నించు. నీ యీ ఒకే ఒక ధ్యాస ప్రయత్నంతో విచారణ సాధన చేసి ఆ స్థితిని చేరుకుంటే, నిన్ను ఆ ప్రశాంత ఆనందస్థితి నుంచి యింక యేదీ యెవరూ మార్పు చేయలేరు' అని తెలిపారు.

రమణులు తెలిపిన యీ విషయముల నుండి రెండు సంగతులు తెలుస్తున్నది. ఒకటి, నిలకడగా నిరంతరంగా లోలోనికి 'నేను' పై ధ్యాస మళ్ళించి విచారణ సాధన చేయడం. రెండవది, యీ పద్ధతి యేమిటీ, యెందుకు, ఉద్దేశమును సరిగ్గా అర్థం చేసుకొనడం. ఈ రెండింటినీ గ్రహించడానికి, సద్గురు భగవాన్‌పై ఆధారపడి, వారి అనుగ్రహం మార్గదర్శకత్వంను స్ఫురణలో ఉంచుకోవాలి. ఈ నేను యెవరు? విచారణ పద్ధతి గురించి అన్ని ప్రశ్నలను, సమస్యలను, మెలకువలను, ఫలితాలను, గమ్యాలనూ భగవాన్ శ్రీరమణ మహర్షి, 54 సంవత్సరములు యెంతో కరుణాసముద్రులై ఓర్మిగా తన అనుభవం అనుభూతియే ఆధారంగా యెందరికో బోధించారు, వివరించారు. ఎవరైనా యీ బోధనలను తెలుసుకోవచ్చు. ప్రతీవారికి తన స్థాయికితగ్గ, తను అంతర్ముఖమైన స్థితినిబట్టి, సద్గురు రమణుల అనుగ్రహం, మార్గదర్శకత్వం యిప్పుడూ, యెప్పుడూ దొరుకుతుంది. ఈ విచారణ పద్ధతి కొనసాగిస్తున్న వారి శిష్యులు, భక్తులనుంచీ, సహాయం అందుతుంది. ఎవ్వరైనా వారి సహాయం, అనుగ్రహం కోరుకుంటే చాలు. భగవాన్ అనుగ్రహం అపజయమే లేని సద్గురు మార్గదర్శకత్వం వారికి కలుగుతుంది. మనసుయొక్క సహజజ్ఞానం వికసిస్తుంది. అపుడు తలంపులు, భావాలు వచ్చినా వెంటవెంటనే అణగిపోతాయి, ఆగిపోతాయి. అలాగే చేయవలసిన కార్యాలు కూడా. అవసరం అయినపుడు కార్యాలు చేస్తారు, అవసరం లేనపుడు, అవసరం తీరిపోయినపుడు కర్మల గురించి కోరుకొనరు. తలంపులుండవు. ఆత్మ స్వరూపానికి మానసిక రూపమైన మనసు తన సహజ ఆనందసాగరంలో మునిగి ఉంటుంది.

అధ్యాయం - 4

గతాన్ని విస్మరించు - వర్తమానంలో జీవించు

ఒకచోట కొంతమంది కలసి భోజనం చేస్తున్నారు. భోజనం కోసం రకరకాల వంటలు, కూరలు, పదార్థాలు చాలా ఉన్నాయి. అయినాసరే, వారి మనస్సులు యెంతో చురుగ్గా ఉండి, వారి వారి మనస్సుల అనుభూతుల గురించి మాటలు ప్రారంభమయ్యాయి. ఒకరు 'నా మనస్సు పరుగులను నేను యేమీ అర్థం చేసుకోలేకపోతున్నాను. కొన్నిసార్లు చురుగ్గా ఉంటుంది. కొన్నిసార్లు అసలు బద్ధకంగా కదలదు. కొన్నిసార్లయితే చాలా ప్రశాంతంగా ఉంటుంది. ప్రశాంతంగా ఉన్నపుడు మాత్రం యీ ప్రపంచాన్నే జయించినట్లు ఉంటుంది. పనిలో కూడా ఆనందంగా ఉంటుంది. ఏమీ పనిలేనపుడు మాత్రం అన్ని రకాల చెత్త తలంపులు పుట్టుకు వస్తాయి. మరి యీ మనస్సు యెందుకో యింత అర్థంకానిదిగా ఉంది'.

మీరు ఊహించుకున్నది, అందరు అనుకోవడంలాగే తప్పే అయి ఉంటుంది. ఈ సమస్యను మొదటిగా యెంచుకుని, ప్రస్తుతం దీన్ని ప్రక్కన ఉంచి, తరువాత దీన్ని చర్చిద్దాము.

ఇంకొకరికి మనస్సు వలన యింకో రకమైన సమస్య ఉంది. దీన్ని సమస్య : 2 అందాము. అది 'అంతా యెంతో చక్కగా ఉన్నపుడు, నేను యెంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉన్నపుడు, ఒక్కసారిగా అకస్మాత్తుగా విచిత్రంగా దానికి వ్యతిరేక వాతావరణం అలుముకుంటుంది. మనసంతా పొడి పొడిగా అయిపోతుంది. ఏమీ తోచనట్లు ఉంటుంది. ఏ పనిలో కూడా ఆసక్తి, సంతోషం ఉండదు. ఆఫీసులో పనిలాగే, రమణుల రచనలు కూడా ఆసక్తికరంగా ఉండవు. మరి యీ మనసెప్పుడూ ఒకలాగ ఉండక గజిబిజిగా, ఎగుడు దిగుడులుగా ఉంటుంది. ఇవి తికమకలుగా ఉంటాయి'.

మూడోవారి సమస్య : 3 'నాకు 29 సం॥ల వయసులో, జీవితంలో ఆత్మజ్ఞానం ఒక్కటే తెలుసుకొనవలసినది అనిపించింది. మిగతా అన్నీ కూడా వ్యర్థమైనవే. నేను సాధారణ సాధనలేకాక రమణులు బోధించిన విచారణ కూడా చేశాను. ఇలా యీ 30 సంవత్సరములలో నేను సాధనచేస్తూ, యిపుడు చూసుకుంటే నాలో అభివృద్ధి యేమిటో తెలియడంలేదు. ఇంకా నేను చిన్న చిన్న

విషయాలకు, యింట్లో పనివాళ్ళ తప్పులకు, తోటి పనివాళ్ళ అశ్రద్ధకు ఆందోళన చెందుతూనే ఉన్నాను'.

ఒక యువ విద్యార్థి 'సమస్య' క్లాసులో యేమి జరుగుతుందో పట్టించుకోకుండా, నేను పగటి కలలు కంటుంటాను. ఉపాధ్యాయులు చెప్పే దానిపై ధ్యాసపెట్టక, నా చుట్టూ అందరూ యేమి చేస్తున్నారో గమనిస్తుంటాను. నా ఊహల్లో, ప్రపంచంలో విహరిస్తూ ఉంటాను.

చివరిగా, యింకొకరి మనసులో అందరిపట్ల అసూయలు నిండి ఉన్నాయి. మనస్సు నిండా వివిధమైన రకాల తలంపులు నిండిపోయి, ఒకదానితో యింకోటి పోటీ పడుతుంటాయి. మనసెపుడూ ఆలోచనల వరద ప్రవాహంలా ఉంటుంది. ఒక తలంపు నుండి, యింకో దానికి దాటుతూ నిలకడే ఉండదు. ఏదీ స్పష్టంగా ఉండదు. ఇన్ని ఆలోచనల వలన మనసు బలహీనంగా శక్తి విహీనంగా ఉంటుంది.

ఇలా ఒక్కొక్కరి మనస్సూ ఒక్కొక్కలా ఉంటుంది, వాటిల్లోని తలంపులు వేరే వేరే కాబట్టి. ఈ ప్రపంచంలో యెంతమంది మనుషులుంటే అన్ని రకాల మనసులు ఉన్నట్లు చెప్పవచ్చును. వారి వారి మానసిక ప్రవృత్తులు అన్ని రకాలుగా ఉంటాయి. వివిధ గుణాల ప్రభావం, మనసులోని ఒడిదుడుకులు, మెతకదనం, చురుకుదనం, ప్రశాంతం ఒక్కొక్కరిలో ఒక్కొక్కలా మారుతూ ఉంటాయి. ఇలాంటి అందరి మనసుల స్వభావాలను విశ్లేషించి మనస్సు యిలా ఉంటుందని ఒక అభిప్రాయానికి రావడం అసాధ్యం.

తలంపుల రూపంగా మనసును చూసినపుడు యీ సమస్యలకు సమాధానం యెప్పుడూ దొరకనే దొరకదు. లెక్కలేనన్ని అనంతమైన గత జ్ఞాపకాలు (వాసనలు, సంస్కారాలు) మనసులో నిక్షిప్తమై ఉండి, వాటికి అనువైన పరిస్థితుల్లో మంచి, చెడు రకరకాల తలంపులుగా లేస్తాయి. నీ తలంపులను నువ్వు చూస్తున్నపుడు జరిగేదేమంటే నీ మొత్తం గతంవైపు నువ్వు చూస్తున్నావు. దానివలన వాటి వలయంలో యిరుక్కుంటున్నావు. ఈ గతం తాలూకా భారం నుంచే నువ్వు తప్పించుకోవాలి. భారం అని యెందుకన్నామంటే అవి నీపై సవారీ చేస్తూ నిన్ను వర్తమానంలో జీవించకుండా చేస్తాయి. నీ 'వర్తమాన మనసు'ను ప్రభావితం చేసి సహజంగా ప్రవర్తించకుండా చేస్తున్నాయి. రమణులు యీ వచ్చే తలంపులపై ధ్యాస ఉంచితే అవి యింకా బలమౌతాయని చెపుతారు. ఎంత యెక్కువ ధ్యాస దానిపై ఉంచితే, ఆ తలంపు నిన్ను అంతగా దారి

మళ్ళిస్తుంది. అందుకే రమణుల హాస్యపు మాటలో అంత అర్థం యిమిడి ఉంది. 'కోరికలను నువ్వు అసలు వదలివేయాల్సిన అవసరం యేమీలేదు, నీ తలంపులను మాత్రం పూర్తిగా విడిచెయ్'. నువ్వు తలంపులపై ధ్యాస చూపించినంతకాలం, అవి అనంత ప్రవాహంలా పొంగుతూనే ఉంటాయి. మనం, మనస్సులో నిక్షిప్తమై ఉన్న తలంపులపై దృష్టి ఉంచితే, మనం వాటిచే తప్పక బాధితులమవుతాము.

మరి యీ సమస్యకు పరిష్కారం యేమిటి? భగవాన్ మళ్ళీ మళ్ళీ పదే పదే దృఢంగా 'నీ మనస్సులో లేచే తలంపులపై అసలు ధ్యాస దృష్టి నిలుపక వాటిని పోనీ, విడిచెయ్, వదిలెయ్' అని చెప్పేవారు. 'అంతేకాకుండా మనసులోని విషయాల వైపుపోకుండా, అంటే గత జన్మల్లో నువ్వు ప్రోగుచేసుకున్న మలినాల వైపు నువ్వు పోకుండా వాటికి దూరంగా నీ దృష్టిని మళ్లించాలి. అందుకే మనసు అంటే యేమిటో తెలియాలి' అనేవారు. అంటే ఆలోచించేవాడిపైన మనసును కేంద్రీకరించి లగ్నం చేయాలి. ఈ తలంపులు యెవరికైతే వస్తున్నాయో వానిపై ధ్యాస నిలబెట్టాలి. తలంపులను, తలంచేవాడికే కట్టబెట్టి ప్రశ్నించడం తప్పనిసరిగా చేయాల్సిందే. అందుకోసం రమణులు చెప్పినవి :

ప్రశ్న : మనస్సును యెట్లా నిశ్చలం చేయాలి?

జవాబు : మనసుతో, మనసుపైనే దృష్టి పెడితే దాన్ని నిశ్చలం చేస్తుంది.

ప్రశ్న : తన నిజతత్త్వం, సహజస్థితిని కనుక్కోవడంలో ఆటంకాలను తాను యెలా తొలగించుకోవాలి?

జవాబు : ప్రతీ తలంపుకూ మూలాన్ని వెదుకు, తలంపు పుట్టు స్థానం కనుక్కో అది మనస్సే. ధ్యానంలో అలా 'నేను'ను వెదుకు. 'నేను యెవరో' వెదుకు. ఎప్పుడూ యే తలంపునూ ప్రవర్తింపనీయకు. వాటికి స్పందిస్తే, అంతం ఉండదు. ప్రతీ తలంపును వాటి పుట్టుస్థానం – మనస్సుకే మళ్ళీ మళ్ళీ ప్రతిసారి స్పందించకుండా ప్రశ్నించి తీసుకునిపో. అపుడు ఆ తలంపు, మనసూ, రెండూ, ప్రశ్నలు నిరాసక్తత వలన లేకుండా నశిస్తాయి. మనసు తలంపుల రూపంలోనే మనగలుగుతుంది. తలంపులు పోతే, నాశనమైతే, యిక మనసు అన్నది లేనేలేదు. సందేహం, నిస్పృహ కలిగినపుడెల్లా 'ఈ సందేహించే వాడెవరు? నిస్పృహ కలిగినదెవరికి?' అని ప్రశ్నించి వెదకి విచారణ చెయ్. ప్రతీసారీ నిరంతరంగా స్థిరంగా యీ ప్రశ్నకే వెళ్ళు. యీ 'నేను' యెవరు? అది యెక్కడ నుంచి? మూలమైన ఆధారం తప్ప యింకేమీ లేకుండా మిగలకుండా చింపి, చింపి

పొరెయ్. అదే నువ్వు. అపుడు వర్తమానంలోనే జీవించు. దానిలో మాత్రమే ఆనందించు. ఇక మనసులో యేదీ, భారమై భావించే గతంగానీ, భవిష్యత్తు గానీ లేవు. ఉండవు. వర్తమానం మాత్రమే. అదే నీ సహజస్థితి. సర్వశక్తివంతం, చైతన్యం, పరమానందమే అయినది.

తలంపులను కేంద్రం మూలానికి తీసుకుని పోతున్నపుడు, మనస్సులో నిండి ఉన్న ఎన్నో వివిధ రకాల తలంపుల మహాసాగరాన్ని మధించినట్లే ఉంటుంది. నువ్వు మనస్సును తన మూల స్థానంలోనికి మరల్చి నిలిపినపుడు, యినుపరజమును అయస్కాంతము ఆకర్షించినట్లు, నీలోని ఆత్మచైతన్యము తన శక్తితో ఆ మనసును తనలోనికి గుంజుకుంటుంది. అపుడు ఆ మనస్సు ఎరుకలో, హృదయంలో కలసిపోతుంది. దాని తరువాత మనసు వేరుగా లేవడం జరుగదు. శుద్ధమైన మనసుకు కూడా సాధారణ యింద్రియ శక్తులు, జ్ఞాపకం, విచక్షణ, తర్కం అన్నీ ఉంటాయి. తేడా యేమిటంటే, అవన్నీ అహంకారపూరితంగా కాకుండా ఆత్మగానే ఉంటుంది. తలంపుల భారం లేకుండా వర్తమానంగానే ఉంటుంది. ఎప్పుడూ అలానే ఉంటుంది. అలాంటి మనసు ఎప్పుడూ యేది అవసరం అయితే అంతవరకు స్పందిస్తుంది. పరిపూర్ణంగా పూర్తిగా ప్రవర్తిస్తుంది. శుద్ధ నిర్మల మనసు అంటే ఆత్మ (నేను) వలననే అన్నీ చేయడం, మాట్లాడడం, స్పందన, ప్రవర్తన జరుగుతుంది. మనసు మలినాలు, యెన్నో విధాల అస్థిర గుణాల నుండి విముక్తి పొందుతుంది. ఆత్మలోనే నిలచి ఉంది కాబట్టి ఆ మనసు బ్రహ్మానందం అనుభవిస్తూంటుంది. దేశకాలాల కతీతంగా సదా ఉంటుంది. వర్తమానం అంటే 'ఇక్కడ' 'ఇప్పుడు'. ఇవి అన్నిచోట్లా అన్నికాలాల్లో ఉంటాయి. అంటే ప్రదేశానికి, కాలానికి అతీతం. అంటే ప్రదేశం కాలం లేనివే శుద్ధ మనసుకు. ఉన్నదంతా సత్ (నువ్వు/నేను), దాని అఖండ శాంతం, మౌనం, బ్రహ్మానందం, అనంత చైతన్యం.

అధ్యాయం - 5

జీవించి ఉన్నది యెవరు? మరణించేది యెవరు?

ఓ! అరుణాచలా!

సంసార సాగర సంకటములఁ గుదుర్చు నరుణాచలా! నాకు శరణమౌ ప్రభూ! నా తల్లి జ్వరమును గుదుర్చుటకు నీవు గా కెవరున్నారు?

కాలకాలుఁడా! నాకు నీవే శరణము. నీయనుగ్రహమును నా తల్లిపై జూపి మృత్యువు నుండి రక్షింపుము. విమర్శించి చూడఁగా మృత్యువెవరు?

అరుణాచలా, జ్ఞానాగ్ని, నీ తేజస్సు నా తల్లి నావరించి తనలో నైక్యముఁ జేసికొనునుగాక. చితాగ్ని పాలామె యెందుకుఁ గావలెను?

మాయ మైకముఁ దొలంచు నోయరుణాచలా, నా జనని మైకమును (సంధి) బోఁగొట్ట నాలస్యమేల? నిన్ను శరణు బొందిన జీవుని కర్మములను నివారించి మాతృప్రేమతో రక్షించుటకు నీవుగాక మఱియెవరైననున్నారా?

- అమ్మ ఆరోగ్యం కోసం భగవాన్ ప్రార్థన

పుట్టినరోజు పండుగను జరుపుకుందామనుకుంటున్న మీరు కనీసం ఈ రోజున అయినా యీ పుట్టింది యెవరు? అని విచారణ చేయండి. జననం మరణం అనేవే లేని, సదా ఆత్మచైతన్యమయిన 'నేను'గా ఉన్నరోజే యెవరికైనా నిజమయిన జన్మదినం.

- భగవాన్ శ్రీరమణ మహర్షి

రమణుని బోధనలను, వాక్యాలను సరిగ్గా గ్రహించడానికి, తరచుగా వాడే కొన్ని పదాలను స్పష్టంగా అర్థం చేసుకోవడం అవసరం. ఇవి దేహం పుట్టుక, అహంకారం పుట్టుక, మనస్సు పుట్టుక, మనస్సు నాశనం, 'నేను'గా కొత్త జన్మ లాంటివి. దేహం జననం మరణం చక్కగానే అర్థం అవుతుంది. యివి పూర్తిగా భౌతికం కాబట్టి. తల్లి గర్భంలోంచి ప్రసవించినపుడు ఒకరు పుట్టారని, అలాగే దేహంలో నుంచి ప్రాణం పోగానే వైద్యపరంగా అతని మరణం అంటారు. జననం మరణం అనే రెండూ కూడా కర్మల కారణాల వలననే. దేహం పుట్టక ముందే నిర్ణయింపబడిన కర్మలను చేసేందుకు అనుభవాలను

పొందేందుకు జరుగుతున్నాయి. ఇలాంటి జననాలు యెవరికైనా వారి మనసు/ అహంకారం నాశనంకాక నిలచి ఉన్నంతవరకూ అనంతంగా మళ్ళీ మళ్ళీ కలుగుతాయి. అంటే మనసు/అహంకారం నాశనం అయితే 'నేను' (ఆత్మ)గా మేల్కొని యిక జనన మరణాలు లేని పరిపూర్ణ అనంత చైతన్యులుగా ఉంటారు.

మనసు నాశనం అంటే యేమిటని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే యింకా లోతుగా పరిశీలించాలి. సరిగ్గా చూస్తే, మనసు అంటే తలంపుల తరంగాలే. అవి నిరంతరంగా క్షణక్షణం ప్రవాహంలా మారుతూ, నేను అనే భావన (అహంకారం) కేంద్రంగా చుట్టూ అల్లుకుని తిరుగుతాయి. అవి 'నేను' అనే భావన ఉన్నవాని (వ్యక్తి) ధ్యాసపై ఆధారపడి ఉంటాయి. రోజూ జరుగుతున్న గాఢ నిద్రావస్థ (సుషుప్తి)లో తలంపులు దానికవే ఆగిపోతాయి, లేవు. ఈ అవస్థలో తలంపులుగాని, అవి ఆధారంగా, కేంద్రంగా చేసుకున్న వ్యక్తి (అహంకారం) గాని రెండూ లేవు, పోయాయి. అంటే మనసు లేదు. మనసంటే తలంపులు, అందులోని ప్రథమ తలంపు నేను అనే భావన (అహంకారం/వ్యక్తి), మిగతా అన్ని తలంపులూ దీన్ని కేంద్రంగా అల్లుకునేవి. గాఢనిద్రావస్థను మనసు తాత్కాలిక మరణం అని చెప్పవచ్చును. రోజూ కొన్ని గంటలసేపు నిద్రావస్థలో, మనసు లేదు. ఆ సమయంలో 'నేను' 'నేను'గా ఉంటుంది. ఈ సుషుప్తినుంచి మేల్కొనగానే, స్వప్నావస్థలో అయినా సరే, ఆ ప్రథమ తలంపు 'నేను అనే భావన' (వ్యక్తి భావన) దాని కేంద్రంగా ఆధారంగా మిగతా అన్ని ఆలోచనలూ, భావనలూ లేస్తాయి, మళ్ళీ నిద్రావస్థ వచ్చేవరకూ. అంటే నిద్రావస్థలోంచి మెలకువలోనికి (జాగ్రదవస్థ) గాని, కలలోనికి (స్వప్నావస్థ) గాని మారినపుడు మనసు మళ్ళీ జన్మిస్తుందని చెప్పవచ్చు. ఈ మెలకువలోగాని, కలలోగాని మనసు లేచినది తాత్కాలిక జననం, మళ్ళీ నిద్రావస్థలో మనస్సు తాత్కాలిక మరణం రోజూ జరుగుతున్నవే.

ప్రతిరోజూ జరిగే యీ తాత్కాలిక మరణం, జననం గురించి భగవాన్ ప్రత్యేకంగా వివరించి చెప్పేవారు. దేనికోసం అంటే తలంపులు లేని స్థితి అంటే యేదో ఘోర విపత్కరమైనదిగా ఉన్న భయాన్ని పోగొట్టేందుకు. ఇది రోజూ జరుగుతున్నదే. దాని నుంచి యెవరూ పాడవటం లేదు, బాధపడడం లేదు సరికదా యింకా శక్తి పుంజుకుని తాజాగా ఉంటున్నారు. ప్రతీరోజూ నిద్రావస్థలో యెంతో ఆనందాన్ని పొందుతున్నారు. ఇదే ఫలితాన్ని, స్ఫురణతో 'నేను యెవరు విచారణ' చేస్తున్నా కలుగుతుంది అని భగవాన్ చెప్పేవారు. 'నేను'పై ధ్యాస దృష్టి

పెట్టినపుడు, తలంపులు లేవడం తగ్గుతుంది. వాటిపై శ్రద్ధ చూపే వ్యక్తి లేకపోతే, దృష్టి పెట్టకపోతే, అవి యిక రావు, ఆగిపోతాయి. అపుడు చివరిగా 'నేను అనే భావన' (అహంకారం/వ్యక్తి భావన) కూడా లేకుండా పోతుంది. మెలకువలో అది యెక్కడ నుంచి పుట్టి లేస్తున్నదో, అదే స్థానంలో (హృదయంలో) మూలంలో కలసిపోతుంది. ఈ స్థానమే మనలో ఉన్న దివ్యత్వానికి కేంద్రం. 'నేను' ఉండే స్థానం, నివాసం. అందుకే, విచారణ స్ఫురణతో చేయగా, చేయగా నాశనంలేని శాశ్వతమైన అక్షయం అవ్యయం అయిన 'నేను'తో కలుపుతుంది. మనసు తనకు యెన్నో జన్మల నుండి యెంతో బలంగా అలవాటయిన బాహ్యంలో చరించడం మెల్లగా తగ్గుతూ, గత జన్మల వాసనల వలన బయట ప్రపంచంలోని ఆనందం వెదకడం ఆగిపోతుంది. ఆత్మయొక్క బ్రహ్మానందం సదా అనుభవిస్తుంది.

ఒకసారి వ్యక్తి (అహంకారం), దాని తలంపుల మధ్య కత్తిరింపు జరిగిందో, అపుడు మనసు యొక్క నిజమైన, సహజమైన స్వభావం తెలుస్తుంది. అది యేమిటి? అది ఆత్మ (నేను) యొక్క ప్రతిబింబమే, అందుకే అది నిర్మలం శుద్ధమే. అలాంటి మనస్సు దేనికయినా వెంటనే స్పందిస్తుంది. మలిన మనసు అనంతమైన తలంపులలో యిరుక్కుంటుంది. శుద్ధ మనసుతో జీవనం యెంతో సామరస్యంగా పరిపూర్ణ చైతన్యం ఆనందంతో సదా సాగుతుంది.

ఇదంతా చెప్పడానికి చక్కగా ఉంది. కానీ రమణులు యీ సత్యాన్ని యెట్లా గ్రహించారు. ఇది కూడా తెలుసుకోవాలి మనం. యెందుకంటే భగవాన్ బోధించేదంతా తన స్వంత అనుభవాలు, అనుభూతినుంచే. భగవాన్ వాటిని అందరితో ఆనందంగా పంచుకుంటారు యెంతో దయతో. రమణులు, జీవితంలో మరణ సంఘటనలను ఐదుసార్లు యెదుర్కొన్నారు. మొదటిది, 1892వ సంవత్సరములో తన 12 యేళ్ల వయసులో. తన తండ్రి మరణించి, శవం నేలపై ఉన్నది. తన అమ్మగారు, తమ్ములు, బంధువులు అందరూ రోదిస్తున్నారు. ఈ దృశ్యం రమణుని శోధించేటట్లు చేసింది. జీవిస్తూ ఉన్న తన తండ్రి శరీరం నుంచి యేమిటి వెళ్ళిపోయింది, అది శవంలా అచేతనంగా యిలా పడి ఉండటానికి? తను జీవించే ఉన్నాడు. మరి తేడా యెలా వచ్చింది? శవదహనం జరిగిపోయిన తరువాత కూడా భగవాన్ యెన్నో గంటలు యీ ప్రశ్నలతో సతమతమవుతూనే ఉన్నారు. అంతిమంగా ఒక అభిప్రాయానికి వచ్చారు. "ఏదో 'నేను' అనే ఒక శక్తి వలన శరీరం నడుస్తుంది, చూస్తుంది, తింటుంది, పని చేస్తుంది. నాకు యీ 'నేను' గురించి స్ఫురణ ఉన్నది. కానీ నా తండ్రిలోని

'నేను' ఆ శరీరాన్ని వదలిపోయింది'. అంత చిన్న వయసులోనే, భగవాన్ జీవనం, మరణం గురించి ప్రశ్నలను చాలా దగ్గరగా పరిశీలించారు.

తరువాతది, నూతనశకయుగారంభ చరిత్ర సృష్టించిన జూలై 17, 1896 సం॥లోని సంఘటన. చనిపోవడం గురించిన తనను ఆవహించిన తీవ్ర భయం, అసలు మరణం అంటే యేమిటి అని పరీక్షించి పరిశీలించేటట్లు చేసినది. ఈ శరీరం చనిపోతే, 'నేను' కూడ మరణించినట్లేనా? ఈ ప్రశ్న తన మనసును అంతర్ముఖం చేసి, తాను (నేను) మరణంలేని శాశ్వతమైన సర్వత్ర సర్వకాలాల్లో అంతటా నిండి ఉన్న బ్రహ్మమే అని తెలిసింది. బ్రహ్మం, సత్, ఆత్మ అదే 'నేను'. ఈ స్ఫురణ, సంగీతరాగాల వెనుక ఉన్న నిరంతర శ్రుతిలా, తనలో స్థిరంగా అనంతంగా ఉంది. భగవాన్ మనసు నాశనం అయింది. బాహ్య ప్రపంచంలో చరించి, ఆనందం వెదకడం అంతం అయింది. పరిపూర్ణ చైతన్యమైన 'నేను' యొక్క శుద్ధ నిర్మల ప్రతిబింబం అయింది మనసు. భగవాన్‌కు కాలం మరణం లేని సత్‌ను తెలుసుకున్న వాని సత్ దర్శనం కలిగింది.

ఇంకోసారి 1912వ సంవత్సరంలో జరిగింది. భగవాన్ పచ్చయ్యమ్మన్ కోవిల నుండి విరూపాక్ష గుహకు కొంతమంది భక్తులతో కలసి తిరిగి వస్తూ ఉండగా, తన కళ్ళముందు ప్రకాశవంతమైన తెల్లని తెరలా వచ్చి యింకేమీ కంటికి కనుపించలేదు. ఆ సంఘటన గురించి రమణులే స్వయంగా యిలా వివరించారు.

'నా ముందున్న దృశ్యాలన్నీ మాయమైపోయి నా కంటిముందు ఒక ప్రకాశవంతమైన తెల్లని తెరలా వచ్చి నాకూ, ప్రకృతికి మధ్య నిలచి, ప్రకృతిని కనుపించకుండా చేసింది. ఇది మెల్లగా జరిగి, నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. మొదట నాకు ప్రకృతి కొంచెం మాత్రమే కనుపించి, మిగతాది తెర వలన మరుగైంది. ఇది మెల్లగా కిటికీ తెరను మూసి దృశ్యాన్ని కప్పినట్లుంది. ఇలా అనుభవం జరుగగానే, యిక నడక ఆపేశాను, లేకపోతే క్రింద పడతానని. ఆ తెర పోగానే మళ్ళీ నడక మొదలుపెట్టాను. మళ్ళీ రెండవసారి, దృశ్యం మరుగుపడి, మగతగా ఉంటే ఒక రాయికి, అది పోయేంతవరకూ చేరబడ్డాను. మళ్ళీ మూడవసారి జరిగితే, కూర్చుంటే మంచిదని, ఆ రాయి వద్ద కూర్చున్నాను. అపుడు ఆ ప్రకాశమైన తెల్లని తెర నా చూపును పూర్తిగా మూసివేసినది. నా తలలో యేదో ఈదుతున్నట్లు ఉండి, రక్తప్రసరణము, శ్వాస ఆగిపోయాయి. చర్మం అంతా చిక్కని నీలం రంగుగా మారిపోయింది. ఇది సాధారణంగా దేహం

మరణంలో జరిగినట్లే, రాను రానూ చిక్కగా మారింది. నాతో ఉన్న వాసుదేవశాస్త్రి నేను చనిపోయానని, నన్ను కావలించుకుని, గట్టిగా యేడుస్తూ నా మరణం గురించి రోదించసాగాడు. అతని శరీరం వణకసాగింది. నాకు చూచాయగా అతను నన్ను పట్టుకోవడము, వణకడం, అతని రోధన తెలుస్తూనే జరిగింది, అర్థం అవుతూ ఉంది. దేహం రంగు మారినది కూడా తెలుస్తూ, గుండె ఆగిపోవడం, శ్వాస ఆగిపోవడం కూడా తెలుస్తూనే ఉంది. దేహంలోని వివిధ భాగాలు బిర్ర బిగుసుకుపోవడం అర్థం అవుతూ ఉంది. అయినా నా సాధారణ మామూలుగా ఉండే స్ఫురణ ప్రవాహం ఆ స్థితిలో కూడా ఆగలేదు, కొనసాగుతూనే ఉంది. నాకేమీ భయం కలుగలేదు. ఆ దేహస్థితి గురించి యెలాంటి బాధ కలుగలేదు. నేను రాయి ప్రక్కన మామూలు ఆసనంలో కూర్చోగానే కళ్ళు మూసుకున్నాను గానీ రాయిపై చేరబడలేదు. దేహంలో రక్తప్రసరణ, శ్వాస లేకపోయినా సరే అదే ఆసనంలోనే దేహం యింకా ఉన్నది. ఈ స్థితి సుమారు ఒక పదిహేను నిముషాల వరకు నిలచింది. అప్పుడు ఒక్కసారి విద్యుత్ ఘాతంలా దేహంలో అనిపించింది. ఎంతో శక్తితో రక్తప్రసరణ, శ్వాస మొదలై గుండె పనిచేయడం మొదలయింది. శరీరం అంతటా ప్రతీ అణువులో స్వేదన మొదలయింది. చర్మంపై జీవకళ మళ్లీ కనుపించింది. అపుడు నేను కళ్ళు తెరచి, లేచి నిలబడి 'పదండి వెళ్దాం' అన్నాను. ఏమీ కష్టం లేకుండానే విరూపాక్ష గుహ చేరుకున్నాము. ఇలా ఈ ఒక్కసారి మాత్రమే శ్వాస, రక్తప్రసరణ దేహంలో పూర్తిగా ఆగిపోయిన సంఘటన యిది.

ఇక్కడ పరిశీలనగా గమనించవలసిన విషయాలు యేమిటంటే, యీ మరణ సంఘటనలో భగవాన్‌కు యెలాంటి భయం లేశమైనా కలుగలేదు, తన 'నేను' స్ఫురణ యేమాత్రం ఆగలేదు, తగ్గలేదు. దీనివలన ఆత్మను (నేను) తెలుసుకున్న శాశ్వతమైన సత్ స్వరూపులకు, దేహ మరణం వలన యెలాంటి మార్పు ఉండదు.

భగవాన్ మరణ సంఘటనతో పరిచయం యింకొకసారి 1914వ సం॥లో జరిగినది. అమ్మకు టైఫాయిడ్ వచ్చి చాలా ఆపదలో ఉన్నది. ఈ సమయంలో అమ్మ ఆరోగ్యం నయంకోసం భగవాన్ అరుణాచలుని ప్రార్థించడం అందరికీ ప్రముఖంగా తెలిసినదే. అమ్మకు కూడా ఆత్మ దర్శనం జరిగి ఉంటే, దేహ, మరణం, శవ దహనం అర్థం లేకుండాపోయేవి. అందుకే అరుణాచలునికి ఆమెకు దేహంతో సంబంధం నుంచి విముక్తి చేయమని ప్రార్థన.

చివరి సంఘటన మే 19, 1922వ సంవత్సరంలో జరిగింది. అమ్మ, భగవాన్‌తో 1914 నుండి 1922 వరకూ ఉన్నది. వారి మార్గదర్శకత్వంలో చాలా పరిపక్వం చెందింది. ఆమె, భగవాన్‌కు శరణాగతి చెందింది. అందువలన అమ్మకు ముక్తి ప్రసాదించడం భగవాన్ బాధ్యత. అమ్మ చివరి దశలో ఆ రోజు, భగవాన్ అమ్మ కళ్ళపై ఒక చేయి, హృదయంపై ఒక చేయి వేసి పండ్రెండు గంటలు అలా అమ్మకు యెన్నో రాబోయే జన్మల కర్మల అనుభవాలను ఆ కొద్ది గంటల సమయంలోనే అనుభవింపజేశారు. భగవాన్ పవిత్ర చేతి స్పర్శ అమ్మ మనసును, మూలమైన హృదయంలో అణగద్రొక్కింది. ఎవరికైనా యీ దేహానికే మనం పరిమితమన్న భావన, బంధం, బానిసత్వం నుంచి విముక్తి పొంది జయం పొందాలంటే సద్గురువులు భగవాన్ అనుగ్రహం యెంత అవసరమో తేటతెల్లం చేస్తుంది.

జీవనం, మరణం గురించి తెలుసుకోవడానికి యింకా యేముంది? ఈ అయిదు సంఘటనలతో భగవాన్ మనకి మరణ అనుభవం గురించి తెలిపి, దాని నిజమైన అర్థం చూపించారు. ఎవరైనా నిరంతరం శ్రద్ధగా 'నేనెవరు విచారణ' చేస్తే, సద్గురువులు భగవాన్ అనుగ్రహంతోడై తన స్వస్వరూప దర్శనం జరిగి, వారు మరణమే లేని కొత్త పునర్జన్మ పొందుతారు.

అధ్యాయం - 6

దేహ జననం - మనసు నాశనం - ఆత్మజ్ఞానం

ఎవరైనా భగవాన్ బోధనలను తెలుసుకుని, వాటి అర్థాలను ఆకళింపు చేసుకునేటపుడు, చాలామంది సాధకులకు మౌలిక విషయాలైన జన్మ, మరణం, మనసు నియంత్రణ, ఆత్మజ్ఞానం లాంటివి కొంత మింగుడుపడవు. జన్మకు కారణాలేమిటి, దేహంతో మనసు అనుభవించే వాటికి సంబంధం యెలా యేమిటి? లాంటివి మనకు తెలిసింది లేదు. మనకి మన స్వస్వరూపం గురించి సత్యం (ఆత్మజ్ఞానం) తెలియదు. కానీ యివన్నీ ఒకటితో ఒకటి సంబంధం ఉన్నవే, సమగ్రమయినవే.

జన్మ అంటే యేమిటో చూద్దాం. మనం అనుకోవడంలో, గ్రహింపులో దేహం పుట్టడం మన జన్మ, ప్రాణం పోయి అది శవంగా అవడం మన మరణం అని. జననం, మరణం అనేవి శరీరానికి సంబంధించినవే, అవి తప్పనిసరి సంఘటనలని అందరూ అంగీకరించేదే. జననం, మరణం రెండూ వచ్చిపోయే దేహానికి సంబంధించినవి కాబట్టి, పునర్జన్మ ఉందా అన్న ప్రశ్న ఉదయిస్తుంటుంది. ఉంటే, యెప్పుడు, యెంత కాలానికి? ఇలా అడుగుతారు. భగవాన్, యీ దేహం జన్మించడం అనేది యే కారణం వలన జరిగింది అన్న విషయం లోనికి వెళ్ళకపోతే, నువ్వు మరణం గురించి భయపడుతూ బ్రతకాలి అంటారు. అందుకే యీ శరీరం జన్మించడానికి కారణం తెలియదు కాబట్టి, యెన్నో గర్భాల్లో నుండి యెన్నో జన్మ పరంపరలు వాటికవే కలుగుతాయి.

ఈ దేహం రావడానికి కారణం మనసు అని భగవాన్ స్పష్టం చేస్తారు. చూద్దాం. దేహానికి కారణం మనసా? ఇలా భగవాన్ యెందుకు చెప్పారా అని ఆశ్చర్యం కలుగుతుందా? ఎందుకంటే మనసు నిరంతరం ఆనందం గురించి కోరుతూ వెదుకుతూ ఉంటుంది. బాధల అనుభవాల నుంచి తెలుసుకుని వాటిని వదిలి దూరంగా ఉంటుంది. అసలు నిర్మల శుద్ధ మనసు సహజంగా ఆనందమయ మయినదే, కాని మలినాల వలన ఆ బ్రహ్మానందాన్ని మరచి అది మరుగై, అది ఒకటి ఉందని తెలుసు గుర్తు కాబట్టి ఆ శాశ్వత పూర్ణానందం కోసమై జన్మ జన్మల్లో వెదుకుతూ ఉంటుంది. అలా వెదుకుతూ, ఆనందాన్ని అనుభవించడానికి ఉపాధి (బండి, సాధనం)యే భౌతికదేహం. ఒక శరీరంతో జీవితం అంతం

అయిపోయింది అంటే అర్థం మనస్సు యొక్క కష్టసుఖాలు అనుభవాలు అయినట్లే, ఆ శరీరం ఉపాధిగా ముగిసినట్లే. ఆ అనుభవాలను కొనసాగించడానికి మనసు అపుడు యింకో భౌతిక శరీరం కోసం చూస్తుంది. మనసు/అహంకారం (అవి ఒక్కటే) దేహం లేకుండా ఉండలేదు. ఏదో శరీరంతో ఉంటుంది. అంటే ఒక భౌతిక శరీరం మరణంతో పాటు మనసు మరణించదు, కానీ అది ముందుకు సాగుతుంది, మళ్లీ మళ్లీ సంపాదించుకున్న వివిధ శరీరాలతో అనుభవాల కోసం.

అలా ఆనందం కోసం అన్వేషణలో, మనసుయొక్క విజయం-అపజయం గానీ, దాని కర్మలు, అంటే దాని ఆలోచనలు జ్ఞాన కర్మేంద్రియాలతో జరిగే చేతలన్నీ, మంచీ-చెడు, పాపం-పుణ్యం.... వాటన్నిటినిబట్టి ఉంటుంది. ఈ కర్మల ఫలితాలనుబట్టే రాబోయే దేహం యెలాంటి పరిస్థితుల్లో యెక్కడ పుట్టాలి, పెరగాలి, జీవించాలి అన్నది నిర్ణయమై, ఈశ్వర నియంత్రణలో సమానత్వము సంపూర్ణ న్యాయముతో జరుగుతుంది. అందుకే ఆ దేహాన్ని, కర్మదేహం అని పిలువబడింది. ఆనందం కోసం మనస్సు యొక్క అనంత అన్వేషణ కోరిక వలననే ప్రతీదేహం తయారయింది, వచ్చింది.

తరువాత యేమిటి? ఈ శరీరం ఒక సాధనం మాత్రమే. కాబట్టి దానిపై నువ్వు యేమీ శ్రద్ధ చూపకు. దానిమీద ధ్యాస, దృష్టి వలదు. ఈ జడమైన దేహం, దానిపై చూపబడే శ్రద్ధ, మమకారాల గురించి భగవాన్ 'ఈ శరీరం అది పుట్టకముందు లేదు, అది పంచభూతాలతో తయారయ్యింది. గాఢనిద్రలో అది నీకు లేదు. అది శవం అయిపోతుంది. అందుకే యీ జడమైన దేహాన్ని యెప్పుడూ ఒక శవంలాగానే ప్రక్కనపెట్టు' అన్నారు. 'ప్రక్కన పెట్టు' అన్నది నొక్కి చెప్పేవారు. అంటే దాని అర్థం నీ దృష్టి శరీరంపై కాదు, కానీ మనసుపై ఉంచి దాన్ని అర్థం చేసుకోవడానికి లగ్నంచేసి కేంద్రీకరించు అని.

మనం మనసువైపు చూస్తే, ఏం తెలుస్తుంది? 'చూస్తే' అన్నాం. యెందుకంటే యెవరూ దానిపై ఆసక్తి చూపరు కాబట్టి. మనసు ఉంది, అలాగే ఉంటుంది మనసు అని అనుకుంటారు. అంతవరకే కాని ముందుకు యిదేమిటి అని ప్రయత్నించరు. మనసును చూస్తే మాత్రం, దాని నియంత్రణ గురించి చాలా యెన్నో రకాల మాటలు వస్తాయి. చివరిగా, యెన్నో రకాల మాటల తరువాత చేతులెత్తేసి, అబ్బో! మనసును నియంత్రణ చేయడం సాధ్యంకాదు, ఒకలా ఉండకపోవడమే దాని స్వభావం అని తేల్చేస్తారు అందరూ సాధారణంగా.

భగవాన్ యిలాంటి నిర్ణయాలను సరైనవి కాదు అంటారు. ఎందుకంటే, యీ అభిప్రాయాలన్నీ కూడా, మనసు అన్నది ఒక స్వతంత్ర ఉనికి గలది అన్న ఆధారంగా కలిగినవి. మనసు నియంత్రణకు ఉన్న సాధనలు, పద్ధతులను భగవాన్ ప్రక్కన పెట్టమంటారు. ఎందుకంటే వాటితో మనసును నియంత్రించవచ్చు, కానీ ఆ నియంత్రణ ఆ సాధన చేస్తున్న సమయం వరకే పరిమితం. తరువాత మామూలే. యోగక్రియలవల్ల మనసును నియంత్రిస్తే, అది ప్రాణాయామం చేస్తున్నంతసేపు మాత్రమే అణగి ఉంటుంది. మానేయగానే, మనసు మామూలుగానే వివిధ తలంపులతో పరుగులు పెడుతుంది.

అందుకే, ఫలితం తాత్కాలికం మాత్రమే. 'మనసు అని ఒకటి స్వతంత్ర ఉనికితో వేరుగా ఉన్నదా? ఆలోచించే వాడియొక్క తలంపుల ప్రవాహమే మనస్సు కాదా?' అని భగవాన్ అడిగేవారు. ఆలోచించేవాడి ధ్యాస మారుతూ ఉంటే, తలంపులూ ఒకదానిపై నుండి యింకో దానికి వరుసగా మారుతూ ఉంటాయి. ఆ ఆలోచించేవాడి గురించి తెలుసుకుంటే, సత్యం తెలుస్తుంది. ఆలోచించే వాడిపై దృష్టి, ధ్యాస నిలిపి ప్రయత్నిస్తే తెలుస్తుంది.

మనం మరచిపోయి విస్మరించిన కొన్ని సత్యాలను భగవాన్ ఖచ్చితంగా చెపుతారు. 'మనసు అనేది పుట్టింది, దాన్ని మనం చూస్తున్నాము. అది లేకుండా కూడా మనం ఉన్నాము. ఇది మన అందరికీ, ప్రతివారికీ అనుభవమే, ఋజువు చేయడానికి'. మరి భగవాన్, యిది అందరి అనుభవమే అన్నారు. అలాగే అయి ఉండాలి కదా? కానీ అవునా? ప్రతీరోజూ అందరికీ గాఢనిద్రలో మనసు ఉండదు. మెలకువ రాగానే లేస్తుంది. అంటే ప్రతీరోజూ మెలకువ రాగానే మనసు పుడుతున్నది. గాఢనిద్రలో అది తాత్కాలికంగా మరణిస్తుంది. ఈ జరిగే దానంతటిని బట్టి, మనసుకు మూలం పుట్టుస్థానం యెక్కడ అని వెదకవలసిన అవసరం ఉంది. మనసు అంటే తలంపులే కాబట్టి, ఆ తలంచే వాడిపై దృష్టిపెడితే దాని మూలం తెలుస్తుంది. తలంచే వాడిపై ధ్యాస నిలిపి శోధించడం వలన, తలంపుల నుంచి కూడా విముక్తి కలుగుతుంది. మనసు దాని మూలం పుట్టుస్థానంలో కలసిపోతుంది. ఈ మూలమే సత్ అయిన 'నేను', ఆత్మ, సత్‌చిత్ ఆనందం, లోనున్న దివ్యత్వం. నిరంతర సాధన వలన మనసు మెల్లగా తన మూలంలో కలసిపోయి ఉంటుంది. ఒక రకంగా అది మనసు యొక్క మరణమే, కానీ అది నిర్మల శుద్ధ మనసుయొక్క నిజమైన జననం. ఎందుకంటే అది ఆత్మ చైతన్యంగా సహజస్వభావం అపుడు తెలుస్తుంది కాబట్టి. బుద్ధియొక్క శక్తి, జ్ఞాపకం, తర్కం,

విచక్షణ, గ్రహింపు లాంటి శక్తులన్నీ పూర్ణంగా అతి ఉన్నతంగా ఉంటాయి. ఈ మనసును శుద్ధమనసు, సత్త్వమనసు అని పిలువబడుతుంది. భగవాన్ 'మరణించిన మనసు, పూర్ణశక్తులతో జీవించి ఉంటుందని చెప్పడం విడ్డూరంగానే ఉంటుంది. కానీ జ్ఞానులు అలాగే జీవిస్తారు, పనులు చేస్తారు. మరి అంగీకరించాల్సిందే' అని అనేవారు.

మనసు తన మూలస్థానంలో కలసిపోగానే, యిక అది దేహాన్ని ఆనందం అన్వేషణ గురించి ఉపయోగించడం జరుగదు. మనసు తన సహజ అనంత బ్రహ్మానందాన్ని పొంది అనుభవిస్తూ ఉంటుంది మూల స్థానంలో. యిక అన్వేషణ ఉండదు. అందుకే శరీరాన్ని ఆనందం గురించి, కర్మలు చేసి వాడే అవసరం యిక లేదు. ఒకసారి శరీరాన్ని మనసు ఆనంద అన్వేషణ సాధనగా ఉపయోగించడం మానేసింది అంటే, యిక దేహం జన్మలు కలుగవు, ఉండవు. ప్రస్తుతం ఉన్న దేహం యిక యెంత మాత్రం మామూలుగా భౌతికమైనది కాదు కానీ, యే కర్మల కారణంగా అయితే యీ దేహం వచ్చిందో అవి పూర్తి అయ్యేంత వరకూ మాత్రం నిలుస్తుంది, ఉంటుంది. మూలస్థానంలో కలసి ఉన్న శుద్ధ నిర్మల మనస్సు ప్రకాశం, భౌతికదేహంలో కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే ఆత్మసాక్షాత్కారం కాగానే తన భౌతికదేహం ఒక దేవాలయం అవుతుంది.

అధ్యాయం - 7

నిత్య యవ్వనం - కుమార తత్త్వం

సాధారణంగా నిత్యయవ్వనం అంటే అమృతమూ లేక వయసు మీరిన వారు తిరిగి యవ్వనం పొందే చికిత్సలు గురించి అనుకుంటారు. కాయకల్ప చికిత్సతో వయసయిన దేహాన్ని మళ్లీ యవ్వన శరీరంలా తయారుచేస్తారు. భారతదేశంలో యిలాంటి చికిత్సలు ఉంది, ఎందరో ఆసక్తిగా వాటికోసం పరుగులిడేవారు. భగవాన్ ఒకసారి యిలాంటి చికిత్స గురించే చెపుతూ 'ఇలాంటి చికిత్సలు వందయేళ్ళ వేపచెట్టు, కర్పూరం లాంటి వాటి ఆధారంతో జరుగుతాయి. కానీ ఈ శరీరం గురించి అన్ని పాట్లు పడవలసిన అవసరం యేమిటి?' అనేవారు. ఈ చికిత్సల స్వభావమే మళ్ళీ, మళ్ళీ అని, అంతేగాని శాశ్వతంగా అనంతంగా అనికాదు. మనం నిత్య యవ్వనం అని అన్నపుడు యిలాంటి చికిత్సల గురించి కాదు.

దేహంసరే, మనసు గురించి యేమిటి? దాన్ని నిత్యయవ్వనంగా తయారు చేయవచ్చా? మనస్సును సదా యవ్వనంతో చురుగ్గా ఉంచగలిగే అమృతం యేమైనా ఉందా? చాలామంది విషయంలో, శరీరం యవ్వనంలో ఉండగానే, మనసు ముసలి అయినట్లు అలవాటుగా ఒకే గాడిలో పనిచేస్తుంటుంది. వార్ధక్యంలా అయిపోతుంది. దీన్ని మార్చగలమా? దీనికోసం అమృతంలాంటిదేమయినా ఉన్నదా? ఈ ప్రశ్నలను శోధించడం చాలా అవసరం. ఎందుకంటే, అందరూ సాధారణంగా జీవిస్తున్న జీవితం కంటే యెంతో ఉన్నతంగా ప్రమాణంగా ఉండగలిగే జీవనానికి యీ ప్రశ్నల్లో సమాధానాలున్నాయి.

మనం యవ్వనంలో ఉన్నపుడు, మన పరిస్థితులన్నీ చక్కగా ఉన్నపుడు, ప్రతీదీ యెంతో ఆనందదాయకంగా సాగుతూ ఉంటుంది. పార్కులకు, విహార యాత్రలకు, ఆటలకు, పోటీలకు, విందులకు యిలా యెన్నో కార్యక్రమాలు రోజూ ఒకదాని తరువాత ఒకటిగా వాటిలో మునిగి హాయిగా ఉంటారు. లేదా పర్వత శిఖరాలు అధిరోహించవచ్చు. కారడవుల్లో తిరుగాడవచ్చు. మనసు అమాయకంగా ఉండి, అన్నీ చూసి నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటుంది. భయం, అనుమానాలతో మూసికొనిపోదు. కోరికలెన్నో ఉంటాయి కానీ సందేహ, అలసట ఆటంకాలు ఉండవు. కానీ కోరికలు గాఢమైనవి కాదు పైపైవే. ఆ కోరికల

నుంచి సులభంగానే యేమార్చవచ్చు. శరీరం అంతా శక్తితో నిండుకుని ఉంటుంది. అంతటా అందం వెల్లివిరుస్తుంది. వాతావరణం ఆహ్లాదంగా, మరపించే తీయని గానంలా, అందం, ఆనందంతో నిండి ఉంటుంది.

అలా గడుస్తుండగా యెక్కడో మెల్లగా ఆ ఆనందాల హరివిల్లు మాయమవుతుంది. పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఉవ్వెత్తునలేచే సముద్ర కెరటాల్లా యెన్నో వందలు, వేలు తలంపులు, భావాలు, కోరికలు, ఆలోచనలు తరంగాలుగా ఒక దానివెంట ఒకటి అనంతంగా రావడం మొదలవుతాయి. కాలేజీల్లో నైపుణ్యం, చదువుల్లో పోటీలు, పోటీ పరీక్షలు, ర్యాంకులు... యింకా యింకా పైకి పైకి అని ప్రయత్నాలు, ఒకవైపు తల్లిదండ్రులు, రెండోవైపు సమాజంలో బుద్ధినైపుణ్యం అగ్రస్థానం సాధించడానికే అత్యంత విలువ, యీ రెండింటి మధ్య అమాయకత్వం నలిగి బలైపోతుంది. తాజా మొగ్గలను వాటి వాటి సహజ పరిసరాల్లో పరిమళంలో వాటి సహజత్వాన్ని చుట్టూ ఉన్న పరిస్థితులు పాడు చేయకుండా పూర్ణంగా వికసింపనివ్వరు. ఫలితంగా యవ్వనంలోని చురుకుదనం, అడ్డులేని మానసిక శక్తి ఆరిపోయి, యేదో పాత జ్ఞాపకాలుగా మిగిలిపోయి, దిగులుగా విచారంగా మారిపోతాయి పరిస్థితులు. దీనికి యేవో కొన్ని మినహాయింపు లుండవచ్చును.

ఇలాంటి పరిస్థితుల్లోనే భగవాన్ బోధనలు యెంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి. వాటిని ఆకళింపు చేసుకుని ఆచరిస్తే, నిజంగా నిత్య యవ్వనంగానే ఉంటారు. సదా కుమారులుగానే ఉంటారు. అంటే భౌతికంగా మీరు కుర్రవాళ్ళయిపోతారా? తెల్ల జుత్తు, బట్టతల ఆగిపోతుందా? మొహం మీద ముడుతలు పోతాయా? అలాకాదు. యెందుకంటే, తలంపుల ముసుగులో మూసిపోని విశాల శుద్ధ నిర్మల మనసుకూ, మానసిక అహంవృత్తుల బంధాలను త్రెంచుకున్న మనసుకు, దేహం దాని పరిస్థితి విశేషం యేమీకాదు, యెలాంటి సంబంధం ఉండదు, లేదు.

ఎల్లప్పుడూ, భగవాన్ మళ్ళీ మళ్ళీ గట్టిగా తెలిపే ముఖ్యమైనది, ఆనందం మన సహజ స్వభావమే. మనకి సహజమైనది యెప్పుడూ పోవడం, పోగొట్టుకోవడం అనే సమస్యే ఉదయించదు. అది జరుగదు, వేరు కాలేదు, చేయబడదు. తొలకరి మేఘాలు సూర్యున్ని కప్పిమూసినట్లు, సహజానందాన్ని మరుగుపరచడం జరుగుతుంది. అందుకే నువ్వు దాన్ని కనుక్కోగలవు. మన మలిన మనస్సులకూ ఆనందం ఆవిష్కరణ అంటేనే యెంతో ఉద్వేగం కలిగిస్తుంది. అదే ఆశ అంతా. ఈ ప్రయత్నంలో యెవ్వరూ ఒంటరిగా, నిస్సహాయంగా లేరు. సద్గురువులు

భగవాన్ శ్రీ రమణ మహర్షి, నిరంతరం తోడుగా అనుగ్రహం కురుపిస్తూ, మార్గదర్శకత్వం చేస్తూ, విచారణ మార్గం అనే చక్కటి గొప్ప రాజబాట రహదారిపై మనల్ని చేయి పట్టుకుని నడిపించుకు తీసుకుని వెళ్తారు.

భగవాన్ గట్టిగా చెప్పే యింకో విషయం యేమిటంటే, ఆనందం అనేది యెక్కడ ఉంది అని. మనలోనా లేక బాహ్యంలోనా? బాహ్యంలో అంటే మనకు బయట. అంటే మనసు బయట విషయాలతో తాదాత్మ్యం చెంది చరించేటపుడు, అంటే సంపదలు ఆస్తులతో, పదవులతో, పేరుప్రతిష్ఠలతో, శరీరంతో, రుచులతో, ప్రపంచంలోని విషయాలు వస్తువులతో, కుటుంబం బంధువులు యితర సంబంధాల వలన ఆనందం ఉందా? మనం గమనించితే, యీ బాహ్యంలో చరించే మనసు దుఃఖంలేని ఆనందం పొందదు అనేది స్పష్టం అవుతుంది. వాటి వలన తాత్కాలిక ఆనందం కలిగినా దాని వెంట యేదో రకమైన దుఃఖం, బాధ ఉండనే ఉంటుంది. ఆనందం పోతుంది, దుఃఖం మిగులుతుంది.

అందువలన దుఃఖమేలేని శాశ్వతమైన అఖండ ఆనందం అనుభవించాలంటే మనం లోనికి చూడవలసిందే. మనసు అంతర్ముఖమవుతూనే లోపల యీ ఆనందం యొక్క స్థానాన్ని, ఛాతీకి కుడివైపున ఉండే హృదయం అని భగవాన్ తన స్వంత అనుభూతి వలన చెప్పారు. మనలో అనంత పరమానందం ఉప్పొంగే యీ స్థానమే మనకు మరుగునపడి, యిప్పుడు కనుక్కోవడానికి ప్రయత్నిస్తున్నాము. మనసు తన అన్వేషణలో తాత్కాలిక ఆనందం పొందినపుడు యిక్కడ హృదయంలోకి తిరిగివచ్చి ఉండినపుడే ఆ ఆనందం అనుభవిస్తుంది. మళ్లీ బయటకుపోయి బాహ్యంలో చరిస్తుంది వివిధ రకాలుగా. ఎలాంటి ఆనందానికైనా స్థానం మనలోని హృదయమే. రమణ మార్గము సాధనచేస్తూ యిది సత్యమని మనం తెలుసుకుంటాము. ఎంతో బలమైన మన గత అలవాట్ల వలన, మనం దారితప్పించే మనసుకోరల్లో యిరుక్కుంటాము.

భగవాన్ గట్టిగా చెప్పే మూడో ముఖ్యమయిన విషయం, మనలో సహజంగా అంతర్గతంగా, మనసుతో సంబంధంలేని బ్రహ్మానందం యిప్పుడే, యిక్కడే యెవ్వరైనా సరే అనుభవించవచ్చు. అందుకేమైనా నిబంధనలు, నియమాలు, కఠిన ఆచారాలు ఉన్నాయా? రెండు ముఖ్యమైనవి మాత్రమే. సద్గురువుపై అచంచల అత్యంత దృఢవిశ్వాసం, భగవాన్‌యొక్క స్వంత అనుభవం అనుభూతి సత్యం, అది తప్పక మనకి కలుగుతుంది అని సంపూర్ణ విశ్వాసం. భగవాన్ యేదో ఒక రకంగా యెల్లప్పుడూ సదా తన శిష్యులను, భక్తులను

అనుగ్రహంతో చూస్తూ నడిపిస్తూనే ఉంటారు. ఇంకా 'సాధన, యింకా సాధన, సాధన'. బయట విషయాల నుంచి ఆనందం ఉంది అనే జన్మ జన్మల బలమైన అలవాటు తప్పుడు భావన, శ్రద్ధగా నిరంతర సాధనద్వారా మానుకోవాలి. సాధన వలన భగవాన్ బోధ యెంత సత్యమో కనుక్కోవాలి. విచారణ పద్ధతి దిశగావేసే ప్రతీ అడుగు మన ఆనందాన్ని పెంచుతూ ఉంటుంది.

ఎంతో బలమైన గత అలవాటు, బలహీనం అవుతూ ఉంటే, హృదయంలోని పరమానందం రుచి తెలుస్తూ ఉంటుంది. ఇది మానసికమైన ఆనందం కాదు. ఈ ఆనందం మనస్సు నిశ్చలమై, తన మూలంలోనికి పోయి, కలసిపోయినపుడు కలిగేది. అన్వేషించే ఆనందం లోపల లభించింది కాబట్టి ఆనందం కోసం కోరిక, బయట వెదుకులాట ఆగిపోతుంది. అపుడు నిశ్చలమైన మనసు, నిర్మలం శుద్ధమైన మనసు ఆ శాశ్వత బ్రహ్మానందంలో ఓలలాడుతూ అనుభవిస్తుంది. ఆది సద్గురువులు దక్షిణామూర్తి మౌనంలోనే ప్రసాదించిన ఆ సహజ స్థితిని యెవరు వర్ణించగలరు. అనుభూతి చెంది తెలుసుకోవలసినదే.

అధ్యాయం - 8

అందరికీ ఆహ్వానమే!

'తలంపులు లేని మనసు' గురించి మీకు ఒక ఆహ్వానం వచ్చిందనుకోండి. ఏం చేస్తారు? అంగీకరించి వెళ్తారా, నిరాకరిస్తారా లేక తికమకపడతారా? మీరు నిరాకరించే అవకాశమే యెక్కువగా ఉంది. ఎందుకు? మన జీవిత విధానంలో మన బుద్ధి మనల్ని నడిపిస్తూ ఉంది. బుద్ధి కూడా మనసే. జ్ఞాపకం, తర్కం, విచక్షణ, కోరుకొనడం, ఎంచుకొనడం, ఏకాగ్రతలకు ప్రాముఖ్యం అంతా కల్పించబడింది. మనది తలంపుల ప్రపంచం. మనసులోని నిక్షిప్తమైన వాసనలు సంస్కారాల వలన తలంపుల ప్రవాహం మన మెలకువతో మొదలవుతుంది. ఆగకుండా సాగుతుంది. కొన్ని తలంపులు మళ్లీ మళ్లీ వస్తాయి. కొన్ని కార్యక్రమాలకు సంబంధించి, కొన్ని తలంపులు, తలంపులు లేవు అని భయం వలన వస్తాయి. మనల్ని యెప్పుడూ ఒంటరిగా వదలవు. మనకు నిరంతరం తోడుగా తలంపులుంటాయి. అవి ఆహ్లాదంగా ఉన్నంతవరకూ, అవి మనల్ని విజయంవైపు నడిపించే వరకూ మంచిదే. కానీ పరిస్థితులు వ్యతిరేకంగా మారినపుడు, దుష్ట భావనలు దాడి చేసినపుడు, నిరాశా, నిస్పృహలు అలుముకున్నపుడు, మనసు తలంపులను ఆపివేసి మూసివేయడం గురించి మనకు యేమైనా తెలుసునా?

ఈ పరిస్థితికి పూర్తిగా వ్యతిరేకమైనది. 'తలంపులు లేని మనసు' స్థితి. అంటే దీని అర్థం యేమిటి? దాని గురించి యెందుకు ఖాతరు చెయ్యాలి. ఆ స్థితికై యెందుకు ప్రయత్నించాలి? ఆ స్థితిలో మనసు చాలా చురుకైనది, సంపూర్ణ శక్తి గ్రహింపు గలది. ప్రక్కదారులే లేనిది, స్థిరమైనది, అంతేకాక పూర్ణమౌనంగా ఉండేది. అహంకారం అంటే అర్థం అయి తెలుసుకోవడం వలన, మూలంలో లయం అయిపోవడం వలన సహజంగా నిలచిన మౌనం అది. మామూలుగా అయితే తలంపులు ఆకాశంలో మబ్బుల్లా వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మానసిక ఆకాశంలో నల్లని, తెల్లని మేఘాల గుంపులు, గుంపులుగా కదులుతూ ఉంటాయి. ఆలోచనలు శ్వాసలా సహజంగా వాటంతట అవే వస్తూ పోతూ ఉంటాయి. మౌనంలో తలంపులు బోధ చెప్పడానికి, మాట్లాడడానికి, సందేహ నివృత్తి చేయడానికి, పని చెయ్యడానికి, దినదిన కార్యక్రమాలకు అవసరం అయిన

తలంపులు వాటికవే వస్తాయి. అవసరం తీరగానే పోతాయి. మిగతా సమయాల్లో అవసరం ఉండదు కాబట్టి తలంపులేమీ ఉండవు. మామూలుగా అయితే తలంపులను ఆపడం యెంత కష్టమో, ఆ మౌనస్థితిలో అవసరం లేని తలంపులను తెచ్చుకోవడం అంత కష్టం అని భగవాన్ అంటారు. అలాగే అజ్ఞాన అవస్థ అయిన గాఢనిద్రలో తలంపులు లేవని అది మౌనస్థితికి సమానమని పొరపాటున కూడా యేమారకూడదని హెచ్చరిస్తారు. గాఢనిద్రలో తలంపులు లేకపోవడము, మనసును తెలుసుకోవడం వలన జరగడం లేదు. మనస్సు నిద్రపోవడం వలన మాత్రమే తలంపులు లేవడంలేదు. ఆ మనస్సు మలినములు ఉన్నదే, అందుకే నిక్షిప్తమైన తలంపులు మనసు లేవగానే వస్తాయి. పూర్ణమౌన స్థితిలో ఉన్నది మలినంలేని నిర్మల శుద్ధ మనసే. అందుకే యెలాంటి తలంపులు నిక్షిప్తమై ఉండవు, ఉండలేవు, రావు. శూన్యమే, పూర్ణమే అది. నిద్రావస్థ వచ్చిపోయే ఒక మారే అవస్థ మాత్రమే. ఈ అవస్థలో అనుభవిస్తున్న ఆనందం తాత్కాలికమే. మెలకువ రాగానే, షరా మామూలే, ఆలోచనలే ఆలోచనలు, గుంపులు గుంపులు.

ఆనందం అన్నది బాహ్యమైన వస్తువులు, విషయాల్లోనే ఉన్నదని దృఢమైన విశ్వాసంతో ఉన్నాము. వాటివలననే మనకి ఆనందం లభిస్తుందని మనం గట్టిగా పూర్తిగా సిద్ధాంతీకరించుకున్నాము. అందుకే 'నేను అనే భావన' అహంకారం/ మనసు యెప్పుడూ యేదో బాహ్య విషయాలూ, వస్తువుల గురించి తలంచుతూ, ఇంద్రియాలతో గ్రహించుతూ ఉంటుంది. తాత్కాలిక ఆనందమో, దుఃఖమో పొందుతుంది. ఆనందం బాహ్యంలో ఉన్నదన్న సంబంధం వలన, మనస్సు తన సహజ స్వయం పరమానందంను మరచిపోతుంది. అందువలన, బయట ఆనందం కోసం వెదుకుతూ తలంపులతో చరిస్తుంది. తలంపులకు అలవాటయిపోతే, తన ఉనికిని, తను ఉండటాన్ని జీవించడాన్ని కూడా యీ తలంపుల వలననే అని అనుకుంటున్నాము. అందుకే 'నేననుకుంటున్నాను (ఐ థింక్)', 'నేను ఉన్నాను (సో ఐ యామ్)', 'నేను నమ్ముతున్నాను (ఐ బిలీవ్)' లాంటి పదాలతో అందరి మాటలు ఉంటాయి. తలంపులు, తలంచడమనే యెంతో గట్టి వ్యసనం నుంచి విముక్తి కలిగితే, బాహ్యమైన దాన్ని చూడక తనలోనికి చూడడం అలవాటవుతుంది. అలా కాకపోతే మౌన నిశ్చల మనసు, దాని సర్వశక్తి, సహజ పరమానంద జీవనం గురించి తెలియనే తెలియదు యెన్నటికీ. భగవాన్ యొక్క మొదటి జీవిత చరిత్ర వ్రాసిన శ్రీ బి.వి. నరసింహస్వామి గారితో సంభాషణల్లో మనసు/ అహంకారాన్ని యెలా యెదుర్కొనాలో భగవాన్ తెలిపారు.

భ : బుద్ధిపరమైన వ్యక్తి, నేనను భావన/అహంకారం, వాటివలన వాటిల్లానే గ్రహించే బాహ్యాప్రపంచం, విషయాలు కూడా ఒకదాని కంటే ఒకటి వేరుగా ఉండవు. గ్రహించే అహంకారం, గ్రహించబడే బాహ్య ప్రపంచం రెండూ ఉంటే ఒకేసారి ఉంటాయి. లేకపోతే రెండూ మాయం అవుతాయి, లేకుండా పోతాయి. ఏదో ఒక్కటే ఉండదు. నేను భావన, నాది, వాడు, అది, వీడు, యిది యిలా అన్నీ ఉంటే, అన్నీ ఉంటాయి, పోతే అన్నీ చేతనలో నుంచి లేకుండాపోతాయి. ఈ బుద్ధిపరమైన గ్రహించే చేతనకంటే వేరుగా చైతన్యం యేమీ లేదా?

న : ఉన్నట్లు నాకేమీ అనిపించడం లేదు.

భ : నీ గాఢనిద్రలో నీ బుద్ధి ఉండినదా? పని చేస్తున్నదా? అంటే నువ్వు ఆలోచించుతున్నావా, గ్రహించుతున్నావా, పోలుస్తూ విచక్షణ చేస్తున్నావా, జ్ఞాపకాలు ఉన్నాయా, వస్తువులు విషయాల గురించి నిర్ణయిస్తున్నావా?

న : లేదు. ఆలోచించడానికి అక్కడ విషయాలేమీ లేవు. అప్పుడు బుద్ధిపరమైన పని యేమీ జరుగలేదు.

భ : అయినా, నువ్వు ఉన్నావు. ఎంతో ఆనందంగా సుఖంగా ఉన్నావని అంగీకరిస్తావా?

న : అవును.

భ : మరి యీ నిద్రలోని అనుభవం, తలంపుకు విషయాలతో సంబంధంలేని ఆనందం యేమిటి? బుద్ధితో సంబంధంలేని యీ చైతన్యం, ఆనందం యేమిటి? నీ యొక్క (నేను) సహజస్థితి ఆనందమే అని తెలుసుకున్నావు. గాఢనిద్రలో బుద్ధికి అతీతంగా ఉన్నపుడే ఆనందం, సుఖం ఉందని తెలుసుకున్నావు. అంటే 'నేను' 'ఆనందం', బుద్ధిపరంగా గ్రహించకపోయినా రెండూ ఒకటేనని తెలుసుకున్నావా?

న : అవును. అలాగే అయి ఉండాలి. కానీ స్పష్టంగా అది నాకు అనుభవం కావడం లేదు. బుద్ధితో పనేలేని, బుద్ధికి అతీతమైన యీ పూర్ణ బ్రహ్మానందం నాకు అనుభూతి కలుగుట లేదు.

భా : ఎందుకు కలుగుటలేదంటే, యింతకాలం నువ్వు ప్రపంచం యితర విషయాలు వస్తువుల సంబంధాలతో తాద్యాత్మం చెంది వాటితోనే నిన్ను పోల్చుకుంటున్నావు.

అదే అలవాటు యెంతో బలమైన వ్యసనంగా ఉంది. పైన చెప్పుకున్నట్లు గాఢనిద్రలో ఉన్న 'నిన్ను' గురించి నువ్వు శోధించలేదు. నువ్వు నీ బుద్ధినే యెప్పుడూ వాడుతున్నావు గానీ నీ ఎరుకను కాదు. ఈ పద్ధతి అటుదిటు మారితే, నువ్వు బాహ్య విషయాలన్నీ మూసివేసి అంతర్ముఖుడివై నీ లోనికిపోతే, నీ ఎరుకకై శోధిస్తే, నిన్ను నువ్వు కనుక్కోగలవు. అదే సత్యం, ఆత్మసాక్షాత్కారం, తెలుసుకున్నవాడు, నేను - అది వర్ణించలేనట్టిది, మనసుతో గ్రహించనట్టిది, మనసు చేరుకోలేనట్టిది. దాన్ని నామమాత్రంగా సత్-చిత్-ఆనంద అంటే ఉన్నది, చైతన్యం ప్రకాశం, పరమానందం అని చెప్పబడినది.

ఎవరైనా 'నేను'ను శోధిస్తే, పూర్తిగా బుద్ధి తలంపుల వలన జీవించే విధానం నుంచి విముక్తిపొంది, ఎరుక అనుభూతి వలన జరిగే జీవన విధానం తెలుసుకుంటారు. నేనును శోదించడం అంటే యేమిటి? తలంపుల ప్రవాహాలను ఆపటానికి భగవాన్ తెలిపిన మార్గము యేమిటి? మనకు తెలియకుండానే, మనసు నిండా యెన్నో రకాల ఆలోచనలు నిండిపోతాయి అని మనకందరికీ అనుభవమే. ఎంత వేగంగా తలంపులు కదులుతాయో వివరించడానికి భగవాన్ ఒక సంఘటన గురించి చెప్పారు.

'నేను స్కంధాశ్రమంలో ఉంటున్నపుడు, అపుడపుడు బయట ఒక బండరాయి వద్దకుపోయి కూర్చుండేవాడిని. ఒకసారి అలా కూర్చున్నపుడు అక్కడ నాతో రంగస్వామి అయ్యంగార్‌తో సహా యింకా ముగ్గురు ఉన్నారు. అకస్మాత్తుగా ఆ రాయిలోని ఒక చిన్న పగులులో నుంచి ఒక చిన్న పురుగు గాలిలోనికి రాకెట్‌లా దూసుకుపోవడం చూశాము. కనురెప్ప మూసి తెరచినంత సమయంలోనే అది యెన్నో లక్షలు లక్షల పురుగులుగా విభజన అయి ఒక పెద్ద మేఘంలా తయారై ఆకాశాన్ని కనుపించకుండా మూసివేసింది. రాతిలోనిది సూదిమొన అంత రంధ్రమే, అన్ని లక్షల పురుగులు ఒక్క క్షణంలో అందులోంచి రాలేవని మనకు తెలుసు. ఇలాగే అహంకారం కూడా లేచి రాకెట్‌లా దూసుకుపోయి ఒక్క క్షణంలోనే విశ్వమంతా విస్తరిస్తుంది'.

'నేను యెవరు' విచారణలో, తలంపులు మనసులో నిండకముందే, 'నేను'పై దృష్టి ఉంటుంది. ధ్యాసనంతా యీ ప్రథమ తలంపు / నేను భావన/ అహంకారంపై నిలపితే, యింక అది మిగతా ఆలోచనలు, విషయాలు, ప్రపంచంవైపు పోదు. మనస్సు అంతర్ముఖమై, లోన ఉన్న దివ్యత్వం దాన్ని

ఆకర్షించుతుంది. ఇలా మనసు తన మూలస్థానంలో కలసినందున, ప్రపంచ విషయాల్లో బలంగా చిక్కుకుని ఉన్న స్థితినుండి విముక్తి పొందుతుంది. ఒక ఆవుకు తన శాలలోనే పచ్చని గడ్డిని తినే అలవాటుచేస్తే, అది యింక బయటికిపోయి తిరిగి తినాలనుకోదు. అలాగే మూలస్థానంలో ఉన్న మనసు బ్రహ్మానందం అనుభవిస్తూ, యిక బాహ్య విషయాల్లో చరించే, తలంచే అలవాటును మానుకుంటుంది. మనసు యింక అస్తవ్యస్తంగా ఉండక, యెంతో విశాలంగా, చురుకుగా, సర్వ శక్తివంతంగా ఉంటుంది.

అధ్యాయం - 9

నువ్వు పరిపూర్ణ ఆత్మ చైతన్యమే

సత్యంగా యెవరైనా పరిపూర్ణ చైతన్యమే, మనసు దాని ప్రతిబింబం నిర్మలం శుద్ధమైనదే అని భగవాన్ మళ్లీ మళ్లీ నొక్కి చెపుతారు. ఈ పరిపూర్ణ చైతన్యం ముక్కలు ముక్కలుగా ఉండదు, రెండు కాదు. దీన్ని జ్ఞానులు తెలుసుకోగలరు. మిగతా అందరూ భ్రాంతిమయమైన ప్రపంచంలో, స్వతంత్రమైన వేరు వేరు వ్యక్తులు/అహంకారాలు/మనసులుగా భావిస్తూ ఆ మిథ్యతో జీవిస్తారు. ఈ భ్రమలో భాగంగా మనసుకు ఒక ప్రత్యేక స్వతంత్ర ఉనికిని కల్పించుతారు. మనసును నియంత్రించలేనిదిగా ముద్రవేసి, దాన్ని శాంతపరచి దారిలో పెట్టాలని ప్రయత్నాలు చేస్తారు. తన సహజస్థితిని మరచి మరుగున పడడం అవిచారణ వలననే అని రమణులు చెపుతారు. అంటే పరిపూర్ణ చైతన్యమైన 'నేను'కు వేరుగా ప్రత్యేకమైన మనసు, దేహం ఉందా అని విచారణ చేయకపోవడం. ఈ మౌలికమైన ప్రశ్నవైపు యెవరు దృష్టి సారించారో వారు యీ భ్రాంతిమయమైన పరిమితులతో ఉన్న మనసుతో జీవిస్తారు, మరణిస్తారు. అలాంటి మనసు అత్యద్భుతమైన అనంత వైశాల్యం, ఆనందంను అనుభవించదు, అనుభవించలేదు.

కొంతమంది శ్రద్ధగా తపనతో ఆధ్యాత్మిక మార్గము నవలంభించి మొదటి ఆటంకమైన ప్రపంచాన్ని అంటిపెట్టుకుని విచారణ చేయని మనసు స్థితిని దాటారు. వారు కొంతవరకు, మనుషుల జీవితంలోని ఆరాటాల వ్యర్థ ప్రయోజనం తెలుసుకుని, అహంకారపూరితమైన నడవడికవైపు పోలేదు. శోధన మొదలై, యెన్నో అడ్డంకులను దాటుకుని, భగవాన్ బోధించిన సూటిదైన విచారణ పద్ధతిపై ఆకర్షితులయ్యారు. సూటిది అని యెందుకంటే, జబ్బు 'అవిచారణ' అంటే శోధించాలి, ప్రశ్నించాలి అనే దృష్టి, విచారణ ఆసక్తి లేకపోవడం, దానివలన తన నిజస్థితి, తానేమిటో కనుక్కొనకపోవడం జరుగుతుంది. దీనికి పరిష్కారం శోధన, విచారణ చేయడంలోనే ఉంది.

ఖచ్చితంగా ఫలితాన్నిచ్చే భగవాన్ చెప్పిన విచారణ మార్గము, తన గురించి తను యేమిటని ప్రశ్నలతో, నేనెవరు? నేను యెక్కడనుంచి? అని విచారణ జరిగినపుడు, బుద్ధిపరంగా మేధోపరంగా చేసినపుడు అంతగా ఉపయోగం కనుపించదు. ఈ ప్రశ్నలు యేదో అలవాటుగా, అలా మళ్ళీ మళ్ళీ వేసుకోవడం

వలన వ్యర్థమే అవుతాయి. ఒక తలంపు వచ్చినపుడు, యీ తలంపు యెవరిది, నేనెవరు? అనే ప్రశ్న రావాలి. లెక్కలేనన్ని యెన్ని తలంపులో దైవానికే యెరుక. ఈ సాధనను, దాని శక్తి, విధానం తెలియకుండా చేసినపుడు ఫలితంలేక నమ్మకం పోతుంది. సత్యంకోసం, ఎంతో శ్రద్ధ ఆసక్తి ఆర్తి తపన, తానెవరో తెలుసుకోవడం గురించి ముఖ్యంగా చాలా అవసరం, విచారణ అసలు నేనెవరు అనే మౌలిక సందేహం నీ గురించి లేచి ఉత్సుకతతో నీలో నుంచి రావాలి. అలాంటి సందేహం, ఆసక్తిలోనే, యీ మానసిక జైలునుండి విడుదలకు కావలసిన తాళంచెవి ఉంది. నీది యెంతో విలువైన యిష్టమైన, ప్రాణమైన వజ్రం ఉంగరం పోయింది. ఎలా వెదుకుతావు? పిచ్చెక్కిన వాడిలా, అన్నీ తీసి, అందరినీ అడిగి, పోలీసులను పరుగెత్తించి, నువ్వు పరుగులుతీసి, ఎంత ఆతృత? నువ్వు శరీరం కాదు, మనసు కాదు, ఆర్జిస్తున్నవి శాశ్వతం కాదు, ఉన్నవన్నీ తీసుకుని వెళ్ళేవి కావు, వ్యర్థమే. మరి నేనెవరు? అనే తొలిచే ఆతృత ఆసక్తి ఆర్తితో వచ్చిందా ప్రశ్న? నేనెవరు? అని. అలాంటి విచారణ భగవాన్ అనుగ్రహంతో తప్పక ఫలిస్తుంది.

భగవాన్ బోధనల ఉద్దేశం అంతా, నువ్వు యే స్థానం నుంచి నిన్ను మరచావో ఆ స్థానం వైపుకు నీ దృష్టి మరల్చి, నీ దివ్యత్వంలో, చైతన్యములో నిన్ను మేల్కొలుపుటకే. నువ్వు మానసిక ప్రవృత్తుల భ్రాంతిమయ సుడిగుండంలో యిరుక్కున్నప్పుడు సత్యం అన్వేషించే అవకాశం ఉండదు. అందుకే మానసిక ప్రవృత్తులైన తలంపులను, అవి మానసిక ఆకాశంలో లేచే దగ్గరినుంచే దృష్టిపెట్టి దూరం చేయాలి. తలంపుల కంటే ఆలోచించే వాడిపైనే దృష్టి సారిస్తే, మనసు నిశ్చలమౌతుంది. అపుడు, తలంపులు యెలా లేస్తాయి, అహంకారం లేవకుండా. అందువలన, మనసు తలంపులకే మొత్తం నివారణ జరుగుతుంది.

ఈ స్థితిలో మనస్సు పూర్తిగా వికాసమవుతుంది. 'నేను' అనే దానిపైనే దృష్టి అంతా లగ్నం అవుతుంది. ఒకే తలంపు మిగులుతుంది. మనసుయొక్క శక్తి వందల తలంపులపై పోయి వ్యర్థం కాదు. ఇది, అన్ని దీపాలను ఒకటే విషయంపై కేంద్రీకరించినట్లు ఉంటుంది. ఉన్న భ్రాంతి అంతా దానికదే తొలగిపోతుంది, నూనె అయిపోయి ఆరిన దీపంలా. మిగిలినది పరిపూర్ణ చైతన్యమే. నిర్మల శుద్ధ మనసు అనంత అఖండ 'నేను, నేను...'ను అనుభవిస్తూ ఉంటుంది.

ఈ అనుభూతి, బంధాలు లేని మనసు పరమానందంను, తెలుసు కుంటుంది, లోపలికి ఆకర్షింపబడుతుంది. మొదట్లో, మిగిలివున్న ప్రారబ్ధ కర్మల వలన ఉన్న వాసనలు సంస్కారాల వలన వచ్చే భ్రాంతిమయ తలంపులు, శుద్ధ

మనసును వెనక్కి లాగుతూ ప్రయత్నిస్తాయి. మళ్లీ 'నేను'పై కేంద్రీకరించాలి, ఆ తలంపులను వదిలించుకోవాలి. ఈసారి అంత కష్టం కాదు, తనలోని పరమానందాన్ని ఒకసారి అనుభవించింది కాబట్టి. భ్రాంతిమయ తలంపులు రాగానే, మనసులో ప్రథమ తలంపు అహంకారం/నేను భావన లేచి వెనక్కు రావాలనుకుంటుంది. దివ్యత్వమైన పరిపూర్ణ చైతన్యం ముంగిట ఉంది మనసు, కానీ యింకా పూర్ణంగా అహంకారం నాశనం కాలేదు. అలాగనీ, యెన్నో తలంపులూ ముంచుట లేదు. 'నేను'పై కేంద్రీకరణ తొలగిపోలేదు. ఇక్కడ యీ కేంద్రీకరణకు విఘాతం లేకుండా ఉంటే, ప్రథమ తలంపు/అహంకారం దానికదే ఆత్మచైతన్యంలో కలసిపోతుంది. తలంపులన్నీ ఆగిపోతాయి. చైతన్యం ఒక్కటిగానే ఉంటుంది. వ్యక్తి/అహంకారం లేదు. తను తన సహజస్థితిలో ఉంటారు. అప్పుడు అనుభవించే బ్రహ్మానందాన్ని యెవరూ వర్ణించలేరు, వర్ణింపశక్యం కానిది.

అధ్యాయం - 10

రావలసిన సందేహాలు - ప్రశ్నలు

విచారణపై జిజ్ఞాసలేని జీవితం ప్రయోజనం యేమిటి?

- భగవాన్ శ్రీ రమణ మహర్షి

స్వస్వరూప జ్ఞానం కోసం బోధించిన సూటి మార్గమైన 'నేనెవరు? విచారణ' తన సహజమైన ఆగని తరగని స్థిరమైన పరమానందం అనుభవంపై ఆధారపడి ఉన్నది. ఈ సహజత్వాన్ని ప్రతిబింబించే జీవితం విలువ తెలియక దీన్నించి దూరంగా పారిపోతున్నారు. ఆ విలువ తెలియాలంటే మౌలికమైన గ్రహింపులపై నిరంతర ప్రశ్నలు లేవాలి. ప్రశ్నలంటే సందేహాలే. అలాంటి సందేహాలు, ప్రశ్నలు లేకుండా, భ్రమల్లోనే బ్రతుకుతారు, సత్యంపై దృష్టి పోనే పోదు, వారి భ్రమల గురించి సందేహాలు - ప్రశ్నలు రానే రావు. సరయిన మార్గాన్ని పట్టుకోలేరు. జీవిత ప్రయోజనం యేమిటి? అందరూ జీవిస్తున్నారు, పరుగులెదుతున్నారు. దీనికి అర్థం యేమిటి? సందేహాలు, ప్రశ్నలు లేవు.

సహజత్వం ప్రతిబింబించే జీవనం ఉండాలంటే, మానసిక విశాలం కలగాలి, అపుడే అది అలాంటి జీవనంకు అవకాశమిస్తుంది. మానసిక విశాలం అంటే యేమిటి? సంకుచితం కానిది, భ్రమలు పోయినది, పరిపక్వం చెందినది. అలాంటి మనసు యెపుడూ ప్రశాంతంగా ఉంటూ, యెప్పుడూ దేనికో పరుగులు తీయక, యెన్నో తలంపులతో నిండి ఉండక, తలంపుల ప్రవాహం వాటి ప్రభావంలో చిక్కుకొనక ఉంటుంది. మనస్సు అంతగా పూర్తి నిశ్చలం, మౌనంకాకపోయినా, సాధనలో తలంపులపై దృష్టిమరల్చి 'నేను'పై ధ్యాసతో శుద్ధం కాగలదు. ఈ ధ్యాసలో విరామం, తలంపుల మధ్య విరామం జరుగుతూ ఉంటుంది. విరామ సమయంలో తన జీవన విధానాన్ని సమీక్షించుకోవచ్చు. దానికి వేరుగా తాను ఉండి దాన్ని సమీక్షించుకోగలరు. ధ్యాసలో విరామం అలా వ్యర్థం కాదు. అక్కడ తను విషయాల్లో మునిగిలేదు, వేరుగా ఉండే పరికిస్తున్నాడు. దీనితో యింకా లోతుగా అంతర్ముఖం కావడానికి ప్రయత్నం జరగాలి, విరామం తగ్గాలి. ఇంతకాలం మానసిక వైశాల్యం లేకపోవడం వలన లేవనెత్తని సందేహాలు ప్రశ్నలు, యిపుడు రావాలి, వాటివలన లోనికిపోవడం తీవ్రమవుతుంది. విచారణకు సంబంధించిన సూటిప్రశ్నలు కలుగడం వలన, మనసుయొక్క బద్ధకాన్ని పోగొట్టి

శోధన చేస్తుంది. అవసరమైన ప్రశ్నలు లేవదంవలన మనసు చురుగ్గా, విచారణపై ఆసక్తి చూపుతుంది.

సాధన బలపడాలంటే ఎలాంటి మౌలిక ప్రశ్నలు కలుగాలో సాధకులకు తెలిసిందే. అయినాసరే, కొన్ని ప్రశ్నలు ప్రయోజనకరంగా అందరికీ లేవవలసినదే. గమ్యం, స్పష్టత గురించి 'నేను అసలు' 'నేనెవరు విచారణ' 'యెందుకు చేయాలి, చేస్తున్నాను'. 'ఈ విచారణ గమ్యం యేమిటి? ఈ గమ్యంలో యిప్పుడు నా స్థానం యేమిటి?' 'నేను యెవరు? ఎక్కడనుంచి వచ్చాను? జీవితం యేమిటి? శాశ్వతమైనదేమిటి? శాశ్వత పరమానందం యేమిటి? నేను జీవిస్తున్న అర్థం యేమిటి?' యిలా యెన్నో సందేహాలు – ప్రశ్నలు కలగాలి. ఎవరో ఒక ధ్యాన పద్ధతిని బోధించినపుడు, యెన్నో నియమాలు, పాటించవలసిన విధానాలు, సమయాలు చెపుతారు. గమ్యం మనసును నియంత్రించడం అని చెపుతారు. రోజువారీ జీవితం దాని పాట్లు పరుగుల్లో ఉన్నవారికి, సాధారణంగా యిది ఆకర్షణీయంగా అనిపిస్తుంది. ఇక్కడ గమ్యంను సరిగ్గా గ్రహించారా అన్న ప్రశ్న రావాలి. నియంత్రించబడిన ప్రశాంత మనసు, నిశ్చల మనసే అయితే, అది సరయిన గమ్యమేనా? లేక ఆ గమ్యం మనసుయొక్క ప్రవృత్తుల నుండి పూర్తిగా విముక్తిని కలిగిస్తుందా?

గాఢనిద్రలో, మూర్ఛలో, స్పృహలేని స్థితిలోనూ తలంపులు ఉండవు, మనసు లయమై ఉన్నందువలన మాత్రమే. కానీ మనస్సులో నిక్షిప్తమైవున్న గత జన్మల వాసనలు, సంస్కారాలు అన్నీ అలాగేవుండి, అగ్ని పర్వతంలా లేచి విరజిమ్మడానికి తయారుగా ఉంటాయి. ఏ క్షణంలోనైనా మెలకువరాగానే అవి విజృంభించుతాయి. అందుకే రమణులు, మనసును నియంత్రించి కొంత సమయం లయంచేసే సాధనలేవైనా ఉపయోగం లేదంటారు. కొంత సమయం నిశ్చలం అయిన మనసుకూ, వాసనలు సంస్కారం నుండి విముక్తి పొందిన మనసుకూ తేడా వివరిస్తారు. 'ఈ ఆధ్యాత్మిక సాధన దేనికొరకు?' అన్న ప్రశ్నవస్తే, మనసును పూర్తిగా విముక్తి చేయవలసిన అవసరం గుర్తింపబడుతుంది.

కఠిన నియమ నిష్ఠ నిబంధనలతో కూడిన ఆధ్యాత్మిక జీవనం నుండి, భగవాన్ చెప్పిన సూటి మార్గమునకు మరలినవారు 'నాలో' నేను యెవరు? విచారణగూర్చి, దాని సాధన గురించి యెంత తీవ్రమైన ఆర్తి శ్రద్ధ తపన ఉన్నది", 'నా వివిధ గమ్యాల్లో దీనిస్థానం యేమిటి' అని ప్రశ్నించుకోవాలి. ఎందుకంటే చాలామంది ఎంతో ఉత్సాహంగా ప్రారంభించి తరువాత మెల్లగా

చతికిలబడతారు. వారు రోజూ చేసే కార్యక్రమాలలో యిది యింకోటి అవుతుంది, అంతే. ఈ ఆసక్తి యింకిపోవడం అన్నది మనకు తెలియకుండానే జరుగుతుంది. 'నేను యెంత సమయం వెచ్చిస్తున్నాను విచారణకు' ప్రశ్నించుకోవాలి. మన ఆఫీసు పనులు, శరీర శ్రమలు, రుగ్మతలు, యితరులతో సంబంధ బాంధవ్యాల్లో చిక్కుకుని మనం యెంత విచారణ సాధన చేస్తున్నామో తెలుస్తుంది. ఏవేవో లౌకికమయినవి సాధించాలని పరుగులెత్తే వారికి సమయం అసలే చిక్కదు. ప్రశ్నలతో యీ వాస్తవాన్ని గ్రహించితే నేనెవరు విచారణపై తీవ్రత పెరుగుతుంది. అలాగే విచారణకు దొరికిన కొంచెం సమయాన్ని యింకేవో విషయాలతో వ్యర్థం చేస్తున్నామా అని కూడా ప్రశ్నించుకోవాలి. కొన్ని పాత పద్ధతులను, సాధనలను విడిచిపెట్టుట కష్టమయి, వాటిని పాటించి సమయాన్ని వ్యర్థం చేస్తున్నారా చూడాలి. ఇంతకుముందు చేసిన సాధనలు అంటే జపం, పారాయణ, ఉపాసనలాంటి వాటి వలననే మీరు యీ విచారణ స్థితికి యెదిగారు అని భగవాన్ చెపుతారు. ముందు చేసిన సాధనల వలన మనసు శుద్ధం, దృఢం అయి, నా సహజస్థితి యేమిటి? నేనెవరు? ప్రశ్నలపై నిలువగలిగే సామర్థ్యం కలిగింది. విచారణ పద్ధతికి చేరుకున్నవారికి, యింతకు ముందు చేసిన సాధనలతో యిక అవసరం లేదు కాబట్టి సహజంగానే వదిలేస్తారు. లేకపోతే విచారణ పద్ధతి తన తాజాదనం, మనసును తనకలవాటయిన తలంపులు అభ్యాసముల నుంచి విముక్తి కలిగించే శక్తిని కోల్పోతుంది. సగం సగం ఆసక్తితో విచారణ చేయడం వలన అహంకారం విజృంభించుతూనే ఉంటుంది. నేనెవరు విచారణయొక్క అర్థం సరిగ్గా గ్రహిస్తే యిక దానిని విడువజాలరు. విచారణ ఉద్దేశము మనసు తన వాసనలు, మలినాలు వదిలించుకొంటే అది సత్‌యొక్క ప్రతిబింబమే, నిర్మలం శుద్ధమే తప్ప వేరుకాదు అని తెలుసుకోవడమే.

ఇంకా ప్రశ్నలు 'నేను రోజూ చేస్తున్న కార్యాలు, పనుల అర్థం గమ్యం యేమిటి? సంపదలు, ఆస్తులు, పేరుప్రతిష్ఠలు, వంశవృద్ధి గొప్పతనం, అధికారం, పంతం పట్టుదలలు... వీటన్నింటికీ నేను యెంతో ప్రాముఖ్యం యిస్తున్నాను. వీటినుంచి శాశ్వత ఆనందం వస్తుందా? వీటిలో తరగని శాశ్వతమైన సుఖం యేమైనా ఉందా?' యిలా ప్రశ్నలు రాకపోతే, మనసును తన హృదయంలో తెలుసుకోకుండా అంతా బాహ్య విషయాల్లోనే చరింపజేస్తారు.

ఇంకా 'ఈ ఆధ్యాత్మిక మార్గంలో నేను ఒంటరివాడినా? లేక నాకు తోడుగా నన్ను ఉత్సాహపరచడానికి, ధైర్యం చెప్పడానికి, స్ఫూర్తినివ్వడానికి యెవరైనా

ఉన్నారా?' అన్న ప్రశ్నలుదయిస్తే, భగవాన్ మనల్ని నడుపిస్తున్న అనుగ్రహం అర్థం అవుతుంది. అవి పుస్తకాలు, సత్సంగ్‌లు, ప్రవచనాలు, ప్రశ్నల- జవాబులు అవ్వచ్చు. ఇంకా మనస్సు మౌనంగా ఉన్నప్పుడు వచ్చే మార్గదర్శకత్వం కావచ్చు. ఆధ్యాత్మిక మార్గంలో సాధనచేస్తూ ప్రయాణం చేస్తున్నవారికి, మిగతా శ్రద్ధాభక్తులతో సాధనచేసే వారినుంచి కూడా సహాయం లభిస్తుంది.

ఏది యేమైనాసరే, సాధారణంగా రాని యీ సందేహాలు, ప్రశ్నలపై దృష్టి పెట్టడం నేనెవరు విచారణపై ఆసక్తిని కలిగించడం, స్థిరంగా సాధన సాగేటట్లు చేయడానికే. విచారణపై స్ఫూర్తి, ఆసక్తి యెప్పటికీ బలహీన పడకుండా నిలుపడానికే. ఈ ప్రశ్నల వలన, యేమైనా దారి తప్పి ఉంటే సరిచేసుకుని, అంతిమ సమాధానం పొంది, పొరలిపొంగే అనంత పరమానందం అనుభవిస్తారు.

భక్తులు, సాధకులు, ఆసక్తిపరులు అడిగే ప్రశ్నలకు భగవాన్ యెంతో ఓపికగా సమాధానం వివరణలు చెప్పేతీరు గమనిస్తే, యీ ప్రశ్నల సమాధానాల ప్రాముఖ్యం తెలుస్తుంది. భగవాన్ దేహంతో అచ్చట ఉన్న 54 సంవత్సరములలో ముప్పయి వేల కంటే అధికంగానే ప్రశ్నలకు జవాబులు చెప్పారు. మేథోపరమైనవి, స్ఫూర్తిలేని ప్రశ్నలకు తప్ప, జిజ్ఞాస, ఆసక్తిగలవారు అడిగిన ప్రశ్నలు దేనికీ భగవాన్ సమాధానం చెప్పకుండా మానలేదు. అంతేకాదు, భగవాన్ యిలాంటి ప్రశ్నలను యెంతో ఉత్సాహపరచేవారు. ఉదాహరణకు :

భక్తులు : జీవితం తాలూకా ఉద్దేశం, ప్రయోజనం యేమిటి?

మహర్షి : ఈ జీవితం యింతకుముందు చేసిన పుణ్యకర్మల వలన లభించిందని దానియొక్క ప్రాముఖ్యతను తెలుసుకొనాలని అన్వేషించడమే ఉద్దేశ్యము, ప్రయోజనము.

భక్తులు : మరణం తరువాత జీవితం యొక్క స్వభావం యేమిటి?

మహర్షి : ప్రస్తుతం నువ్వు జీవిస్తున్న దాని గురించి కనుక్కో. మరణం తరువాత జీవితం గురించి ఆందోళన యెందుకు? వర్తమానంలోని నిన్ను నువ్వు కనుక్కుంటే నీకు అంతా తెలుస్తుంది, తెలియనిదంటూ యేమీ మిగలదు.

భగవాన్ యెప్పుడూ, ప్రశ్నించేవారి దృష్టిని, నేనెవరు విచారణపైకే మరల్చేవారు, అందులోనే గమ్యం మొత్తం అంతా యిమిడి ఉంది కాబట్టి.

అధ్యాయం - 11

మనసు పాక్షిక నియంత్రణ

మనం మనసు/అహంకారం అనేదే ఆలోచించేది, ఒకరి తలంపులూ. ఇవి ఒక నిరంతర ప్రవాహమే. తలంపులు లేని క్షణం ఒక్కటి కూడా ఉండదు. ఈ తలంపులు ఎందుకు? తలంపులకు కారణం యేమిటి? ఆలోచించేవాడు, అతని తలంపులు కలిసే ఉన్నా, బుద్ధిపరంగా చూస్తే, తలంచేవాడు తలంపులకు కేంద్రం. ఎందుకంటే ప్రతీ తలంపు కూడా ఆ తలంచేవాడిదే కాబట్టి, అతని ధ్యాసే తలంపుకు జీవం. అలాగే ఒక తలంపుపై ఆ ధ్యాసను తీసివేస్తే లేక వేరొక తలంపుపై మరల్చితే, వెంటనే ఆ తలంపు మాయమైపోతుంది. ఇంకో తలంపు లేస్తుంది, దానిపై తలంచేవాడి ధ్యాస అప్పటికి నిలుస్తుంది. నిజానికి ఒకరి వాసనలు, సంస్కారాల వలన ఒక పెద్ద తలంపుల సముద్రమే ఉంది. అవి సమయం పరిస్థితులనుబట్టి పుడుతుంటాయి, బాహ్య విషయాలపై తలంచే వాని ఆసక్తి వలన. ఇవి ఒక్కక్షణం కూడా ఆగకుండా పుడుతూనే ఉంటాయి. అందుకే అవి అనంతమైనవి, అంతం లేనివి.

మనసును నియంత్రించేందుకు చేసే ప్రయత్నాలు ముందే నీరుకారి పోతాయి. ఎందుకంటే ఆ ప్రయత్నాల్లో చెడు ఆలోచనలను తగ్గించడం, మంచివి అవసరమైన తలంపులను ఉంచడంకోసం కాబట్టి. ఈ పాక్షిక తనకు అవసరమైన పద్ధతి వలన కలిగేది అపజయమే. దీంట్లో తలంచేవాడి కీలకమైన స్థానం గురించి వదిలేయబడింది కాబట్టి. అందుకని కొన్నిసార్లు భయంకరమైనవి, చెడువి తలంపులు బాధిస్తాయి. మనసును నియంత్రణచేసే సాధనం తలంచేవాడు తలంపులనుంచి తన ధ్యాసను మరల్చడంలోనే ఉంది. అందువలన, యిది గమనించకుండా ఎన్ని సంవత్సరాలు నియంత్రణ సాధనలు చేసినా, ముందుకేమీ సాగదు. ఏ తలంపులనైతే వదుల్చుకోవాలో వాటికై సమయమంతా వ్యర్థం అయిపోతుంది.

నియంత్రణ సమస్యకు నివారణ యింకోచోట ఉంది. తలంపులను పాక్షికంగా నిలుపుదల గురించి ప్రయత్నించేకంటే, మనసు స్వభావం అర్థం చేసుకుని దాన్ని విశాలం చేయాలి. అవి తలంచే వాడిపై ఆధారపడి పుడుతున్నాయి కాబట్టి. అందుకనే తర్కం, ధ్యాసను తలంపుపైకాక తలంచేవాడిపై మరల్చవలెను.

తలంపులను జయించేయాలనే ప్రయత్నం వలన యింకా విజృంభించు తాయి. అనంతమైన తలంపుల సైన్యంతో యుద్ధం చేయడం అంటే అంతే. ఇంకా పిచ్చెక్కుతుంది తలంపులతో. తలంపుల యొక్క వ్యర్థత్వాన్నీ, కలిగే నష్టాన్నీ యెవరైనా గుర్తిస్తే వాటిని మొత్తం లాగి కట్టకట్టి తీసి బయట పడేస్తారు, అంతేగానీ కొన్ని ఉండాలనీ కొన్నిపోవాలనీ యేమీ అనుకోరు.

ఒకసారి కీలకమయిన తలంచేవాడు/అహంకారం/ నేను అనే భావన అర్థం అయిందంటే చెదరిపోవడం, పరుగులు, వివిధ రకాలు అన్నీ మెల్ల మెల్లగా తగ్గుతూ, సహజంగానే మనసు నియంత్రణ జరుగుతుంది. మనసు యెన్నో పాయలుగా ప్రవహించేది ఒకటైపోతుంది. ఒకేదానిపై ధ్యాస, దృష్టి అంతా నిలకడగా నిలుస్తుంది.

ప్రపంచం వస్తువుల విషయాలు, సంబంధాలు తలంపుల నుంచి దృష్టిని తనపై, 'నేను'పై నిలపినపుడు యేమి జరుగుతుంది? రమణులకు అనుభూతి కలిగినట్లు, మనసు తన మూలస్థానం హృదయంలో కలసిపోతుంది. బాహ్యంలోని విషయాలు, తన తోడైన తలంపుల నుంచి తలంచేవాడు దూరమయినపుడు యేమవుతుంది? తలంచేవాడు (వ్యక్తి/అహంకారం) లేకుండా పోతాడు. ఎక్కడికి? తను పుట్టు మూలస్థానం లోనికి. తనకేమీ స్వతంత్రత, ప్రత్యేక ఉనికి, స్వంత శక్తియేమీ లేవు. తలంపుల నుంచి వేరవగానే, తను పుట్టు మూలస్థానంలో కలసిపోతుంది.

మూలస్థానం గురించి కొంత వివరణ కావాలి. అది గ్రహించడం కష్టం యేమీకాదు. నేను అనే భావన/అహంకారం/వ్యక్తికి ఒక మూలం, ఆధారం అయిన స్థానం ఉండాలి. ఎందుకంటే గాఢనిద్రలో అది మాయమైపోతుంది. మెలకువతో మళ్ళీ లేస్తున్నది కాబట్టి. ప్రతీరోజూ యీ జరిగే పద్ధతిలో నూతన శక్తితో తాజాదనం కలుగుతంది. అందుకని ఆ మూలం అనంతశక్తి స్థానం 'నేను', ఆత్మ చైతన్యమే.

వ్యక్తి, ప్రపంచం యీ రెండూ ఉండే మనసు నియంత్రణ చేసే మిగతా సాధనలకంటే యీ పద్ధతి సంపూర్ణమైనది, విజయాన్నిస్తుంది. ఒకసారి రమణుని నేనెవరువిచారణ మార్గం సుగమమయితే తలంపులకు వేరుగా తలంచేవాడు, నేనుకు వేరుగా తలంచేవాడు మిగలరు. అలా వేరుగా ఉంటారు అనే భావనలు మాయమైపోతాయి. తప్పుడు గ్రహింపులూ, భావాలన్నీ హారతి కర్పూరంలా లేకుండా

పోతాయి. మనసు దేహంతో తనను గుర్తించుకోవడం, నేనెవరు విచారణ చేయగా, తన స్వస్వరూపాన్ని గ్రహించడం జరుగుతంది. అప్పుడు మనసు నిర్మలం శుద్ధమే అని, పూర్ణచైతన్యం కంటే వేరుకాదని తెలుస్తుంది.

అంతర్ముఖమయి తీవ్రమైన నేనెవరు విచారణ చేస్తున్నపుడు, పాత వాసనలు ప్రపంచంవైపు ఆనందంకోసం పరుగులెత్తే అలవాట్లు పెద్ద అడ్డంకులుగా ఉంటాయి. అందుకే భగవాన్ 'దృఢ నమ్మకం' 'ఓపిక, ఓపిక, అనంతమైన ఓపిక' 'సద్గురు అనుగ్రహం'తో వాటిని అధిగమించవచ్చు అని చెప్పారు.

నేనెవరువిచారణ అంటే తలంపుల కోటను చుట్టుముట్టి ఉంచడం లాంటిది. కోటలోనివన్నీ తలంచేవాడి ధ్యాసలేకపోవడం వలన ఆహారంలేక నశించిపోతాయి. కొన్ని, తలంచేవాడి పాత అలవాటైన ధ్యాసపడి లేస్తాయి. అయినా అవి తక్కువే కాబట్టి నేనెవరువిచారణతో వాటిని లేకుండా చేయవచ్చు. అలా మొత్తం తలంపుల సేవతో పోరాటం చేయనవసరం కలుగదు. కానీ యీ తతంగమంతటికీ యెంతో ఓపిక, ఓర్మి అవసరం. ఈ విచారణ పద్ధతి కొత్తది కాబట్టి, సాధన యింకా సాధన, దానిలో నిష్ణాతులైన వరకు చేయవలెను. భగవాన్ నుంచి యెల్లప్పుడూ ఉండే అనుగ్రహం వలన, మనసు పరిపక్వంపై ఆధారపడి సరయిన సమయంలో విజయం చేకూరుతుంది. అనుగ్రహం సదా ఉంటుంది. భగవాన్‌చే బోధింపబడి ప్రయత్నం మొదలై, సాధన చేయించి, శుద్ధ మనసును తెలుసుకునే వరకు సద్గురువుల అనుగ్రహం వెంట వెంటనే ఉంటుంది. ప్రార్థనతో అతనికి శరణాగతి చెందడం, అతని సహాయం సమగ్రంగా విజయం సాధించడంలో ఒక భాగమే. మనసు అనంత బ్రహ్మానందంలో మునిగి ఉంటుంది.

అధ్యాయం - 12

శుద్ధ మనసు - నిశ్చల మనస్సు - విభజన మనస్సు

సత్యాన్వేషకులు, రేగుతున్న గాయంలా తలంపుల వలన బాధింపబడి, ప్రశాంత మనసు, ఆలోచనలు లేని మనసే గమ్యం అనుకుంటారు. వారు మనసును నిశ్చలంచేస్తే, నియంత్రణ జరుగుతుందని నమ్ముతారు. అణగివున్న మనసు వలన పెద్ద ఉపయోగంలేదన్న విషయం వారు మరచిపోతున్నారు. గాఢనిద్రలో మనసు అణగే ఉంటుంది కదా? మరి లేవగానే, నిద్రలోకి పోకముందు కంటే జ్ఞానం యేమైనా పెరిగిందా? అలాగే, యోగుల సాధనలు కూడా యెన్నో గంటలు మనసును నిశ్చలంగా ఉంచుతాయి. కొన్ని మందులు కూడా, మనసును యెన్నో గంటలు నిద్రపుచ్చుతాయి. ఇలాంటి నిశ్చలం అంతా తుఫాను ముందు ఉండే నిశ్చలతవలె ఉండవచ్చు. మనసు స్వభావం తెలియనపుడు, యిలా సంపాదించిన నిశ్చలతను మనసుయొక్క శక్తి అగ్ని పర్వతం లేచినట్లు లేచి నాశనం చేయగలదు. అందుకే భగవాన్ తలంపులేని మామూలు స్థితి గురించి హెచ్చరించేవారు. భగవాన్ 'ఉపదేశ సారం'లో తాత్కాలికంగా లయమైన మనసు మళ్లీ లేచి తనకలవాటైన రీతిలో మళ్లీ యెన్నో రెట్లు విజృంభిస్తుందని తెలిపారు. అందుకే భక్తురాలైన ఎచ్చమ్మాళ్‌కు యేకాగ్రతతో నాసాగ్రంపై దృష్టి నిలపి, తాత్కాలికంగా తలంపులు ఆపడం లాంటిది చేయవలదని చెప్పారు. స్వామి రామానంద సువర్ణగిరికి, తాత్కాలికంగా నిశ్చలమైన మనసు ఆధ్యాత్మిక సాధనలో చాలా ప్రమాదకరమైనదని తెలిపారు. దాన్నే, ఆత్మలో మునిగివుండే పరిపూర్ణ స్థితి అని భ్రమపడే ప్రమాదం యెంతయినా ఉంది. సహజ స్థితి తాత్కాలిక నిశ్చలం కంటే యెంతో వేరైనది శాశ్వతమైనది. భగవాన్ యిలాంటి సాధనల్లో యిరుక్కున్న భక్తులను, స్వయంగా వివరించి చెప్పి అపాయం నుండి కాపాడేవారు. ఆశ్రయంలోని పాత హాలులో ఒక భక్తుడు ధ్యానం చేస్తూ తాత్కాలిక నిశ్చలస్థితికి చేరుకునేవాడు. భగవాన్ యిది గమనించి, యింకో భక్తునితో వారిని తీసుకునిపోయి కొంతదూరం నడిపించి తీసుకుని రమ్మనేవారు. మనసు నీరసం కాకూడదు, ఎంతో చురుగ్గా ఉండాలి, తలంపులకై కాదు, తలంచే వాడిని గురించి, అంతర్ముఖంలో స్థిరం కావడానికి, తన మూలస్థానం వెదకడానికి. తాత్కాలిక లయం తలంపులను ఆపి మనసును మెతగ్గా చేస్తాయి. అది విచారణకు పనికిరాదు. అందువలన యిలాంటి సాధనలు తన మూలం తెలుసుకునే విచారణనుండి

దూరం చేస్తాయి. అందుకే అలాంటి పద్ధతులు గమ్యమార్గానికి ఆటంకాలవుతాయి.

నిశ్చల మనసుపై విశ్వాసం, అది భ్రమ అయినా సరే, యెందుకు కలుగుతుంది అని యెవరైనా అడగవచ్చు. మనం చేస్తున్నదంతా విభజింపబడిన మనసు నుండి దూరంగా పోవడం. విభజన యెందుకంటే, నేను భావన / అహంకారంను అది చూసే బాహ్యం, ప్రపంచం నుండి విడదీస్తున్నందు వలన ఇందులోనే ఘర్షణ విత్తనాలు ఉన్నాయి. ఎందుకంటే యీ విభజన నిజం కాదు, తప్పుడిది. అసత్యం. తలంపులన్నీ మనసు యొక్క ఆవిష్కరాలే. మనం స్వప్నానుభవం జాగ్రత్తగా గమనించితే, కలలో కూడా ఒక ప్రపంచం ఆవిష్కరించబడుతుంది. ఇంకా, నేను భావన/వ్యక్తి/అహంకారం, 'నేను' కంటే వేరుగా సత్యంకాదు, లేదు.

అయినాసరే, విభజింపబడిన మనసు నివారణ, దాన్ని నిశ్చలం చేయడం వలన జరుగదు, దాని సహజ స్వభావం అర్థం చేసుకుంటే కలుగుతుంది. నేను యెవరు విచారణ వలన యీ అర్థం తెలుస్తుంది. ఈ విచారణ అంతా నేను భావన/అహంకారంపైనే కేంద్రీకరించబడుతుంది. మొదట తలంపులు, ప్రపంచం నుంచి తప్పించబడతాయి. తరువాత, యిలా తలంపులనుంచి వేరు కావడమే మనసును తన మూలస్థానంవైపుకు తోస్తుంది. మనసు మళ్లీ తిరిగి లేవలేదంటే అర్థం యిక అహంకారం, మిగతా తలంపులు, ప్రపంచ విషయాలు మళ్లీ లేవవు. మనసు ఆలోచనా రహితం, భావనా రహితం అయి శాంతం అవుతుంది, సహజ శాంతం నిలుస్తుంది. యోగక్రియల వలన కలిగిన తాత్కాలిక ప్రశాంతతకు యిది భిన్నం అయినది. ఈ ప్రశాంతంలో పూర్ణచైతన్యం ఉల్లాసం ఉంటాయి. దీన్ని నాశనం అయిన మనసు అని పిలుస్తాం. కానీ యిదే సత్యమైన మనస్సు, సదా చురుగ్గా, ఆనందంతో ఉంటుంది. మరి అవసరమైనపుడు తలంపుల మాటేమిటి? అవసరం అయినపుడు, అవసరం అయినంత మేరకు తలంపుల స్పందన ఉంటుంది. ఒక భక్తురాలు దీని విషయంలో తన అనుభవం తెలిపింది. 'ఒకరోజు మధ్యాహ్నం ఒకరు కాగితంపై వ్రాసి ఉన్న పద్యాలు భగవానుకు చూపించారు. భగవాన్ వాటిని చదివి, కొన్ని మాటలు చెప్పి, ఉదాహరణగా యోగవాశిష్ఠంలోని ఒక కథ చెప్పి వివరించారు. మహర్షి ఆ కథను చెపుతున్నపుడు తనే స్వయంగా అందులోనికి, గురిపెట్టిన బాణంలా, పోయి అక్కడ ఉండి తెలిపారు. తెలిపిన వెంటనే తన సహజమైన బోధించే మౌనంలో ఉండిపోయారు.

భగవాన్ మౌన మనస్సు పనిని వివరించేవారు స్పష్టంగా. అది ఆయనకు చిన్న పిల్లల ఆటలాంటిది. దానికి ముందు, మనసు నియంత్రణ సాధనా పద్ధతుల్లో

పరిమితులను చూద్దాం. వాటన్నింటిలోనూ ఒక విషయంపై యేకాగ్రత - పవిత్రనామం మంత్రం రూపం సద్గురువు లేక దైవం అవవచ్చు, ఉంటుంది. ఈ విషయంపై నిలువడానికి కావలసిన తలంపుల శూన్యతకై ప్రయత్నం జరుగుతుంది. ఈ ప్రయత్నం విజయం కాదు, యెందుకంటే మనసు స్వభావాన్ని అర్థం చేసుకోలేదు కాబట్టి. భగవాన్ 'తలంపులనేవి మనసులోని ఒక భాగమే, వేరు కాదు. అందుకే యీ మనసు అంటే యేమిటి? అని శోధించితేనే, యీ మనస్సు యెక్కడనుండి పుడుతున్నది? అని ప్రశ్నిస్తే, అపుడు మనసు తలంపులను వదిలి, ఆ మూల స్థానంలో కలసిపోతుంది. అది ప్రపంచాన్ని (ఆబ్జెక్ట్) చూచే వ్యక్తి/అహంకారం (సబ్జెక్ట్) కాదు.

'గది అంతా రాత్రి చీకటితో నిండినపుడు, వస్తువులను చూడడానికి ఒక వెలుగుతున్న దీపపుకాంతి అవసరం అవుతుంది. కానీ సూర్యుడు ఉదయించిన తరువాత వస్తువులను చూడడానికి దీపం అవసరమే లేదు. సూర్యుని చూడడానికి యెలాంటి దీపం అవసరం లేదు. స్వయం ప్రకాశం అయిన సూర్యుని నువ్వు యెప్పుడూ తెలుసుకునే ఉంటావు'.

'అలాగే మనసుతో కూడా వస్తువులను చూడడానికి సూర్యుని నుంచి వెదజల్లే కాంతి అవసరం అవుతుంది. కానీ హృదయాన్ని తెలుసుకోవడానికి మనసు అందులోనికి అంతర్ముఖమైతే చాలు'.

హృదయంయొక్క ఆకర్షణశక్తి వలన, మనసు దాని మూలస్థానంలో అణగడం దానికదే జరుగుతుంది. అపుడు శుద్ధనిర్మల మనసు విభజింపబడిన మనసు బదులు నిలుస్తుంది. ఆ తరువాత ఉన్నదంతా ఆనందమే ఆనందం, పరమానందం, బ్రహ్మానందం, అనంతమైన ఆనందం, సదానందంలో మనసు మునిగి ఉంటుంది.

అధ్యాయం - 13

కాలం తరిగిపోతూ ఉంది

డెబ్బయి సంవత్సరాల వయసు వచ్చేసింది. అందుకు సంబంధించిన ఉత్సవాలన్నీ యిప్పుడే పూర్తయ్యాయి. ఒకరి జీవితంలో డెబ్బయివ సంవత్సరం చాలా కీలకమయినది అంటారు. మన తలంపుల్లో, మాటల్లో, చేతల్లో చేసిన లెక్కలేనన్ని తప్పులు, పాపాలకు భగవంతునికి వేలకొద్దీ క్షమాపణచెప్పి ప్రార్థన జరిగింది. వాటి సూచిక పట్టీకి అంతం లేదు. అహంకారపూరిత జీవనంతో, స్వార్థంనిండిన కోరికలవలన భగవంతుని చట్టఉల్లంఘనలు లెక్కలేనన్ని జరిగేయి.

ఆ ఉత్సవాలకు వచ్చిన ఒక స్నేహితుడు 'నువ్వు యింకా యెక్కువకాలం జీవించాలని కోరుకుంటున్నావా?' అని అడిగాడు. ఇలాంటి ప్రశ్న వినగానే, అలాంటి సందర్భంలో జాలిలేని కఠినమైన, ఘోరమైన ప్రశ్న అనిపిస్తుంది. అయినాసరే, యెలాంటి వాదనకు తావు లేకుండా, 'అది రమణ భగవాన్ యిష్టం' అని సమాధానం వచ్చింది చల్లగా, నెమ్మదిగా, ప్రశాంతంగా.

ఈ ప్రశ్న, దాని జవాబు కూడా యెవరికైనా ఆలోచింపజేయాలి. కాదా మరి? భగవాన్‌కు అన్నివిధాల శరణాగతి పొందినవారు మాత్రమే యెవరయినా సరే, నిజంగా 'అంతా భగవాన్‌దే' అని చెప్పగలరు. మిగతా వారికి, ఆ ప్రశ్నతో యీ జీవితమంతా యేమిటి, యెందుకనే సమీక్ష జరగాలి. మిగిలిన జీవితకాలం, యెన్ని సంవత్సరాలు మిగిలి వున్నా గానీ, యెలా గడపాలి? గతం కంటే పూర్తిగా లేక కొంతయినా మార్పు ఉంటుందా జీవితంలో? సత్యం యేమిటనీ, తెలుసుకోవాలనీ ఆతృత యేమైనా కలుగుతుందా? సత్యం తెలుసుకోవడానికి నేనెవరు విచారణ స్థిరంగా జరుగుతుందా? భగవాన్‌పైన జీవితం పూర్తిగా ఆధారపడుతుందా? నిరంతరం ప్రవహించే భగవాన్ అనుగ్రహం అవగత మవుతుందా, అందుకుంటానా? లేక మిగతా రానున్న జీవితంకాలం కూడా యింతకుముందులాగే అలవాటుగా, మామూలుగా, అశాంతిగా, నీరసంగానే గడచిపోతుందా?

ముసలివారే కాదు, కుర్రవారు కూడా దృష్టి సారించాల్సిన కొన్ని ప్రశ్నలూ ఉన్నాయి. ఎందుకంటే చాలా విషయాలు స్పష్టంగా లేవు. జీవితకాలం యెవరికైనా అసలు యెంతో తెలియనే తెలియదు. దేహం పోవడానికి యే సమయం, యే

వయసులోనైనా కాలం వచ్చేసరికి, యెవరైనా యింకా కొంతకాలం ఉంచమని ప్రార్థిస్తారా? చేస్తే, ఎందుకు? ప్రార్థన చేస్తే, అది మన్నించి యింకా కొంత కాలం పొడిగించబడిందే అనుకోండి, అపుడు కూడా అర్థం ఆలోచనా లేని జీవితమే కొనసాగుతుందా లేక జీవితంలో సత్యాన్ని తెలుసుకుందామనే తీవ్ర తృష్ణతో కొత్త పంథా మొదలవుతుందా?

అలాంటి ప్రశ్నలు మనల్ని యింకా లోతుగా కొన్ని మన మౌలిక గ్రహింపుల్లోకి తీసుకుని పోతాయి. అసలు కాలం అంటే యేమిటి? భగవాన్ చెపుతారు, కాలం అంటే అహంకారమే, నేను శరీరం అనే భావన, నేను మనసు అనే గ్రహింపే అని. కాలం గతంతో, గతజన్మల వలన ఉన్న అనంత అనుభవాల వలన, గుర్తించబడి సంధింపబడి ఉంటుంది. ఈ గుర్తింపు, సంధిని కత్తిరించి అంతంచేస్తేగాని, జీవితంయొక్క అనంతమైన ఆనందం, మధురం అనుభూతి కాదు. మనం మన గత అనుభవాలకు, తలంపులకు, అనంతంగా పుడుతున్న ఆలోచనల ప్రవాహాలకు బానిసలై ఉన్నాము. ఎవరి జీవితమైనా యెలా మొదలయిందో అలాగే అంతం కాకుండా, అత్యద్భుతమైన జీవన అందం, పరమానందాన్ని మరచి బ్రతికి యీ జీవితం వ్యర్థం కాకుండా ఉండాలంటే, అందరిపై సవారీ చేస్తూ కొరడా ఝుళిపిస్తున్న వారి గతం నుండి విడివడి విముక్తి పొందాలి.

గతం నుండి విముక్తి కలిగితే, గతాన్ని విడిచేస్తే జీవితం ప్రతీక్షణం మధురమై పూర్ణమే. మనసు, గతం భవిష్యత్తుల వలన ప్రభావితం అయి దారి మళ్లక, ప్రతీ ఒక్కక్షణం వర్తమానంపైనే లగ్నం అవుతుంది. అదే వర్తమానంలో పూర్ణంగా జీవించే మధురమైన జీవితం. ఇదంతా సరి అయినదే, మేథోపరంగా అంగీకరించేదే, కాని యేదో చాలా కొద్దిమందే దీన్ని గ్రహించి ఆచరించి ఆనందించగలుగుతున్నారు. ఇదేం ఆశ్చర్యం కాదు, యెందుకంటే ప్రస్తుతం మన ముందు ఉన్న యెన్నో సంబంధాలు, సమస్యలు, సాధించాల్సిన గమ్యాలు, యీ విషయంలో నుండి శ్రద్ధను దూరంచేసి, కేవలం వర్తమానంలో మనసును ఉండనీయవు. తను యెక్కడికి పోతానో, భవిష్యత్తు యెలా ఉంటుందో, యేమవుతానో అనే భయం ఉంటుంది. ఒక జీవన విధానానికి, గ్రహింపు ఆలోచనా సరళికి అలవాటయిపోయారు. ఇక్కడ చెపుతున్నదంతా, యీ అలవాటుకు పూర్తిగా వ్యతిరేకం, అందుకని మనసు యీ సత్యంవైపు మార్పు అంటేనే భయంతో వణుకుతుంది, దూరంగా పారిపోతుంది.

అందుకని, యిలాంటి అవసరం, అర్థంలేని భయాల నుంచి అధిగమించాలి. గతం అన్నది, యెన్నో బాధలు, గాయాలు తీరని కోరికలతో కూడి ఒకరిపై ఉన్న అతిభారమైన బరువే. వాటి తాలూకా ప్రభావం, ఉధృతం చాలా చాలా దృఢం అయినది. వాటినుంచి బయటపడడం అనేది జరుగక, వాటి బానిసలుగా జీవిస్తుంటారు. కొన్ని మధుర అనుభవాలు కూడా ఉండవచ్చు. కానీ వాటి ప్రభావం కంటే బాధల అనుభవాల ప్రభావం యెంతో ఉధృతంగా లోతుగా కలుగుతాయి. ఏదేమయినా సరే, యీ జీవిత విధానాన్ని వదలి, కొత్త మధుర జీవనాన్ని ఆవిష్కరించే, పరమానందాన్నిచ్చే, పద్ధతిని సాధనచేసి శ్రద్ధగా కృషి చేయాలి.

ఈ స్థితికి చేరుకోవడానికి, అందులో స్థిరంగా ఉండడానికి అవసరమైన ప్రయత్నం యేమిటనే ప్రశ్న వస్తుంది. కొలంబో నుంచి వచ్చిన ఒక సాధకుడు, భగవాన్‌ను 'కోరిక ఎంపిక, అవకాశం, ప్రయత్నంకు అతీతమైన సహజానందం ఎరుక స్థితికి చేరుకోవడానికి అన్నింటికంటే ఉత్తమమైన మార్గంయేది'? అని అడిగారు. అంటే సాధకుని ఉద్దేశం, అతని మాటల్లో 'ప్రతీక్షణం పూర్ణంగా జీవించడం' కోసం ఉత్తమపద్ధతి గురించి. మానసిక ప్రవృత్తులు యేమీ లేనపుడు మనసు పూర్ణంగా వర్తమానంలోనే ఉంటుంది. భగవాన్ సమాధానం :

'ఎంపిక, ప్రయత్నం లేక సదా ఉండే ఎరుక యేమనగా సహజ స్వభావం. మనం అది సాధించగలిగితే, ఆ స్థితిలో నిలిస్తే, అదే సత్యమైనది. కానీ దాన్ని ప్రయత్నం లేకుండా చేరుకోలేరు, ధ్యానం అనే ప్రయత్నం కావాలి, చేయాలి. గత జన్మల వాసనలన్నీ మనసును బాహ్యంలోనికి తీసుకునిపోయి బాహ్య విషయాల్లో ముంచి ఉంచుతాయి. అలాంటి తలంపులనన్నింటినీ విడిచివేసి, మనసును అంతర్ముఖం చేయాలి. ఈ ప్రయత్నం అందరికీ అవసరం అయినదే. అన్ని గ్రంథాలు, వక్తలు 'మౌనంగా ఉండు, నిశ్చలంగా ఉండు' అని చెపుతారు. కాని అది అంత సులభం కాదు. అందుకే యీ ప్రయత్నం అంతా చాలా అవసరం. ఎంపిక, ప్రయత్నంకు అతీతంగా ఉండే ఎరుక స్థితి కలుగడానికి యెంతో నిరంతర ధ్యానం వలనే సాధ్యం'.

భగవాన్ బోధించిన నేనెవరువిచారణ కంటే యెలాంటి ధ్యానం ఉత్తమమైనది? విచారణ అంతా ధ్యానించే వాడిపై, అహంకారం, వ్యక్తిపై కేంద్రీకరించబడి ఉంటుంది. కాబట్టి యిది సూటిది. నేనెవరువిచారణ సాధన వలన, మనసు కల్పించే గందరగోళం నుంచి తొందరగా బయటపడటం

అలవాటయి, 'నేను'పై దృష్టి లగ్నం అవుతుంది. ఒకసారి యీ కేంద్రీకరణ సమగ్రం పూర్ణం అయితే, లోపల నుంచి బ్రహ్మాండమైన అయస్కాంతంలా అత్యంత ఆపలేని ఆకర్షణ శక్తి ఉన్న ఆత్మ (నేను), తనని లోపలికి లాగుకుంటుంది. ఒక నది సముద్రంలో కలసి ఐక్యం అయినట్లు, కాలం అహంకారం ఆ స్థానంలో కలసి లీనమయి యిక లేకుండా పోతాయి. అహంకారంలేని జీవనం మొదలవుతుంది.

ఆ తరువాత, వారి శరీరం కాలంలో ఉండవచ్చు, కాని మనసు కాదు. మనసు కాలానికి, దేశం, ప్రదేశాలకు అతీతంగా ఉంటుంది. దీన్ని, 'మనసు మరణం' అని అంటారు. నిజంగా అయితే యిది మనసుకు సత్యంగా పుట్టుక, అది విముక్తి పొంది చైతన్యంగా, బ్రహ్మానందంగా ఉంటుంది. దేహంయొక్క మరణం అంటే భయమూలేదు, ఆహ్వానమూ లేదు. శరీరం దైవం యొక్క ఒక సాధనం అయి, పరమేశ్వరుడు దాన్ని ఉంచిన ఉద్దేశ్యం నెరవేరే వరకు ఉంటుంది. ఈ స్థితినే భగవాన్ మనకు బంగారు పళ్లెంలో అనంత కరుణతో అందిస్తున్నారు. ప్రతీ శ్రద్ధాభక్తులున్న సాధకునికి మార్గదర్శకత్వం వహిస్తూ, నిరంతరం నడిపిస్తూ, అనుగ్రహంతో వీక్షిస్తూ ఉన్నారు భగవాన్.

అధ్యాయం - 14

మరణించేది - మరణమే లేనిది

అది అనుకోకుండా అకస్మాత్తుగా, గమనించనంతటి యెంతో వేగంగా, ఆకాశంలోని మెరుపులా జరిగిపోయింది. అతను చాలా మంచివాడు, యెంతో చురుగ్గా, వివేకంగా, యెప్పుడూ అందరికీ సహాయకారిగా ఉండేవాడు. అతను ఛాతీనొప్పి అని చెప్పాడు. రెండు గుండెపోట్లు తరువాత, గుండె పని చేయడం ఆగిపోయింది. హాస్పిటల్‌నుంచి అతని శవాన్ని యింటికి తీసుకుని వచ్చారు. అది హృదయవిదారకమైన దృశ్యం, గట్టిగా తల్లి రోదన, భార్యకు అపుకోలేనంత దుఃఖం, భాతృ, పుత్ర, పుత్రికల భారమైన ఆక్రందనలు, నిరంతరం అందరికీ ధైర్యం చెపుతూ ఓదార్చే స్నేహితులు, బంధువులూ.

ఈ తతంగంతో పాటు, చివరి చూపు అయినా దక్కుతుందనే వారికోసం బంధువులకు, స్నేహితులకు యీ వార్తను అందించడం, అంత్యక్రియలకు అవసరమయిన ఏర్పాట్లన్నీ చేయడం, వచ్చినవారికి టీ, కాఫీ, టిఫిన్, భోజనం ఏర్పాట్లు అన్నీ సాగిపోతున్నాయి. అలా జీవితం సాగిపోతుంది, ఎవరు ఆగినా సరే.

వాతావరణం అంతా దుఃఖంతో నిండి ఉంది. క్రొత్తగా వచ్చే ప్రతీ ఓదార్చేవారు ఆ వాతావరణానికి యింకొంత దుఃఖం కలుపుతున్నారు. ఆశ్చర్యం! కొన్ని గంటల క్రితమే యెంతో చురుగ్గా ఉండి, మాట్లాడి పనిచేసిన ఆ శరీరం యిపుడు అక్కడ ఒక శవమై, నిర్జీవంగాపడి ఉంది. దాన్ని రేపు ఉదయం వరకూ శీతలీకరణచేసి భద్రం చేయాలి.

రాత్రి అంతా యెంతో భారంగా నడచి, యేదోలా గడచిపోయింది. స్త్రీలందరినీ చివరిసారిగా చూపులను, వీడ్కోలును పూర్తి చేసుకోమన్నారు. జీవం పోయిన ఆ బరువైన శరీరాన్ని, యెంతో జాగ్రత్తగా ఎత్తవలసి వచ్చింది. అంతిమ ప్రయాణం మొదలయింది. అది ఎన్నో వందల వందల శవాలు వరుసలుగా దహనం చేసిన శ్మశానం గుండాపోయి, విద్యుత్ దహనవాటికవైపు పోయింది. ఎన్ని శవాలు, దహనాలు, అస్థికలు. ఇవన్నీ యీ రక్తమాంసాల గురించి గుచ్చి గుచ్చి చెపుతున్నాయి. మనకు తెలియని, ముందే నిర్ణయింపబడిన పంచభూతాలతో తయారు అయిన యీ శరీరం, పెరిగి, తిరిగి పంచభూతాల్లోనే కలసిపోతుంది.

ఆ దహన వాటికవద్ద యెన్నో నిబంధనలు, నియమాలు ఉన్నాయి. అక్కడ ఉన్న గుమస్తా టీ కోసం బయటికి వెళ్ళాడు. మరి అక్కడ వేచి ఉండవలసినదే. వేచి ఉండటం ఎంతో దీర్ఘమయినదనిపించింది. మళ్లీ ఒక చివరి చూపు, వీడ్కోలు, ఇక శవాన్ని దహన వాటిక విద్యుత్ గుహలోనికి నెట్టబడింది. ఇక అది చూడబడదు. చూడడానికి లేదు. మరునాడు ఉదయం వచ్చి అస్థికలు, బూడిద తీసుకోమని తెలిపారు. ఒక పిడికెడు అస్థికలు, అవశేషం మిగిలింది, అది కూడా పవిత్ర జలాల్లో కలిపేసేదే.

ఎంతో యిష్టమైన ఆప్తుడు వెళ్లిపోయాడు. ఇక అతను ఎంతమాత్రం తనకు ప్రియమయిన కూతురుని, ఎంతో సేవలు చేసిన భార్యనుగాని, యే దగ్గర దూరం బంధువులు, స్నేహితులనైనా పిలువలేడు. ఎంతో శ్రమించి కష్టపడి తన స్వంత తెలివితేటలతో పైకి వచ్చిన భక్తి, వినయాలు నిండిన ఒక మంచి మనిషి జీవితానికి తెరపడింది. అతనిలోని జీవన జ్యోతి ఆరిపోయింది. ఎంత తీవ్రంగానో లేచిన దుఃఖ కెరటం, జ్ఞాపకాలను చెరిపేసే గొప్ప పనితనమున్న కాలంలో పడిపోతుంది.

ఈ దుఃఖం, తతంగాల మధ్య ఉండి వాటిని పంచుకుంటూ గమనించుతూ ఉండినవారికి, జీవితం దాని ప్రయాణం, స్వార్థచింతనలు, చేతలు, సంకుచిత పనులు, ఘర్షణ గొడవలు, యింకా యెన్నో, అన్నీ చూస్తుంటే నిస్పృహ కలుగుతుంది. జీవితం అంటే తాత్కాలికమైన ఒక మజిలీ మాత్రమే అనిపిస్తుంది. దాని ఉద్దేశం గమ్యం యేమిటని లోతుగా శోధన చేయాలి అనిపిస్తుంది.

అదే సమయంలో, యీ తాత్కాలిక ప్రయాణం, శరీరం అశాశ్వతత్త్వం, మట్టినుంచి పెరిగే దేహం, దానిచుట్టూ అల్లుకున్న నిర్మితమైన యెన్నో సంబంధాల గురించి గమనింపులు, ఆలోచనలు యెంతో కాలం నిలువవు. తొందరలోనే మరచిపోయి, మనసు పాత అలవాటయిన జీవితంవైపు మరలిపోతుంది.

అయినా, కొందరు మాత్రం పవిత్ర గ్రంథాల ప్రబోధాల నుంచి జనన మరణాలే లేని అమృతత్వమయిన ఆత్మ గురించి తెలుసుకుని, శరీరం యొక్క శాశ్వతత్త్వం గురించి ప్రశ్నించుకుంటారు. మనలో ఉన్న మరణం లేని శాశ్వత తత్త్వము, దేహం మరణమే అన్నిటికీ అంతిమం అని అంగీకరించడానికి నిరాకరిస్తుంది. ఎవరికైనా యీ విషయంలో గమనించుతూ, తర్కించుతూ, శోధించుతూ ఉంటే, దగ్గర బంధువో స్నేహితులో మరణించినపుడెల్లా అతని

జీవితంలో సత్యంవైపు మార్పు జరుగుతూ ఉంటుంది. మనం చూసే, తెలుసుకునే ప్రతీ మరణం ఒక ప్రశ్నను లేపుతుంది. దుఃఖం మనలో ప్రశ్నలు రేపుతుంది, అందువలన శోధనా, జ్ఞానం పెరుగుతుంది.

ఇది రమణులు తన తండ్రి మరణించినపుడు శోధించిన మాదిరిగానే ఉంటుంది. తిరుచ్చుజిలో, 1892వ సంవత్సరంలో తండ్రి సుందరం అయ్యరు గారు మరణించారు. భగవాన్‌కు అపుడు పండ్రెండు యేళ్ల వయసు మాత్రమే. రోధిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య ఉన్న రమణులు, చనిపోయారు అని చెపుతున్న తన తండ్రి దేహానికి, పూర్తిగా జీవంతో కదులుతున్న తన దేహానికి బేధం యేమిటని ప్రశ్నించుకున్నారు. ఈ అంతర్గత శోధనవలన, తన తండ్రి శరీరంలోని 'నేను' వెళ్లిపోయి అది శవం అయిందనీ, తన శరీరంలోని 'నేను' యింకా ఉన్నదని అభిప్రాయానికి వచ్చి నిశ్చయించారు.

అలాంటి సంఘటనే, తన తల్లి తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వచ్చిన తరువాత తీవ్రమయిన జబ్బుకు గురి అయినపుడు జరిగింది. భగవాన్ శరణు పొందిన ఒకే ఒక్క నాథుడు, అరుణాచలంలో ప్రతిష్టితమైన శివుడే. అతని తల్లి ముక్తికి యింకా సిద్ధం కాలేదు. అందుకే, ఆవిడ జబ్బు నయం అయ్యేందుకు అరుణాచలుని ప్రార్థిస్తూ, ప్రార్థనలోనే మౌళికమైన 'అసలు మరణం అంటేనే యేమిటి? అని ప్రశ్నిస్తారు'. 'కాలం అంటే యేమిటి? మరణం అంటే యేమిటి?' విచారణ చెయ్. నిజానికి మరణం అంటే దేహం పోవడం మాత్రమే. కానీ మనసు సంగతి యేమిటి. లోనున్న దివ్యత్వం మాట యేమిటి? 'శరీరానికి, మనసుకూ చైతన్యాన్నిచ్చే, మరణం లేని శాశ్వతమైనదేమైనా మనలో ఉన్నదా?' అంటూ ప్రశ్నించాలి అన్నారు.

శరీర మరణ సమయంలో, మనసు ప్రాణశక్తిని ఆవరించుకుని యీ దేహంలో నుంచి పోయి, యింకో శరీరానికి, స్థూలమైనా సూక్ష్మముదైనా, సంధించుకుంటుంది అని భగవాన్ తెలిపారు. ఇలాగే, వరుసగా జనన మరణాలు, చివరికి మనసే మరణించే వరకూ యిలా జరుగుతూనే ఉంటాయి. అందుకనే ఎవరైనా ముఖ్యంగా యీ మనసుపైనే దృష్టి పెట్టి, దాని నిజ స్వభావం యేమిటో తెలుసుకోవాలి. లేకపోతే, అది తలంపుల సమూహంగా, గత సుఖ దుఃఖాల అనుభవాలతో కూడి వాసనలు, సంస్కారాలుగా సాగుతూ ఉంటుంది.

మనసు మరణం అంటే, అది దాని మూలస్థానంలో కలసిపోవడమే

అని రమణులు చెపుతారు. నేనెవరు విచారణ అంటే యీ అహంకారం/ మనసుకు గురిపెట్టబడిన శోధన కాబట్టి, ఫలితంగా మూలంలో కలసిపోతుంది. అపుడు శుద్ధ నిర్మల మనసు, ఆత్మకు ప్రతిబింబం అయినది ఉంటుంది. అందుకే, తల్లి గర్భాల నుంచి గర్భాలకు మారుతూ పుట్టే నరకయాతన నుంచి తప్పించుకోవా లనుకునేవారు, స్థిరంగా శ్రద్ధగా తీవ్రంగా మనసు సహజ స్వభావాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి. అహంకారంపై గురిచేసిన 'నేనెవరు విచారణ', ఫలితాన్ని తప్పక యిస్తుంది.

సందేహమే లేకుండా, తీవ్ర తపన ఆర్తితో చేసే విచారణ వలన మనసు సత్యరూపం తెలుస్తుంది. కానీ విజయానికి అది చాలదు. ఎవరైనా విజయానికై సద్గురువులు రమణుల నిరంతర రక్షణ, సహాయం, అనుగ్రహం గుర్తుంచుకోవాలి. ఎందుకంటే మనలోని అంతర్గత వాసనలు వేచివున్న అగ్ని పర్వతాల్లాంటివి. అవి అయిదు యింద్రియ ఆసక్తులతో మనసును లోబరచుకుని అగాధాల్లోనికి త్రోసేస్తాయి. ఎంత ఆధ్యాత్మిక సాధన చేసినా, యేదో బలహీన క్షణంలో వృధాగా పోతుంది. సద్గురు అనుగ్రహం సదా ఉన్నవారు మాత్రం రక్షింపబడతారు. గత వాసనలు సంస్కారాలు మనల్ని క్రిందకి త్రోసివేయకుండా భగవాన్ రక్ష సదా కావలసిందే, అవసరమే.

ఈ శరీరంలో జీవించి ఉండగానే, మన యొక్క మరణం లేని అమృత తత్త్వం తెలుసుకొనడం సాధ్యమే అని భగవాన్ గట్టిగా చెపుతారు. శ్రద్ధగా నిరంతరంగా నేనెవరు విచారణ వలన, సదా భగవాన్ అనుగ్రహాన్ని గ్రహించడం వలన యిది సాధ్యమవుతుంది. ఈ జీవితంలోని యీ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకుని అంతర్ముఖమై విజయులు కాకపోతే, ప్రతీ జన్మకూ జన్మకూ శ్మశానానికి ప్రయాణం తప్పనిదే.

అధ్యాయం - 15

సర్వోత్తమ వైద్యుడు

కోరికలు లేని స్థితి అవసరం గురించి మన పవిత్ర గ్రంథాలు చక్కగా వక్కాణిస్తున్నాయి. జ్ఞానులు, భగవాన్ రమణ లాంటి వారికి యెలాంటి భయం అన్నది లేదు. ఎందుకంటే వారు యెలాంటి కోరికలు లేనివారు, దేన్నీ కోరుకొనరు. కోరికలు లేకపోవడమూ, భయంలేకపోవడమూ అన్నా ఒకటే, అందుకే యీ స్థితిని యెలా సాధించాలన్న ప్రశ్న ఉదయించాలి.

అందుకోసం, యెప్పుడూ రెండు పద్ధతుల్లో ప్రయత్నం సాగేది. ఒకటి ఉన్న కోరికలను తీర్చుకుంటే యింక సంతృప్తి ఉంటుంది అనుకుని కోరికలను తీర్చుకోవడము. భగవాన్‌ను ఒక భక్తులు అడిగారు.

ప్రశ్న : కోరికలను త్యజించేమందు, యెవరైనా తమకు ఉన్నవాటిని తీర్చుకుని సంతృప్తి చెందాలి కదా?

జవాబు : అలాగే, మంటలను కూడా పెట్రోలు పోసి ఆర్పవచ్చునా? కోరికలను తీర్చుకొనే కొద్దీ, సంస్కారాలు యింకా లోతుగా వృద్ధి చెందుతాయి. అవిపోయే ముందు అవి బలహీనపడాలి. కోరికల్లో మునిగిపోకుండానే, వాటిని బలహీన పరచడం జరుగుతుంది. కోరికలను తీర్చుకున్నపుడు కలిగిన ఆనందం వలన యింకా ఆనందం శేషించి మిగిలి ఉంటుంది. దీనివలన, యింతకుముందు ఆనందం కలిగించిన వాటి గురించి మళ్లీ మళ్లీ కోరుకోవడం జరుగుతుంది.

అందువలన కొంతమంది, కోరికలను అణచివేస్తే, జయిస్తే అవి యిక ఉండవు, తరువాత హాని కలిగించవు అని చెపుతారు. అణచి వేయడం అనేది దాని స్వభావరీత్యా తాత్కాలికమైనదే. ఈ పద్ధతిని కూడా భాగవాన్ ఒక భక్తుని ప్రశ్నకు సమాధానంగా వివరించారు.

ప్రశ్న : నాలో లేస్తున్న కోరికలను నేను యేం చెయ్యాలి? వాటిని జయించి అణచివేయాలా లేక వాటిని తీర్చుకుని సంతృప్తి పొందాలా? భగవాన్ చెప్పిన పద్ధతిలో 'యీ కోరికలు కలిగినది యెవరికి?' అని ప్రశ్నించితే అవిపోవడం లేదు సరికదా యింకా బలపడుతున్నాయి.

జవాబు : అంటే, ఆ పద్ధతిని నువ్వు సరిగా చేయడం లేదని తెలుస్తుంది. సరి అయిన పద్ధతి యేమంటే యీ కోరికలకు మూలస్థానం యేమిటి తెలుసుకోవడం, అవి యెక్కడ నుంచి పుట్టి వస్తున్నాయెా కనుక్కోవడమూ, వాటిని తొలగించుకోవడం. నువ్వు వాటిని జయించి అణచివేస్తే తాత్కాలికంగా అణగినా, అవి మళ్లీ విజృంభించి లేస్తాయి. వాటిని సంతృప్తి పరిస్తే యింకా యెక్కువ సంతృప్తి కోసం పరితపిస్తాయి. సంతృప్తిపరచి వాటిని ఆపివేయడం అంటే, మంటలను ఆర్పడానికి దానిపై కిరోసిన్ పోసినట్లు ఉంటుంది.

సంతృప్తి లేక అణచివేయడం వలన కామరహిత స్థితి రావడం లేదన్న సత్యం తెలుస్తూనే ఉంది. కొంతమంది అలాంటి స్థితి అసలు సాధ్యమే కాదని అనుకోవచ్చు. ఈ అభిప్రాయం కూడా తప్పే. జ్ఞానులు కామరహిత స్థితిలోనే ఉంటారు. ఆ స్థితిలోని పరమానందాన్ని, అనుభవాన్ని చూపిస్తుంటారు. ప్రతీరోజు గాఢనిద్రలో ప్రతీవారు కామరహిత స్థితిలో, యెలాంటి కోరికలకై తలంపులు లేనివారై ఉంటారు అని భగవాన్ చెపుతారు. కోరికలను సంతృప్తిపరచకపోతే యెవరూ దరిద్రులైపోరు. అంతేకాదు, అందుకు విరుద్ధంగా, ఆ స్థితిలో దృఢంగా, ఆనందంగా, ప్రశాంతంగా ఉంటారు.

కొంతమంది మానసికంగా కామరహిత, భయరహిత స్థితిని ఒప్పుకుంటున్నా, ఆచరణలో సగం సగంతో ఆగిపోతారు. శ్రీ దేవరాజ మొదలియర్ గారితో (భగవాన్‌తో అనుదినము సంకలన కర్త) మాట్లాడుతూ భగవాన్ యిందుకు కారణాలు వివరించారు. 'ఇంద్రియ సుఖాల వెంట పరుగులెడతారు. ఎందుకంటే వాటి అనుభవం ఆనందం యిస్తాయని తెలుసు. ఋషులు కామరహిత స్థితి, పరమానంద స్థితిని అనుభవించి చూపారు. కానీ, ఆ అనుభవం అందరికీ లేకపోవడం వలన దాన్ని విశ్వసించరు'. అందుకే యీ ఆనంద అనుభవాన్ని యెట్లా సాధించాలనే ప్రశ్న వస్తుంది. కోరికలన్నీ 'కోరుకున్నవాడి'కి సంబంధించినవే. ఎవరైనా వాడిపై, అహంకారంపై దృష్టి నిలిపి కోరికల స్వభావాన్ని అర్థం చేసుకుంటే, నేను భావన / వ్యక్తి భావన పుట్టే మూలాన్ని శోధిస్తే, కామరహిత స్థితి కలుగుతుంది. భగవాన్ చెప్పిన యీ సలహా, తిన్నగా సూటిది సరళమూ అయిన నేనెవరు విచారణకే తీసుకుని పోతుంది. అందుకే యెవరికైనా వారి నిజస్థితి గురించి సందేహమూ, ప్రశ్న నిరంతరం, అంటే యేం పనిచేస్తున్నా విచారణ; పని, నడవడం, యేం చేస్తున్నాసరే ఉండాలి, కలగాలి. అలా మనసుతోనే, దానిపైనే దాని కోశంపై కేంద్రీకరింపజేస్తే మనసులోనికి తిప్పుతుంది. హృదయంలోని

దివ్యత్వం ఆత్మ (నేను) యొక్క ఆకర్షణశక్తి వలన మనసు లోపలికి పోతుంది. సహజంగానే బ్రహ్మానందం అనుభవిస్తుంది. ఒక పండిపోయిన పండుచెట్టు నుంచి దానికదే యెలా రాలిపోతుందో, అలాగే కోరికలను సంతృప్తి పరచడంలో ఆనందం ఉన్నదన్న భ్రమ అదే తొలగిపోతుంది.

సాధకులు ఒక విషయం మరువకుండా గుర్తుంచుకోవాలి. విచారణ విజయం కావాలి అంటే భగవాన్ అనుగ్రహం, మార్గదర్శకత్వం నిరంతరం ఉంటుంది అని, దృఢంగా విశ్వసించాలి. లేకపోతే మనసు యేదోలా బోల్తా కొట్టిస్తుంది. కామరహిత స్థితిలో స్థిరంగా నిలచేవరకూ భగవాన్ సహాయం, అనుగ్రహం సదా మనకు ఉంటుందని మనం నిశ్చయంగా అనుకోవచ్చు.

ఈ సమస్యకు పరిష్కారం యింకోలా కూడా జరుగవచ్చు. చేస్తున్నవాడు, కర్త యెవరో కనుక్కోవడం. తన శక్తి, యుక్తి వలననే యేవైనా ఫలితాలు, అపజయాల్ని అధిగమించి సాధించామని భావించి కర్మలు, చేతలు హుషారుగా చేస్తుంటారు. దీన్ని లోతుగా శోధించితే, జయం ఫలితాలు ఒకరి కోరిక శక్తియుక్తుల వలన కాదని తెలుస్తుంది. ఫలితాలు యేవయినాసరే భగవంతుని నియమాలైన కర్మలు, అనుగ్రహంబట్టి మాత్రమే కలుగుతాయి. ఇది పూర్తిగా గుర్తించి, గ్రహించితే బలమైన కోరికలు వాటికోసమై తాపత్రయాలు, పరుగులు ఆగిపోతాయి. అహంకారం, వ్యక్తిత్వముపై విశ్వాసముపై సందేహమూ, ప్రశ్న లేస్తుంది. తనూ తన శక్తియుక్తులపై సందేహాల వలన, తన సహజ స్వభావమేమిటో తెలుసుకునే తృష్ణ పెరుగుతుంది. కామరహిత, భయరహిత స్థితికి చేరుకునే మార్గం త్వరితమవుతుంది.

అధ్యాయం - 16

సత్పురుషుల సాంగత్యం అవసరం

ఋషుల సాంగత్యంలో బంధాలు, వాటి కారణమైన భ్రమలూ మాయమై పోతాయి. భ్రాంతి నుంచి విముక్తి పొందిన మనసు నిశ్చలం, మౌనం అవుతుంది. ఈ జీవితంలోనే జీవన్ముక్తులవుతారు. అందుకే ఋషుల సాంగత్యం కోరుకోవలెను.

ఋషులతో సాంగత్యం లభించిందంటే, నిన్ను నువ్వు నియంత్రించుటకు మిగతా సాధనలతో పనియేమి? ఉపయోగం యేమి? చల్లని గాలులు చక్కగా వీస్తుండగా పంకా ప్రయోజనం ఏమిటి?

భగవాన్ తన 'ఉల్లదునాఫదు'లోని 40 పద్యాలను మొదలుపెట్టి మొదటి 5 పద్యాల్లో సత్పురుషుల సాంగత్యం యొక్క విలువ, ప్రాముఖ్యం వివరించారు. ఇవి ఆదిశంకరుల రచనలు, యోగవాశిష్ఠం సంస్కృత రచనల నుండి అనువాదం చేసినవే.

అందులో రెండవ పద్యాన్ని దానివెనుక ఒక జరిగిన సంఘటన గ్రహించి ఉండటం వలన, స్మరించడానికి చాలా అనువుగా ఉంటుంది. భగవాన్‌కు అత్యంత భక్తురాలైన ఎచ్చమ్మాళ్ రోజూ భగవాన్‌కూ భక్తులకు భోజనం తెచ్చేది. కొన్నిసార్లు తన మేనకోడలు చల్లమ్మద్వారా పంపించేది. ఎచ్చమ్మాళ్ తరచూ యేదో ఒక పవిత్ర దినమనిచెప్పి ఉపవాసం చేసేది. ఆవిడ ఉపవాసం ఉన్నరోజుల్లో, చల్లమ్మకు కూడా, తను చిన్నదీ ఆకలితో ఉన్నాసరే, ఉపవాసం ఉండవలసి వచ్చేది. జరిగినది భగవాన్ యిలా చెప్పారు. 'ఒక కృత్తికా నక్షత్రం రోజు, తను ఉపవాసం ఉన్నా నాకు భోజనం తీసుకుని వచ్చింది. ఆవిడ తినకుండా ఉంటే నేను యెలా తినగలను? ఆవిడను ఉపవాసాలు చేయవలదని, యింకా మంచి వయసులోనే ఉన్నావు అని నచ్చజెప్పి తినిపించాను. మరసటిరోజు ఆమె భోజనం తీసుకుని కొండపైకి వస్తున్నపుడు ఆవిడకు ఒక కాగితం కనిపించింది. అది తీసిచూస్తే దానిపై ఒక శ్లోకం ఉంది. నేను అది చూసినపుడు అందులో యీ రెండవ పద్యం యొక్క సంస్కృత శ్లోకం ఉంది. చూడు, నిన్న నీకు నేను చెప్పిందే యీ శ్లోకంలో ఉందన్నాను. దాన్ని తమిళంలోనికి అనువదించి ఆమెకు అర్థం చెప్పాను. అప్పటినుంచి ఆమె ఉపవాసములు మానివేసింది. ఆమెకు నాపై అచంచలమైన విశ్వాసం. గతంలో అయినా, యిప్పుడైనా మనం చేసిన సత్కార్యాలు, ధ్యానం,

తపస్సులకు దీవెనలుగా మనకు సత్పురుషుల సహవాసం భగవంతుని అనుగ్రహం వలన లభిస్తుందని తప్పక చెప్పవచ్చు.

సత్సంగ్ అంటే సత్, సత్యం దాని స్వరూపమే అయిన రమణుల లాంటి మహర్షుల సాంగత్యంలో, సహవాసంలో ఉండి చరించడం, సేవించడం, ధ్యానించడం. భగవాన్ లాంటి జ్ఞానియొక్క ఒక్క అనుగ్రహ వీక్షణం చాలు, మనల్ని అసాంతం శుద్ధిచేసి నేను యెవరు విచారణకు ఉన్ముఖులను చేయడానికి. ఈ విధానాన్నే మొదటి పద్యంలో చెప్పబడింది. దేహం, ఆస్తులు, సంబంధాలు, మనసుతో ఉన్న బంధం అంతా బలహీనపడుతుంది. ఈ మార్పే ప్రపంచం విషయాలన్నింటిపై అంతర్గతంగా అనాసక్తి పెరుగుతుంది. అపుడు 'నేను దేహం' అనే భ్రాంతి విరిగిపోతుంది. అది పోగానే, మనసు తన మూలస్థానమైన శుద్ధ ఎరుకలో నిలచిపోతుంది. ఇక నేను ఫలానా, పరిమితుడిని అనే భావన అంతం అయిపోతుంది. తను సదా సర్వస్వతంత్రుడినే అనే చేతన ఉదయిస్తుంది.

మనపై జ్ఞాని యొక్క ప్రభావం మనకు తెలియకుండానే దృఢంగా నిరంతరంగా ఉంటుంది, పనిచేస్తుంది. అందువలన ప్రభావం పని గురించి తెలుసుకోలేక, కొందరు ఆ ప్రభావ ఫలితాన్ని గురించే ప్రశ్నిస్తారు. ఇలా యెప్పుడోసారి అత్యంత భక్తులకు కూడా జరుగుతుంది. హృదయం విశాలం కావడం, బంధాలు తొలగిపోతుండడం అనే మార్పు కొలవలేనిది, చూడలేనిది కాబట్టి, భగవాన్ ప్రభావం మనపై యేమీ లేదు అనుకుంటారు. దేవరాజ మొదలియార్ తనదైన మధురమైన శైలిలో యీ పొరపాటు గురించే చెప్పారు. 1935వ సంవత్సరంలో భగవాన్ ఉన్న హాలులో వెంకట్రామ అయ్యర్ మొదటి అయిదు పద్యాలను మొదలియార్ దృష్టికి తెచ్చి, 'మనలాంటి వారికి యిదే ఉత్తమమైనది' అన్నారు. భగవాన్ కూడా అతనికి కొన్ని పవిత్ర గ్రంథాలు భ్రమరగీత, కురుంటిరిటి, జ్ఞాన వాశిష్ఠముల్లోని సత్సంగం యొక్క ప్రాముఖ్యత ఘట్టాలు చెప్పారు. వాశిష్ఠంలో 'సత్సంగము వలన, అసంపూర్ణంగా ఉన్నవి పూర్ణం, అపాయం అదృష్టం, అపవిత్రం పవిత్రం అవుతాయి' అని తెలుపబడింది.

పురాణ కథల్లో తెలుపబడిన యెన్నో సత్సంగముయొక్క గొప్ప ఫలితాలు మొదలియార్‌కు భగవాన్ తెలుపగా, పత్రికలు పుస్తకాల్లో చదువగా తెలిసినవి. అయినాసరే, కొన్ని సంవత్సరాల తరువాత యీ ఫలితాల్లోని సత్యం గురించి మానసికంగా సందేహాలు వచ్చాయి. భగవాన్ దగ్గర ఆయనకు చాలా చనువు కాబట్టి అతను అడిగారు భగవాన్‌ను 'సత్సంగం గూర్చి తెలిపిన గొప్ప ఫలితాలు

నిజంగా అలాగే కలిగినవా లేక అవి అన్నీ కవులకు మామూలే అయిన అభూత వర్ణనలా?'' అని.

మనకు కనుపించే కొలవగలిగే ఋజువులుండవు కాబట్టి యిలాంటి సందేహాలు రావడం సాధారణమే కానీ, యీ సమస్య రావడానికి అసలు కారణం, సద్గురువులు చేసే పని ఫలితం వెంటనే లేక తొందరలోనే జరగాలని కాల నిర్ణయం పరిమితులను మనం నిర్దేశించుకోవడం, ఆశించడం. గత యెన్నో జన్మ జన్మల్లోని వాసనలు సంస్కారాలు యెంత యెంత చెప్పలేనంత బలంగా మన మనస్సుల్లో నాటుకుని ఉన్నాయో మనకు తెలియదు. అందుకే, మనపై ఆయన అనుగ్రహం యెప్పుడు యెలా పనిచేయాలన్న విషయం దాన్ని ప్రసాదించే పరమేశ్వరుడికే బాగా తెలుసు. సద్గురువు మనల్ని అంతగా పట్టించుకోవడం లేదనో, గమ్యం యింకా చాలా దూరకాలం పడుతుందనో, అభివృద్ధి అంతగా లేదనో అపోహాలు, భయాల వలన చాలామంది ఆధ్యాత్మిక సాధనలో సద్గురు సేవలో నిలువక అపజయం పొందుతున్నారు. ఋషుల మాటలు, పవిత్ర గ్రంథాల ఉద్ఘాటనలు వ్యర్థం కావు, వృథా పోవని సదా గుర్తు ఉంచుకోవాలి మనం. ఒకసారి మన విధిని, భవిష్యత్తును యెలాంటి షరతులూ, అపోహాలు, సందేహాలు లేకుండా సద్గురు చరణాలను నమ్మి విశ్వసించి సర్వభారం బాధ్యత ఆయనదే అని ఆయనపైనే ఉంచితే దానివలన బాధలు, దుఃఖం తలంపులు తాకలేని విముక్తి, పరమానంద స్థితి ఖచ్చితంగా కలుగుతుంది.

ఇక్కడ ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. సత్పురుషులతో సహవాసం అంటే భౌతికంగా అని మాత్రమేకాదు. సత్సంగము అంటే వారిని స్మరించడం, నామం చేయడం, వారి దివ్యత్వాన్ని ధ్యానించడం, వారితో మానసికంగా సంబంధం... యిలా యే విధంగా అయినాసరే, వారి సన్నిధే, సత్సంగమే. కొన్ని ప్రశ్నలకు భగవాన్ సమాధానాలు యీ విషయాన్ని సుస్పష్టం చేస్తాయి.

భక్తుడు : మిమ్ములను విడచి యెంతో దూరంలో ఉన్న మా యింటికి పోలేకపోతున్నాను.

మహర్షి : నువ్వు యెక్కడున్నా నా సన్నిధిలోనే ఉన్నావని గుర్తుంచుకో. ఆ తలంపే నిన్ను చక్కగా ఉంచుతుంది.

భక్తుడు : నేను కోరుకున్నట్లు తరచుగా యిక్కడకు వచ్చి మిమ్ములను దర్శించుకోలేకపోతున్నాను.

మహర్షి : నువ్వు యిక్కడకు రానక్కర లేదు. అందు గురించి నువ్వు నిరుత్సాహ పడనక్కర లేదు. నువ్వు యెక్కడ ఉన్నా 'నేను' నుండి దూరం కావద్దు.

ఒకసారి ఒక భక్తుడు రమణుల నుండి సెలవు పుచ్చుకుని విడిచి వెళ్ళడానికి యెంతో బాధపడుతుంటే, అతనితో భగవాన్ 'దివ్య సమక్షము నుండి దూరంగా పోయి యెవ్వరూ కనుపించకుండా ఉండలేరు. నువ్వు భగవాన్ అంటే యీ దేహమని, నువ్వు అంటే ఆ దేహమని భావించుతున్నందు వలన, యివి రెండు వేరు అన్న గ్రహింపు వలన, దీనినుంచి దూరంపోవడం గురించి నువ్వు మాట్లాడుతున్నావు. నువ్వు యెక్కడకు పోయి యెక్కడ ఉన్నా, నన్ను విడచి ఉండలేవు'. రమణుల భౌతిక సన్నిధి కరుణలో మునగలేని ప్రస్తుత కాలంలో, ఆ సద్గురువుల శరీరరహిత తత్త్వము, సర్వాంతర్యామిత్వము, యిప్పుడూ మనం భగవాన్ సమక్షంలోనే ఉన్నామనే గమనింపు సదా స్ఫురణలో మనకు ఉండాలి. దేశకాలాలకు అతీతమైన సద్గురువుల వీక్షణంతో ఆయన అనుగ్రహం, స్మరించి స్ఫురణలో ఉన్నవారందరికీ కలుగుతుంది.

అధ్యాయం - 17

భగవంతుని అర్చన

సహస్రనామాల్లో, భగవంతుని ఒక నామరూపాల్లో ఉన్నట్లు అర్చన జరుగుతుంది. భక్తిగా సేవించడం, పూజించడంకోసం వాటిల్లో దైవంయొక్క వెయ్యి వివిధ సద్గుణాలు ఉంటాయి. భగవంతుని అనంత ప్రేమ, కరుణ, శక్తి ఆ ప్రతీ నామాల్లో, రూపాల్లో నుండి ప్రసరిస్తూ ఉంటుంది. వాటిని భక్తితో పారాయణం చేస్తే, సద్గుణాలను స్తుతిస్తే, కోరికలను తీర్చుకోవాలనుకున్నా, ఆత్మజ్ఞానం పొందాలని చేసినాసరే, ఆ నామరూపాల శక్తి ఫలితాన్నిస్తుంది.

శ్రీ రమణ సహస్రనామాల్లో పరమేశ్వరుని భగవాన్ శ్రీ రమణ మహర్షిగా స్తుతించడం జరుగుతుంది. శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిని స్తుతిస్తూ అగస్త్య ఋషి చెప్పిన సహస్రనామాలు, శ్రీ మహావిష్ణువును స్తుతిస్తూ సనక ఋషి చెప్పిన సహస్ర నామాలూ, యీ రెండూ కూడా యెన్నో వేల వందల సంవత్సరాల నుండీ భక్తులచే రోజూ పారాయణం చేయబడుతున్నాయి. భగవాన్ శ్రీ రమణ మహర్షి సహస్ర నామాలు కూడా భక్తి, శ్రద్ధలతో ప్రార్థించి పారాయణం చేస్తే, అదే శక్తితో ఫలితాన్నిస్తుంది. ఇందులో యెలాంటి సందేహం లేదు.

శ్రీ జగదీశ్వర శాస్త్రి, భగవాన్ శ్రీ రమణ మహర్షి సహస్రనామాల యొక్క విశిష్టతను చక్కగా ఉదహరించారు. పార్వతీదేవి ఒకసారి గౌతమ ఋషి నుండి అరుణాచల మహాత్మ్యమును విని, గొప్ప మహర్షి అయిన రమణులు, మానవ దేహంలో ఉన్న అరుణాచలుడే కాబట్టి, వారి గురించి తెలుపమని కోరుతుంది. ఈ కోరిక విశ్వ సౌభాగ్యం కోసమే కలిగినదని గౌతమ ఋషి గుర్తించి స్పందించారు. ముందుగా, ముక్తికై జ్ఞానమార్గము అన్నింటికంటే ఉత్తమమైనదని చెప్పారు. తరువాత, యీ జ్ఞాన మార్గంలో శ్రీ రమణులచే బోధింపబడిన సాటిలేని నేనెవరువిచారణ సాధనను యే సమయంలోనైనా యెవ్వరైనా యే మతం విశ్వాసాలు ఉన్నవారైనా చేయవచ్చు నన్నారు. అందుకే అత్యంత నిగూఢమైన శ్రీ రమణుల మహాత్మ్యం గురించి తెలుపుటకు అంగీకరించారు.

ఏ సహస్రనామాల్లోనైనా అంతర్గతంగా ప్రవహించేది, భక్తే. దాని ప్రయోజనం యేమిటన్న ప్రశ్న ఆ పవిత్ర నామాల్లోని శక్తి ప్రభావం అనుభూతి

చెందనివారికే కలుగుతుంది. మొదటి ప్రయోజనం కోరుకున్నవి ఫలించడం. పరమేశ్వరుడే మహాశక్తి సంపన్నుడు, అలాగే అనంత ప్రేమమయుడు. శ్రీ లలిత, శ్రీ విష్ణు, శ్రీ రమణ యెవరిదైనా సహస్రనామాలను పారాయణం చేసినపుడు తప్పక దైవ స్పందన కలుగుతుంది. విద్యార్థులు జయం పొందుతారు. యవ్వనులకు వారి కోరికలను బట్టి వివాహం జరుగుతుంది. వ్యాపారులకు వారి సామ్రాజ్యం విస్తరిస్తుంది. నాయకులకు అధికారం నిలుస్తుంది. ఇలా ఫలితాలు కలుగుతాయి. ప్రాపంచిక విషయాల్లో లాభం యెవరూ ఊహించినంత కలుగుతుంది.

'ఉల్లదునాఫదు'లో భగవాన్ సాధకులకు పారాయణ అవసరానికి ప్రత్యేక కారణం తెలిపారు. పరమేశ్వరుని అర్చన తన బంధాలను బలహీనపరచి, ముక్తికి రంగం సిద్ధం చేస్తుంది యెవరికైనా. ఎందుకంటే, భగవంతుడే సర్వ సద్గుణాలకు మూల పురుషుడు. మనసు, భక్తి, ప్రార్థన నిండిన మనసుతో సహస్ర నామాలను పారాయణం చేస్తూ ఆ సద్గుణాలను పరిచయం, ఆకళింపు చేసుకుంటూ, అలవర్చుకోవడానికి వీలు కలుగుతుంది. మనసు యింకా యింకా సిద్ధం అవుతూ ఆత్మ విచారణకు అర్హత పొందుతుంది. ఈ అర్చనల్లో అంతర్గతంగా యిమిడివున్న అంతరార్థం, తను ఊహించుకుంటున్న అహంకారం స్వంత శక్తితో తన గమ్యం సాధ్యం కాదనే సత్యాన్ని గ్రహించడం. నేను చేస్తున్నాను, కర్తను కాదనే సత్యం తెలియడం. ఆ తప్పుడు గ్రహింపు, భావన పోయి, తనది అనుకుంటున్న శక్తి అంతా కూడా సత్యంగా పరమేశ్వరుడిదేనని ఉదయిస్తుంది.

చాలామంది భగవంతుడు, దేవతల సహస్రనామార్చనతో స్తుతిస్తూ ఉంటారు. కానీ అదే పరమేశ్వరుడు శ్రీరమణులుగా శరీరంతో ఉండగా వారికి సహస్రనామార్చనను సందేహిస్తుంటారు. ఆ అజ్ఞానం వలన వారు, యిలాంటి అర్చన వ్యక్తి పూజకు దారితీస్తుందని భ్రమలో పడతారు. ఇలాంటి ఆలోచనా విధానంలో యెన్నో తప్పుదోవలు ఉన్నాయి. పవిత్ర గ్రంథాలన్నీ కూడా దైవం, సద్గురువు, నేను ఒకటే అని మళ్లీ మళ్లీ యెలుగెత్తి చాటాయి. మనసు, భావన, స్వభావము ముఖ్యమైనవి కాబట్టి, గురువునకు భక్తిప్రపత్తులతో కొలచినపుడు, సద్గురువు ఈశ్వరుడు ఒకటే, వేరు కాదని స్ఫురణతో ఉండాలి.

శ్రీరమణునిలా నిరంతరం సదా స్థిరంగా ఆత్మలో నిలచి ఉన్నపుడు, వారు ఆత్మ స్వరూపులే, పరమేశ్వర రూపులే. భగవాన్‌ను ఒకే రూపంగా భావించడం సరికాదు. గతంలో, భవిష్యత్తులో, యిపుడు ఉన్న, ఉండే అన్ని రూపాలు ఆయనే. ఈ రూపాలన్నీ, ఆ హృదయంలో చైతన్యంగా ఆయన లేకపోతే అవన్నీ కదలని

బొమ్మలే కదా! కొంతమంది భక్తులకు, భగవాన్ తన అశరీరతత్త్వాన్ని ప్రదర్శించారు కూడా. భగవంతుడే మానవ రూపంలో విశ్వ సౌభాగ్యం కోసం నామరూపంతో అవతరించగా, ఆ నామం రూపం కూడా భగవంతునిలానే నాశనంలేనిది, అనంతం అయి ఉంటుంది.

మొదటి చరణాల్లో, గౌతమ ఋషి, శ్రీ రమణ సహస్రనామ స్తుతిలో దాని ప్రత్యేక విశేషాన్ని నొక్కి వక్కాణించడం గమనిస్తే చాలా మంచిది. ఎవరు యే పద్ధతిలో సాధన చేసినా, అంతిమంగా జ్ఞాన మార్గంలోనే సత్యదర్శనం కలుగుతుంది అని నిస్సందేహంగా చాటారు. అందుకు సరళమైనది, సూటి అయినది రమణులు అలుపే లేకుండా బోధించిన విచారణ మార్గము మేలయినది అని చెపుతారు. ఈ రాచబాటలో సాధన చేసేవారికి సద్గురు రమణుల రూపంలో ఉన్న పరమేశ్వరుని కృపకంటే విలువయినది యింకేమయినా ఉంటుందా?

శ్రీ రమణాశ్రమంలోని శ్రీ రమణేశ్వర ఆలయంలో ప్రతీరోజూ అర్చనలో శ్రీ రమణ సహస్రనామ స్తుతి ఒక భాగం. ఈ నిధికై, దీన్ని కూర్చిన శ్రీ జగదీశ్వర శాస్త్రికి ప్రపంచం ఋణపడి ఉంటుంది. ఎవరైనా యీ పవిత్ర నామాలను అలా పారాయణం చేస్తూ చేస్తూ ఉండగా యింకా యెన్నో విషయాలు స్పష్టం అవుతాయి. ఈ స్తుతి కూర్పునకు స్ఫూర్తి భగవాన్ రమణులే. రమణులుగా ఉన్న పరమేశ్వరుని స్తుతించాలంటే యెంతటి పండితులకు మేధావులకైనా సాధ్యం కాదు.

ఇంకో విషయం కూడా భాషయొక్క అసహాయత వలన, యే భాష అయినా, భగవాన్ మహోన్నత జీవితం, స్థితి వర్ణించడం అసాధ్యం. కావ్యకంఠ గణపతిముని తప్ప, శ్రీ జగదీశ్వర శాస్త్రికి సంస్కృత భాషా ప్రావీణ్యంలో సమతుల్యులు, సాటివారు యింకెవరూ లేరని ఘంటాపథంగా చెప్పవచ్చును. భగవాన్ వద్ద ఉండి, ఆయన చాలా చిన్న వయసునుండే సేవించుకున్నారు. భగవాన్ అంటే ఆయనకున్న భక్తిప్రపత్తులు అనన్యమైనవి. అయినాసరే, ఆయన భగవాన్‌యొక్క మహాత్మ్యము, ఏకత్వమును కొంచెం రుచి మాత్రమే చూపించగలిగారు.

ఈ స్తుతి మహోన్నత సద్గుణాలను పారాయణం చేస్తున్నపుడు వాటి ప్రభావం పారాయణం చేసేవారి శరణాగతి భావం, గ్రహణశక్తిపై ఆధారపడి ఉంటుంది. రమణుల భగవశ్శక్తివైపు ఆకర్షితులవుతూ ఉంటే ఆస్వాదిస్తూ ఉంటే

ఆనందానుభవం యింకా పెరిగిపోతుంది. అలా సహస్రనామ పారాయణం యెంతో అర్థవంతమైనది, యెంతో మార్పు కలిగించేది, యెంతో ఆకర్షించేది అని గ్రహిస్తారు.

ఎవరైనా యీ వెయ్యి సద్గుణ సర్వశక్తుల్లో, మహిమల్లో అక్కడక్కడ దేన్నయినా గ్రహించి దాని మధుర భావనను ఆస్వాదించవచ్చు. ప్రతీ నామం మహిమకూ లోతైన ఉన్నతమైన శక్తి, భగవాన్‌ని ప్రతిబింబించేందుకు, భగవాన్‌లో తన్మయులయ్యేందులకు, సమృద్ధిగా ఉన్నది.

భగవాన్ అనుగ్రహం మనల్ని పూర్ణ ఋణగ్రస్తుల్ని చేస్తుంది. ఆ ఋణాన్ని మనం యెన్నడూ తీర్చలేనిదే. శ్రీ రమణ సహస్రనామ స్తుతి పారాయణంలో భగవాన్ సన్నిధి స్ఫురణ కలుగడం కంటే ఉత్తమమైన దీవెనలు మనకు యేమి ఉంటాయి?

అధ్యాయం - 18

అనుగ్రహమే అత్యంత అవసరం

రమణులు అంటే అనుగ్రహ విగ్రహమూర్తులే. అది పూర్ణమే. ఎందుకంటే ఆయన ప్రతీక్షణం 'నేను' (ఆత్మ)గానే నిలచి, తన సహజ పరమానంద స్థితి, స్ఫురణలోనే ఉన్నారు. కానీ భగవాన్ భౌతికంగా ఉన్నపుడు ఆయన వద్ద దగ్గరగా ఉన్నవాళ్ళూ, అక్కడకు వచ్చినవాళ్ళూ చాలామంది ఆయన నిరంతర అనుగ్రహ ప్రవాహాన్ని అందుకోలేకపోయారు, గ్రహించలేకపోయారు. గంగానది జీవ ప్రవాహం లాంటి భగవాన్ అనుగ్రహం వారందరికీ లేనిదే అయింది. ఇప్పుడు ఆ ప్రమాదం యింకా యెక్కువయింది, ఎందుకంటే వారి రహస్య అశరీర మార్గదర్శకత్వాన్ని, కొన్నిసార్లు బాహ్య సహాయాన్ని గ్రహించలేకపోతే, యెవరైనా తన హృదయంలోని ఆ సద్గురు సన్నిధిని ఉపేక్షించిన వారవుతారు.

మనం 'రమణుల సంభాషణలు', 'అనుదినము భగవాన్‌తో' సంకలనాలను చదువుతూ ఉంటే తెలిసేది, అక్కడికి వచ్చిన అందరు భక్తులు, సాధకులు, జిజ్ఞాసువులు, ఆగంతకులు ప్రార్థించి కోరినది భగవాన్ అనుగ్రహాన్నే. ఈ ప్రార్థించే వారు ఒక ప్రాముఖ్యమైన విషయాన్ని గమనించరు. వారు చేసే నేనెవరు విచారణలోని తపన శ్రద్ధ వలన, ఎన్ని విధాలుగా వీలయితే అన్ని రకాలుగా రమణుని స్ఫురణలో ఉంచడం, అర్చన, నామస్మరణ, ప్రతీక్షణం తనకు భగవాన్ యిచ్చే రక్షను గమనించడం వలన, సదా యెడ తెగక ప్రవహిస్తున్న ఆ రమణుల అనుగ్రహం అనుభవం అవుతుంది. రమణులు చాలాసార్లు, తమ అనుగ్రహాన్ని యే గదిలోనో బంధించి తాళం వేయలేదని చెప్పేవారు. ఒక చిన్న గ్లాసుతో పెద్ద జీవనదిలోనికి పోయి, యింకొకరు పెద్ద బిందెతో నీరు తీసుకుపోతున్నారని ఫిర్యాదు చేయవచ్చునా? అలాగే అనుగ్రహం సదా అనంతంగా ప్రవహిస్తూనే ఉంటుంది. అందరికీ సమానంగా యెప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. అది గ్రహించే వారినిబట్టి యెంత అందుకోగలరు అనేది ఆధారపడి ఉంటుంది.

మహేష్‌భట్ తన 'నవీన గురువు యు.జి. కృష్ణమూర్తి' అనే పుస్తకంలో రమణులతో జరిగిన సంభాషణలను పదిలం చేశారు.

కృ : ముక్తి సిద్ధాంతం నిజంగా సత్యమేనా?

భ : అవును.

కృ : దానిలో వివిధ దశలు ఉన్నాయా?

భ : లేవు. అదొక స్థితి. అది తన సహజ స్థితిలో నిలచి ఉండటం.

కృ : తమరు నన్ను విముక్తులను చేయగలరా?

భ : మౌనం వహించారు.

కృ చిరాకుగా : కనీసం మీవేవైనా అనుభవాలను నాకు యివ్వగలరా?

భగవాన్ అతని వైపు తీక్షణంగా చూస్తూ : అవును. నేను యివ్వగలను. నువ్వు తీసుకోగలవా?

కృష్ణమూర్తికిది సత్యాన్వేషణకు పురికొల్పి మొదలయిన సంఘటన.

గ్రహించేవాడు, తను భగవాన్‌కు శరణాగతి చెందడానికి సిద్ధమైతే, యెంతవరకూ శరణు చెందాడన్నదాన్నిబట్టి మాత్రమే గ్రహించగలడు. ఈ విషయంలో యెన్నో రకాల వాదాలు ఉన్నాయి. మార్జాల కిశోర న్యాయం. పిల్లి తన పిల్లలను తనే కరచిపట్టుకుని తీసుకుపోతుంది. పిల్లలు వేచి ఉంటే చాలు. భగవాన్ యీ పద్ధతిని అంగీకరించరు. ఎందుకంటే, ఎంతకాలం అయితే అహంకారం మిగిలి ఉన్నదో, నేనుకర్తను అనే భావం ఉన్నదో, ఆధ్యాత్మిక సాధనలో విజయం సద్గురువు బాధ్యత, అది ఆయన పనే అంటే యెలా జరుగుతుంది. ఎవరికైతే వ్యక్తిత్వము / అహంకారం ఉందో వారు విచారణ చేయాలి, అన్వేషించాలి, సత్యమైన తన సహజ స్వస్వరూపానికై తీవ్రంగా తపించాలి. అలా తపించి, అన్వేషిస్తూ ఉండగా, సద్గురువు అనుగ్రహంపై ఆధారపడాలి, ఎందుకంటే ఆ అనుగ్రహం వలనే మొదట అన్వేషించాలనే తపన మొదలవుతుంది. ఆ అనుగ్రహం వలననే విచారణ సాధనలో స్థిరంగా నిలుస్తారు. ప్రయత్నం అన్నది తప్పదు. సాధన, అనుగ్రహం రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి నడుస్తాయి. ప్రయత్నం యొక్క అంతిమ విజయం కేవలం సద్గురు అనుగ్రహంపైనే ఆధారపడి ఉంటుంది. దాన్ని గ్రహించడం సాధకుడి తపనపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంపై 1929వ సంవత్సరంలో భగవాన్‌తో కపాలిశాస్త్రి సంభాషణ చూద్దాం.

క : ఒకరు తీవ్రంగా ఉపాసనచేస్తే కొన్ని సిద్ధులు లభిస్తాయి. ఆ ఉపాసన గమ్యం అయిన యీ సిద్ధులు లభించడం తాను చేసిన ఉపాసన వలనా, లేక పరబ్రహ్మం / తనలోని శక్తి అనుగ్రహమా?

భ : తనలోని శక్తి విశేషమే.

క : అంటే ఉపాసన చేసేవాడి కర్మ / ప్రయత్నం వలన కాదన్నమాట సిద్ధులు లభించేది, కానీ తనలోని పరాశక్తి వలన మాత్రమేనా?

భ : అవును.

భగవాన్ యెన్నోసార్లు నొక్కినొక్కి చెప్పేవారు. ఆధ్యాత్మిక మార్గం విజయం పూర్తిగా సాధన తీవ్రంగా జరుగడం వలన మాత్రమే లభించలేదు, సద్గురువు అనుగ్రహం వలన మాత్రమే.

ఈ విషయంలో యింకా గట్టిగా చెప్పడం మనకు కష్టమే. ఎందుకంటే, నేనెవరువిచారణ మొదట్లో, నేనెవరు? నేను యెక్కడనుంచి? ప్రశ్నలు బుద్ధిపరమైనవిగా అనిపిస్తాయి. మతపరమైన నియమాలు, విధానాలు యేమీ లేవు. ఇది చెయ్యాలి, ఇది చెయ్యకూడదు అనే నిబంధనలు యేమీ లేవు. ఎన్నో రకాల క్రతువులు లేనేలేవు. అందుకే యీ ప్రశ్నలో మనసుకు గట్టిగానే, సూటిగా తగులుకుంటాయి. మనం మనసుతోనే నడిపింపబడుతున్నాము కాబట్టి, ఆ మనస్సులో యెన్నో భావాలు నిలువై ఉన్నాయి కాబట్టి, మనకు యెలాంటి సహాయం, మార్గదర్శకత్వమూ అవసరం లేదనే అభిప్రాయం రావచ్చు. కానీ, ఒకసారి నేనెవరు విచారణలో స్థిరంగా నిలిస్తే, యీ ఆధ్యాత్మిక సాధనలో మనసు పని చాలా తక్కువ తక్కువగా అవుతుందనీ, అనుగ్రహం సహాయంపై ఆధారపడడం యెక్కువ యెక్కువ అవుతుందని తెలుస్తుంది. మనం ఒకసారి మూలం, అక్కడ చేరడం గురించి అనుకున్నపుడు, ఆ మూలస్థానం (హృదయం) యొక్క స్వభావం యేమిటి అన్న ప్రశ్న కూడా వస్తుంది. ఆ మూలం ప్రతీ హృదయంలో 'నేను, నేను' అంటూ ప్రకాశిస్తున్న దివ్యత్వమే. ఇదే సత్యంగా భగవాన్ అనుగ్రహం. భగవాన్ మనల్ని ఆ అనుగ్రహం ద్వారం వద్దకు తీసుకునిపోయి లోనికి లాక్కుని మనల్ని జీవిస్తుండగానే జీవన్ముక్తులను చేస్తారు. అలాంటి జీవనం గురించి యిప్పుడు మనకేమీ తెలియదు, అర్థంకాదు. దాన్ని ఒకసారి రుచి చూడగానే మనలో నాశనం లేని అనంత అమృత తత్త్వం నిండిపోతుంది.

అధ్యాయం - 19

సద్గురు అనుగ్రహం తప్పనిసరే

అది సోమవారం, నవంబర్ 18, 1907, కార్తీక శుక్ల చతుర్దశి. అంతా జనం, జనంతో నిండిపోయింది. పవిత్ర నగరమైన తిరువణ్ణామలైలో కార్తిగయ్ ఉత్సవాన్ని జరుపుకునేందుకు వేల వేలమంది భక్తులు విచ్చేసారు. వారు విరూపాక్ష గుహకు చేరుకుని మౌన సన్నిధి అయిన బ్రాహ్మణస్వామి శాంతిని ప్రసాదించే సమక్షంలో కూర్చుంటారు. స్వామి అరుణాచలం చేరుకున్న సెప్టెంబరు 1, 1896 నుంచి యీ 11 సంవత్సరాలు తన దేహ స్పృహయే లేక అంతర్ముఖులై మౌనంలోనే ఉన్నారు. ఆసక్తి కల జిజ్ఞాసువులు ప్రశ్నలు వేస్తే, స్వామి జవాబును యిసుకపైనో, పలకమీదనో వ్రాసేవారు. కానీ ఆ రోజు మరువలేని దివ్యమైన రోజు ఈశ్వర నిర్ణయం. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్వామి విరూపాక్ష గుహ బయట ఒక్కరే కూర్చుని ఉన్నారు. జగద్గురువుగా తనను ప్రపంచానికి ఆ రోజు చాటే ప్రియశిష్యుడి రాకకోసం ఎదురుచూస్తూ వేచి ఉన్నారు. అప్పటికి స్వామికి (దేహానికి) యిరవై యేడేళ్లు మాత్రమే వయసు. సదా ఆత్మనిష్ఠులై ఉంటారు కాబట్టి అతను బంగారు శరీరం ఆత్మ తేజంతో ప్రకాశిస్తుంది. ఆయన సాక్షాత్తూ ఆత్మ స్వరూపులే.

ఆ రోజు, గణపతి, ఒక ముని, స్వామికంటే ఒక్క సంవత్సరం మాత్రమే వయసులో పెద్ద. ఇరవై ఎనిమిది సంవత్సరాలే అయినా వారు ఆధ్యాత్మిక సాధనలో అంతిమ పరాకాష్టకై యెంతో ఆరాటంతో ఉన్నారు. అతని చిన్నతనంనుంచే అన్ని దేవతల ఉపాసనలు చేసి సాక్షాత్కరించుకున్నారు. సకల వేదోపనిషత్ గ్రంథాలన్నీ ఔపోసన పట్టారు. సంస్కృతంలో సాటిలేని నిష్ణాతులై భారతదేశ సంస్కృత సమ్మేళనంలో మహామహులను ఓడించి 'కావ్యకంఠ' బిరుదును పొందారు. ఎంతోమంది శిష్యులతో తైర్థయాత్రలను చేశారు. 1903వ సంవత్సరంలో ఆయన మొదటిసారి అరుణాచలం వచ్చినప్పటికే ఓం నమశ్శివాయః పంచాక్షరీ మంత్రజపం కోటికి పైనే చేసారు. అలానే 'శ్రీవిద్య' లాంటి తత్త్వాలపై యెన్నింటినో విశదీకరణలు వ్రాసారు. సంపూర్ణ నిష్ఠ నియమాలతో యెన్నో వేదోయుక్త యజ్ఞాలు చేశారు. అయినాసరే, ఆయనలో సంతృప్తి లేదు, బ్రహ్మానందం లేదు, యేదో వెలితి అనిపిస్తుంది. ముందుకు దారి కనిపించడం లేదు. అగమ్య గోచరంగా ఉన్న స్థితి

అతన్ని బాధిస్తున్నది. ఎందుకంటే అతని సంపూర్ణ విశ్వాసం అంతా వేదగ్రంథాలు, దేవతా ఉపాసనలతో విజయం ప్రాప్తిస్తుందని. అతను తపస్సులెంతో చేసి పరిపక్వమయ్యారు. నిజమైన మునులయ్యారు. అయినాసరే అతనికి సత్యదర్శనం కాలేదు, ఊరిస్తూనే ఉన్నది. ఎందుకు? సద్గురువు అనుగ్రహం లేకపోవడం వలనా? సాధనలు యెంత తీవ్రంగా చేసినప్పటికీ, సద్గురువు అనుగ్రహం వలనే వాటి ఫలితం వస్తుంది. ఆయనకు యింతవరకూ తన సద్గురువు తెలియలేదు. 1903వ సంవత్సరంలోనే ఆయన అరుణాచలం వచ్చినపుడు, గొప్ప ఆధ్యాత్మిక స్థితిలో ఉన్న బ్రాహ్మణస్వామిని మామూలుగా దర్శించుకున్నారు. అప్పటికి ఆయన శరణాగతి చెందడానికి పరిపక్వమై సిద్ధంగా లేరు. అతనికే యెంతోమంది శిష్యగణం, కానీ ఆయనకు గురువు యింకా తెలియలేదు.

అలాంటి దారి తెన్నూ లేని జీవిత పరిస్థితుల్లో, బ్రాహ్మణ స్వామి ఒక్కసారిగా గుర్తుకు వచ్చి వారే, వారొక్కరే తనకు సద్గురువుగా దారి చూపించగలిగే వారు అని అకస్మాత్తుగా తనలో స్ఫురించింది. వారు తపస్సు సుదూర తీరాలను జయించి దాటిపోలేదా? వారు సదా ఆత్మస్థితిలో మునిగి స్థిరంగా ఉండలేదా? ఉద్ధృతమైన శ్వాసతో, యెంతో ఆశతో, తపస్సు నిజస్వరూపం స్వభావం, అసలు తపస్సు అంటే యేమిటి అని తెలుసుకోవాలనే తీవ్రమై లోన మండుతున్న ఆకాంక్షతో, మండించే మధ్యాహ్న సూర్యుని వేడిమిని కూడా లెక్కచేయకుండా, కొండపైకి యెక్కడం ప్రారంభించారు. తన ఆధ్యాత్మిక దాహాన్ని తీర్చుకోవాలి. తానే తపస్సు అయి ఉన్నవారి దగ్గరనుంచే తపస్సుకు అర్థం యేమిటో తెలుసుకోవాలి. దీనివలన తెలుస్తున్నదేమంటే, ఆ క్షణంలోనే ఆయన బ్రాహ్మణస్వామిని తన సద్గురువుగా స్వీకరించారు. విరూపాక్ష గుహవద్దకు చేరగానే ఆయన చేసిన మొట్టమొదటి పని బ్రాహ్మణస్వామి పాదపద్మములను, కుడిచేత్తో కుడిపద్మము యెడమచేత్తో యెడమ పద్మము చేతులను కత్తెరెలా ఉంచి, పట్టుకుని తన కన్నీటిధారలతో కడిగి అభిషేకం చేశారు.

మానవజాతి ఆధ్యాత్మిక చరిత్రలోనే అది అత్యంత విశేషమైన ప్రత్యేకమైన అరుదైన సంఘటన. ఎందుకంటే, సత్యదర్శనం (ఆత్మ దర్శనం) అయిన తరువాత ఆయన మహర్షి మొట్టమొదటిసారిగా జగద్గురువు దివ్య పాత్రలో తన ప్రబోధాన్నిచ్చారు. ఇన్ని సంవత్సరాల వాక్ మౌనాన్ని విడిచారు. అంతరంగ మౌనం సదా ఉండేదే భగవాన్‌కు దాన్ని విడుచుట అన్నది లేనే లేదు. అది తన సహజం. వారు యీ అతి సమర్థమైన శిష్యుని గురించే వేచి చూస్తున్నారా

యున్నాట్కా? కావ్యకంఠ గణపతి ముని యొక్క సమర్థత గురించి కానీ, ప్రపంచానికే తన సద్గురువు జగద్గురువేనని చాటి చెప్పగల అతని సామర్థ్యం సత్తా గురించి కానీ; దక్షిణామూర్తులు, ఆదిశంకరుల సింహాసనాలను అధిరోహించగల ఆయన అర్హతను శక్తిని గానీ, శంకించడానికి యెలాంటి సందేహమూ లేశమైనా లేనేలేదు. అప్పుడు అక్కడ ఆ కలయికతో యేమి జరిగిందనేది గణపతి ముని మాటల్లోనే 'ఆధ్యాత్మిక వేదన నాలో దహించుచుండగా నేను ఆయన వద్దకు చేరి వారి పాదాలపై సాష్టాంగపడి నాకు ఆచరించడానికి మార్గదర్శకత్వం కావాలని ప్రార్థనతో ప్రాధేయపడ్డాను. వారి కరుణామయ వీక్షణం నాలో ప్రవహించింది. వారు ఇంద్రియాన్ని జయించిన వారిలో మొదటివారు. ఒక్క క్షణంలోనే వారు నా స్థితి, పరిస్థితిని గ్రహించి, విప్పారిన నేత్రాలతో నాపై పూర్తిగా నా సేద తీర్చే అనుగ్రహ దృక్కుల వర్షం కురిపించారు, పరమానందంలో నన్ను ముంచెత్తారు'.

గణపతి ముని తన సద్గురువుల నుండి పొందిన బోధ, మళ్ళీ చెప్పవలసి ఉంది, యెందుకంటే భగవాన్ బోధలన్నింటికీ అదేసారం, కీలకం, ఆధారం కాబట్టి.

'ఎప్పుడైతే మనసు, యెక్కడ నుంచి నేను అనే భావన / అహంకారం పుడుతుందో అని విచారణతో శోధిస్తుందో, అపుడు ఆ పుట్టుస్థానంలో అది లయం అయిపోతుంది, అదే తపస్సు. ఎక్కడనుంచి మంత్రశబ్దం పుడుతున్నదో దానియొక్క పుట్టు మూలస్థానం యేమిటని విచారణ చేస్తే, అది మనసును ఆ మూలంలో లయం చేస్తుంది, అదే తపస్సు'.

ఇందులో మొదటిది ప్రపంచ ప్రాచుర్యం పొందిన 'నేనెవరు, నేనెక్కడి నుంచి' అనే విచారణ ప్రశ్నలు. రెండవది, మంత్రశబ్దం యెక్కడినుంచి పుడుతుందనే దానిమూలం గురించి విచారణ గణపతి మునికి ఒక్కరికే మాత్రం బోధింపబడింది. ఆయన ద్వారా ప్రపంచానికంతటికీ తెలిసింది. మంత్రం, బీజాక్షరాలపై విశ్వాసం ఉన్నవారందరికీ, యీ రెండవది అనంత శక్తివంతమైనది.

గణపతి మునికిచ్చిన యీ బోధలో, సదా మూలం స్ఫురణ ప్రాముఖ్యం గురించి భగవాన్ తెలిపారు. రమణ గీతలో స్ఫుటంగా తెలపడానికే యీ బోధను గణపతి మునికిచ్చారు. రమణుల మొత్తం అన్ని కూర్పుల్లోనూ అతి విశిష్టమైనది. రమణ గీతలోని 'హృదయ జ్ఞానం' అని, యెవరైనా వాదిస్తారేమో అనే భయం కూడా లేకుండా చెప్పవచ్చును. ఆత్మస్థానం, తలంపులు పుట్టిలేచే మూలస్థానం

అయిన హృదయం గురించి చక్కగా వివరణ ఉంది. హృదయానికీ, మనసుకూ గల సంబంధం కూడా స్పష్టంగా చెప్పబడింది.

కావ్యకంఠ గణపతిముని, అపుడే బ్రాహ్మణస్వామిని మొట్టమొదటిసారిగా 'భగవాన్ శ్రీరమణ మహర్షి' అనే నామంతో సంబోధించి ప్రపంచానికంతటకూ చాటారు.

సంపూర్ణ శరణాగతి మార్గం గురించి కూడా భగవాన్, గణపతి మునికి స్పష్టంగా బోధించారు. 1907వ సంవత్సరంలో గణపతిముని తీవ్ర తపస్సు కోసం తిరువత్తియూర్‌కు వెళ్ళేటపుడు కూడా భగవాన్ యీ బోధ చేశారు. తీవ్ర తపస్సు యొక్క శక్తి వలననే భారతదేశం తిరిగి జీవం పొందుతుందని గణపతి మునికి దృఢమైన విశ్వాసం ఉండేది. భగవాన్ 'అన్నిటికీ బాధ్యత, భారం విశ్వానికి నాథుడైన పరమేశ్వరునిపైనే ఉంచు, ఆయన సర్వశక్తివంతుడు, సర్వ సమర్థుడూ, విశ్వాన్ని పూర్తిగా నియంత్రించేవాడు, మొత్తం నడిపించేవాడూ పరమేశ్వరుడే. నీ మనసును యెప్పుడూ, సదా నీ హృదయంలో నివసించుచున్న పరిపూర్ణ చైతన్యం పైననే కేంద్రీకరించి లగ్నం చెయ్యి. నీ మనసు కేంద్రీకృతమైన భక్తితోనే మంచివీ, పవిత్రమైనవన్నీ సాధించుతావు. నీ కర్మల నన్నింటినీ శంకరునికే సమర్పణ చేయుము' అని గణపతిమునికి తెలిపారు. జ్ఞానులలోకెల్లా శ్రేష్ఠులైన భగవాన్ శ్రీ రమణ మహర్షులే, పరమేశ్వరుడే అన్నిటికీ సర్వకార్యాలకూ కర్త, కర్మలను చేయడానికి శక్తినిచ్చినవాడు, యే సమయంలో యే దేశ ప్రదేశంలో యెక్కడ, యేది, యెప్పుడు, యెందుకు, యెలా జరగాలో జరిపించేవాడు అని సుస్పష్టంగా సందేహరహితంగా దృఢంగా, పూర్ణంగా బోధించారు.

అధ్యాయం - 20

ఆత్మచైతన్య ఏకత్వం - పరమానంద సాగరం

నీ పవిత్ర పాదపద్మములు శిష్యుల హృదయాన్ని గమనిస్తూ, దుఃఖాల్ని అంతంచేసి, ప్రతీదినం సహచర్యం వలన వారిలో శుద్ధ పరమానందాన్ని నింపుతాయి. విశ్వనాథుడవైన నీ పవిత్ర పాద యుగళము, నాకు అత్యం తావశక్యమైన సమయంలో వచ్చి, వాటి సత్య దర్శనమునిచ్చి, నాలో భ్రాంతిమయ దుఃఖాన్ని రూపుమాపి నన్ను కాపాడుతాయి.

- మురగనార్ - రమణ అనుభూతి - పద్యం 654

సద్గురు పాదాలకు శరణాగతి చెందిన శిష్యులకు, సత్యాన్ని దర్శింపజేసే సద్గురువును స్తుతిస్తూ పవిత్ర గ్రంథాలు ఘోషిస్తున్నాయి. ఎవరైనా యెంత తపనతో ఆధ్యాత్మిక సాధన చేసిననూ ఆత్మజ్ఞానం ముంగిట వరకే చేరుకోగలరు. అహంకార పూరితమైన మనసు, సుడిగుండంలా తిరుగుతూ లేస్తున్న తలంపులను తన స్వశక్తి ప్రయత్నాలతోనే తట్టుకోగలననుకుంటుంది. ఎందుకంటే, మనసు తన కలవాటయిపోయిన బాహ్య విషయాల్లో చరిస్తూ, మలినమయిపోయింది కాబట్టి. సద్గురువు అనుగ్రహం లేకపోతే, అనంతంగా ప్రోగు చేయబడిన వాసనలు సంస్కారాలు యెంతటి వారినైనా ఆధ్యాత్మిక మార్గంనుండి ప్రక్కదారి పట్టిస్తాయి.

సద్గురువు అనుగ్రహం వారి పవిత్ర మౌనం నుంచి లోనికి చొచ్చుకుని పోయే వారి పవిత్ర నేత్ర వీక్షణం నుంచి గానీ ప్రవహిస్తుంటుంది. అయినా పవిత్ర గ్రంథాల్లో సద్గురు పాద పద్మములనే శిష్యుల శరణాగతికి అనుగ్రహ దాతలుగా చాటాయి. శ్రీ మురుగనార్ తన 'శ్రీ రమణ అనుభూతి'లో సద్గురు రమణ పాదపద్మముల మహాత్మ్యమును స్మరిస్తూ, తనకు గాఢమౌనం ఆనందమయ సహజ స్థితికి చేర్చిన ఆ పవిత్ర పాదయుగళానికి తన కృతజ్ఞతా హృదయ భావనలను ఆ తన్మయ పద్యాల్లో ప్రవహింపచేస్తారు. రమణుల పవిత్ర పాదపద్మములు మన ధ్యానాల్లో వరదలా నిండి మనలో పరమానందాన్ని పొరలి పొంగింపజేస్తాయి. రమణుల పవిత్ర పాదయుగళం శిష్యులను గమనిస్తూ అనుగ్రహంతో వారికీ, పృథ్విలో జన్మ, పునర్జన్మల్లో మునిగిపోకుండా కాపాడి రక్షిస్తాయి.

సద్గురు రమణుల శిష్యులు, భక్తులు, కాలంయొక్క బంధనాల వలనకాక, కాలాతీత సద్గురు అనుగ్రహ వీక్షణముల వలన బంధితులై, అంతంలేని ప్రయాణం-తల్లి గర్భంనుంచి గర్భానికి, జన్మనుండి జన్మకు, మరణం నుండి మరణానికి విముక్తులవుతున్నారు. ఏం జరుగుతుందో మురగనార్ వివరిస్తున్నారు.

శరణాగతి అంతా అతని చరణముల చెంతనే, అతను నాలోని అహంకారాన్ని తీసుకుని వారిలోని ఆత్మను నాలో నింపారు. అలా నన్ను అతని నుంచి దూరం చేసిన చాలా పెద్ద పొరపాటును తుడిచివేయబడింది, అంతర్ముఖ గ్రాహ్యమైన తన సహజ స్థితిని నాకు తెలియజేస్తుంటే, అతని దివ్య ప్రకాశంతో నా హృదయం నిండిపోయినది.

సద్గురువు యిలా శిష్యునికిచ్చి, వారు తిరిగి పొందేది యేమీ ఉండదు, యెందుకంటే వారు యిప్పటికే పరిపూర్ణ చైతన్యంగా నిలచి ఉన్నారు కాబట్టి. కాలం కోరలకు వారు అతీతమై ఉన్నారు. ఆ పూర్ణత్వానికి కలిసేది యింకేమీ లేదు. కానీ, శిష్యుడు యెంతో లాభం పొందుతాడు, మహోన్నతమైన ఏకత్వ స్థితికి చేరి పూర్ణంగా కొత్త జీవనాన్నే పొందుతాడు. సద్గురువు శిష్యునిలోని జ్ఞానాగ్నిని రగిల్చి అజ్ఞాన అంధకారాన్ని పారద్రోలుతాడు. గురు అనుగ్రహం వలన సహజస్థితి పరమానందం, ఏకత్వ ఉనికి శిష్యుడు పొందుతాడు. సద్గురువు తనపై శిష్యుని నిరంతర భక్తి, దృష్టి తప్ప యింకేమీ కోరడు.

సద్గురు అనుగ్రహం గురించి, శిష్యులు భక్తులు తెలుసుకోగోరినపుడు, రమణులు వారికి వివరించడానికి వెనుకాడరు. అలాగే సద్గురు అనుగ్రహం గురించి తెలిపిన పవిత్ర గ్రంథాల్లోని సంఘటనలను ఉదహరిస్తారు. శూత సంహితలోని ఒక ఉదాహరణను రమణులు వివరించారు.

జీవన్ముక్తుల చూపులలో పడినవారు యెన్నో రకాల పాపాల నుండి విముక్తులై, వారు కూడా జీవన్ముక్తులవుతారు. జీవన్ముక్తుని వంశం అంతా శుద్ధి అవుతుంది. జీవన్ముక్తుని తల్లికే, యేమి అవసరమో అది చేసినవారు. అతని వలన యీ పృథ్వి అంతా శుద్ధి చేయబడుతుంది.

ఇది చెప్పిన తరువాత, జ్ఞానుల గొప్పతత్త్వం గురించి తెలిపేవి యెన్నో సంఘటనలు శూత సంహితలో ఉన్నట్లు చెపుతూ భగవాన్ 'ఒక జ్ఞాని భూమిపై ప్రపంచంలో అవతరిస్తే, శిష్యులు, భక్తులు, నాస్తికులు, పాపాత్ములు కూడా యెంతో లాభం పొందినవారవుతారు'.

తమిళ వేదాంత గ్రంథమైన 'కైవల్య నవనీతం' నుంచి కొన్ని పద్యాలను తెలిపేవారు. ఒక శిష్యుడు, తనను తాను దర్శించుకొనే భాగ్యం కలిగించిన సద్గురు అనుగ్రహాన్ని కృతజ్ఞతగా స్తుతిస్తాడు.

'సద్గురు దేవా' నాలో అంతర్ముఖంగా ఉన్న సత్యానివి నువ్వే. నా లెక్కలేనన్ని జన్మల్లో నన్ను నడిపిస్తూ ఉన్నావు. నన్ను నడిపించుటకు ఒక శరీరం ధరించి వచ్చిన నీకు జయమవు గాక! నన్ను విముక్తి చేసిన నీ అనుగ్రహానికి ఋణాన్ని యెలా తీర్చుకోవాలో నాకు తెలియదు. నీ పవిత్ర పాద యుగళమునకు జయము, జయము'. గురువు శిష్యునివైపు కరుణా దృక్కులతో 'నువ్వు నాకు తీర్చవలసిన అతి ఉన్నత ఉత్తమమైనది, అజ్ఞానం, సందేహం, అపోహలు అనే మూడు ఆటంకాల నుండి దూరమై, నువ్వు స్థిరంగా ఆత్మలో సుస్థితుడవయి ఉండడమే' అని చెపుతారు.

శిష్యుని, అతనికున్న అన్ని బంధాలు వాసనల నుంచి విముక్తిడిని చేసి సత్యాన్వేషణకునిగా తీర్చిదిద్ది, సత్యాన్ని దర్శించేవాడిగా సద్గురువు చేస్తాడు. అందుకే సద్గురువంటే వస్తువులను బంగారంగా మార్చే రసవిద్యలో గొప్ప నిష్ణాతుడు. రసవిద్యతో మార్చబడిన బంగారం యింకో వస్తువును బంగారంగా మార్చలేదు. కానీ సద్గురువు అనుగ్రహం పొంది, తన్ను తాను తెలుసుకున్న ఆత్మస్థితిలో నిలచిన శిష్యుడు తన అనుగ్రహాన్ని యితరులపై ప్రసరింపజేసి వారిని అహంకార రహితులుగా ఆ స్థితికి చేర్చగలడు.

రమణుల అందం కళ్ళు మిరుమిట్లు గొలుపుతుంది, ఆకర్షించి బంధిస్తుంది. ఆయన కళ్లలోని ప్రకాశం శక్తి అనుగ్రహం యెవరినైనా కదలనీయదు. ఆయన శరీరాన్ని పట్టించుకోని రోజుల్లో స్నానం సంస్కారం లేక జుట్టు పిడచలు కట్టి గోళ్లు పెరిగిపోయి ఉన్నపుడు కూడా అంతే. ఈ ఆకర్షణ ఆయన బంగారువన్నె, చక్కగా అమరిన అందమైన దేహం వలననైతే కాదు. అది భౌతికమయిన అందం కాదు. కానీ ఆయన ఆత్మ నిష్ఠలుగా నిరంతరంగా మొదటినుంచీ ఒక్కక్షణం కూడా విరామమే లేకుండా నిలచివున్న కారణంగా ప్రసరించే ప్రకాశమే, యెవరి దృష్టినైనా ఆకర్షించి నిలిపివేసి కట్టి పడేస్తుంది. సత్ (నేను)గా స్థిరంగా నిలచివున్న వారెవరైనా సాక్షాత్తూ భగవన్మూర్తులే.

అధ్యాయం - 21

ట్రావల్ యాజ్ యు ప్లీజ్

1940 దశాబ్దంలో భారతీయ రైల్వేలు 'ట్రావెల్ యాజ్ యు ప్లీజ్' ప్రయాణ టిక్కెట్లు యిచ్చేవారు. ఈ టిక్కెట్లు కొనుక్కున్నవాళ్లు, వారెక్కడకు ప్రయాణం చేయాలనుకుంటే అక్కడకు వెళ్ళవచ్చు. మొత్తం ప్రయాణం దూరాన్ని పరిమితిచేసి, స్టేషన్లు యెక్కడినుంచి యెక్కడికయినా ప్రయాణించవచ్చు.

ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తున్న చాలామంది, యీ టిక్కెట్లు కొనుక్కున్న వారి మాదిరిగానే కనుపిస్తారు. వారి ప్రయత్నాల యొక్క గమ్యం, ఉద్దేశం గురించి వారికేమీ స్పష్టత ఉండదు. అందువలన వారి ఆధ్యాత్మిక మార్గంలోని ప్రయాణం యిటూ, అటూ, యెటువైపో వారికి అంతు చిక్కదు. ఎందరో గురువుల వద్దకుపోయి ఆశ్రయించడం, పెద్ద పెద్ద వక్తల ఉపన్యాసాలు వినడం, యెన్నో గ్రంథాలు చదవడం జరుగుతుంది. దాంతో వాళ్ల మనసులు ఒక కలగూర గంపలా తయారవుతాయి. ఫలితంగా, గంగానదిలో తేలుతున్న దుంగల్లా, అయోమయంలో ఉంటారు. వారు వారి యిష్టం వచ్చినట్లు ప్రయాణించవచ్చు. కానీ గమనించవలసింది యేమంటే అమూల్యమైన తిరిగిరాని యెంతో కాలం వృధా అయిపోతుంది. జీవితకాలం, ఆ టిక్కెట్లకు దూరాన్ని పరిమితం చేసినట్లు, పరిమితమైనది. వారి శక్తి అంతా అలా ఖర్చు అయిపోయిన తరువాత, వారి మనసులో యెన్నో రకాల తలంపులనన్నింటినీ వదిలించుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాలి. అలాంటి మేథోపరమైన మేతలయొక్క నిరర్థకత్వం గురించి భగవాన్ 'ఈ విచార సాగరం యెన్నో తర్కాలు పెద్ద పెద్ద శాస్త్రీయ పదాలు వాక్యాలతో కూడికుని ఉంటుంది. ఈ పెద్ద పెద్ద గ్రంథాలన్నీ అసలు ఉద్దేశానికి, గమ్యానికి యేమైనా పనికి వస్తాయా? అయినా, కొంతమంది వాటిని చదివి, వారి ప్రశ్నలకు సమాధానం కోసం మాత్రమే మునుల వద్దకు పోతారు. వారు గ్రంథాలను కొత్త కొత్త ప్రశ్నలు, సందేహాల గురించే చదువుతారు. ఇలా చేయడమే వారికి ఆనందం. ఇవన్నీ పూర్తిగా వ్యర్థం అని తెలిసే, మునులు అలాంటి వాటిని ప్రతిపాదించరు, ఉత్సాహపరచరు'.

అందువలన, ప్రాపంచిక విషయాల్లో యెలా స్పష్టత కలిగి మెలగుతున్నారో, అంతర్ముఖ ప్రయాణంలో కూడా మొదటినుంచీ తన గమ్యం గురించి పూర్తి

అవగాహన, స్పష్టత కలిగిఉండాలి. దైవానుగ్రహం వలన రమణుల సూటి పద్ధతిని సాధన చేయువారు ప్రత్యేకంగా తప్పక స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. ఈ రమణ మార్గంలోని విశిష్టత యేమిటంటే, గమ్యం యెప్పుడూ మనకు కంటిముందు స్ఫురణలోనే ఉంటుంది. సాధన మొట్టమొదటి క్షణం నుంచి కూడా సాధకునకు యెక్కడకు చేరుతాడో తెలుసు. ఉద్దేశం తనను తాను తెలుసుకోవడం. సహజానంద స్థితిలో స్థిరంగా నిలచి ఉండడం. ఇదే నేనెవరు విచారణ అంటే అర్థం.

ఈ సాధన పద్ధతిలో గమ్యం, విచారణ పద్ధతి, రెండూ ఒకదాని నొకటి పెనవేసుకుని విడదీయరానివిగా ఉన్నాయి. అందుకని గమ్యాన్ని మరచే ప్రశ్నేలేదు. కొలబద్ధ యెప్పుడూ తన కంటిముందు అలాగే ఉంటుంది.

నేనెవరు విచారణ చేస్తున్న వారికి సహజానందం అనుభూతి కలుగకపోతే, యెక్కడ యేమి తప్పు జరిగిందో, యెక్కడ దారి తప్పిందోనని సరిచూసుకోవాలి. ఎందుకంటే, అంతిమ అనుభూతి, ప్రస్తుత అనుభూతి సారాంశంలో ఒకటే, వేరు కాదు. ఈ విచారణ సాధనలో కలిగే ఆనందం అంతర్గతమైన సహజమైన ఆనందం, అది బాహ్య విషయాల వలన కలిగినది కాదు. ఈలోనుండి ఊరే ఆనందం స్ఫురణ, సాధన మొదట్లో వచ్చిపోతూ ఉంటుంది. మెల్లగా యింకా యెక్కువ సమయం ఉంటుంది. సరయిన స్థిరమైన నిలకడగా నేనెవరు విచారణ సాధన వలన యిటూ అటూ కాకుండా సదా యీ సహజానందం నిలుస్తుంది. నేనెవరువిచారణను యెప్పరైనా వదలకుండా, స్థిరమైన సహజ పరమానంద స్థితికి చేరుకునే వరకూ చేయాలి. ఎప్పుడేతే స్థిరంగా తన సహజ స్థితిలో మార్పులేక తరగనివారై ఉంటారో వారినే 'జ్ఞాని' అంటారు. నిరంతరం జ్ఞానంతోనే ఉన్నవారు. ఎప్పుడైతే అఖండంగా విరామమే లేకుండా యీ స్ఫురణ ఉంటుందో, యికపై యెలాంటి ప్రయత్నాల అవసరం లేనేలేదు. వారు సదా తనకు తానే యెలాంటి ప్రయత్నమూ లేకుండానే నిరంతరం నిర్మల శుద్ధ మనసు అనుభవించే పొంగిపొరలే బ్రహ్మానంద సాగరంలో మునిగి ఉంటారు.

ఈ అంతిమ అనుభూతి అనుభవం 'యిపుడే, యిక్కడే' ఉంది కాబట్టి. 'నేను' యెక్కడో దూరంగా చేరుకోవలసినదిగా లేదు. 'నువ్వు యెప్పుడూ అదే'. నువ్వు యెన్నో జన్మల నుండి అలవాటైన 'అనాత్మను నువ్వు అనుకోవడం'ను మానివేయాలి. ప్రయత్నం అంతా యిందుకే. రమణులు బోధించిన నేనెవరు

విచారణ సాధన ద్వారా అడ్డంకులను తొలగించాలి, ముసుగును ఛేదించాలి. అందుకు, అవగాహన స్పష్టంగా ఉండాలి, అనుభవం తప్పక కలుగుతుంది.

రమణుల మార్గానికి, సాధారణ యితర సాధనలకు తేడాలు చూద్దాం

రమణ మార్గం	ఇతర సాధారణ మార్గాలు
1. మనసు అనేది ఆత్మచైతన్యమైన 'నేను'కు, జడమైన దేహానికి (పదార్థానికి) మధ్య ఒక గొలుసు, ఆత్మనుంచే లేచిన ఒక అతిశయశక్తి. నేను ఫలానా ఫలానా అనే భావం/అహంకారమే మనసు. దానికి స్వతంత్రమైన ఉనికి వేరుగా లేనేలేదు.	1. మనసు, ఒక సూక్ష్మ శరీరము.
2. మనసు సహజ స్వభావం మౌనం, నిశ్చలం.	2. మనసు పరుగులు తీసేది, నియంత్రించాల్సింది.
3. ప్రపంచం (దృశ్యం), చూచేవాడు (దృక్కు/అహంకారం) వేరు అనే ఆధారంగా మనసును నియంత్రించే ప్రయత్నాలు యేమైనా అపజయమవుతాయి.	3. సరి అయిన ప్రయత్నాల వలన మనసు నియంత్రణ జరుగుతుంది.

చాలా గ్రంథాల్లో మనసును సూక్ష్మ శరీరం అని, అలాగే భౌతిక దేహాన్ని స్థూల శరీరమని చెప్పబడింది. భగవాన్ మనసు అంటే తలంపులే. మనసు స్వభావాన్ని గమనించితే, రెండు రకాల తలంపులు ఉన్నట్లు తెలుస్తుంది. మొదటిది ప్రథమ తలంపైన మిగతా అన్ని తలంపులకు ఆధారమై కేంద్రమైన నేను అనే భావన. రెండవ రకం, యీ భావనను కేంద్రంగా ఆధారం చేసుకుని వచ్చే యెన్నో విధాల తలంపులు, వస్తూ పోతూ మారుతూ ఉంటాయి. ఈ రావడం, పోవడం, మారడం అనేది ఆధార కేంద్ర తలంపు అయిన నేను అనే భావన

(అహంకారం) యొక్క వాటిపై ధ్యాస దృష్టినిబట్టి ఆధారపడి ఉంటుంది. వాటిపై ధ్యాస ఉంటే లేస్తాయి, నిలుస్తాయి. ధ్యాస లేకపోతే పుట్టనే పుట్టవు. అందుకే మనసు నిరంతరం మారుతూ పరుగులు తీస్తున్నట్లు ఉంటుంది. ఈ మారడాన్ని పరుగులను, ఆ తలంచేవాడు / వ్యక్తి / అహంకారం యీ మారే తలంపులపై దృష్టిని పెట్టకపోతే ఆపివేయవచ్చు, ఆగిపోతాయి. అపుడు మిగిలేది మొదటి కేంద్ర తలంపుపై ప్రశ్న ఒక్కటే, యిపుడు ధ్యాస, దృష్టి మొత్తం అంతా యీ ప్రశ్నపైన మాత్రమే నిలుస్తుంది. అలా ఆ ఒక్క తలంపుపై కేంద్రీకరించి ధ్యాసను నిలిపినపుడు, అది కూడా పోయి తన మూలమైన హృదయంలో కలసిపోతుంది. ఇక మిగులదు. అపుడు మనం మనసు అనుకునేది, యిక ఉండదు, లేదు. నువ్వు బాహ్యమైన విషయాల గురించి తలంచునంత కాలం మనసు ఉంటుంది. దాన్ని విషయాలనుండి తప్పించి, దాన్ని 'నేను అనే భావన'పై కేంద్రీకరించితే, అంటే అంతర్ముఖం చేస్తే, యిక లేకుండా పోతుంది.

తరువాత ప్రశ్న యేమిటంటే, మనసు తన మూలమైన చైతన్యంలో కలసిపోయిన తరువాత యేమవుతుందని. అంటే అలాంటివారు మనస్సు లేని తెలివిలేని జడ్డివారవుతారా? 'కాదు' అని గట్టిగా చెపుతారు భగవాన్, ఎందుకంటే తలంపుల సాగరమయిన మనసు, తలంపుల రహితమై, సూక్ష్మమై, చురుగ్గా, అనంతంగా ఉంటుంది. ఇంకా భగవాన్ "మనసుకూ, 'నేను'కూ భిన్నత్వం యేమీ లేదు, వేరుకాదు, తేడా యేమీలేదు. మనసు అంతర్ముఖమైతే అదే 'నేను', మనసు బహిర్ముఖం అయితే అదే అహంకారం, ప్రపంచం. 'నేను' కంటే వేరుగా మనసు లేనేలేదు. అలా అంతర్ముఖమైన మనసును నిర్మల శుద్ధ మనసు అంటారు, దానిలో చైతన్యం పూర్ణంగా ప్రతిబింబిస్తుంది. మనసు, శక్తి అంతా సమగ్రంగా కేంద్రీకృతమయి ఉంటుంది. విచ్ఛిన్నం కాదు. ఎందుకంటే, అపుడు మనసు అవసరమైన రోజువారీ కుటుంబ, వ్యాపార, వృత్తిపనులకు పనిచేస్తుంది. మనసు, గతం గురించి బాధింపదు, భవిష్యత్తు గురించి ఆందోళన చెందదు. వర్తమాన క్షణం ఒక్కటే ఉంటుంది. మనసు మౌనంగా నిశ్చలంగా పరమానందంలో మునిగి, దాని కార్యకలపాలనుంచి యే కోరిక ఉండదు. కావున దాన్ని యేదో నియంత్రించాలనే వెర్రి సాధనలన్నీ వాటికవే ఆగిపోతాయి.

ఇక్కడ యీ ఫలితంగా, యెవరైనా తన సత్య స్వరూపం, నిజమైన 'నేను' పరిపూర్ణమైన చైతన్యమే అని తెలుసుకుంటారు. ప్రస్తుతం యెందరిగానో

ఉన్నా 'నేను'లు, మెలకువ స్థితిలోని 'నేను'ను స్వప్నంలోని 'నేను', గాఢనిద్రావస్థలో నున్న 'నేను' అన్నీ కూడా మానసిక ఆవిష్కరణలైన కదలికలే తప్ప వేరు కాదు. తరువాత ప్రయాణం అంతం అవుతుంది. ఎలాంటి వెలితి లేని పరమానందంలో మునిగి అనుభవిస్తున్న వారికి, యిక ప్రయాణం అవసరం యేమిటి? ఒకపుడు దారి, తెన్నూ తెలియక చీకట్లో తడుముకున్న సాధకుడు, తానే ప్రపంచానికి అఖండజ్యోతి అవుతాడు.

అందరూ వారి వారి కుటుంబ సభ్యులూ, బంధువులూ, ఆప్తులూ అంటే యెంతో ప్రీతి, ప్రేమతో ఉంటారు. ఇతరుల గురించి ఉదాసీనంగా ఉంటారు. తనవారు కాదు, తనకు యేమీకారు అనుకుంటారు. కొంతమందితో అయితే క్రోధం, శత్రుత్వం, పగ, ద్వేషం, అసూయ, అసహనం, అసహ్యం లాంటివే ఉంటాయి. మరి ఒక విషయం, సత్యం గ్రహించండి. మన లెక్కలేనన్ని గత జన్మల్లో ప్రతీవారూ కూడా మనకు యేదో జన్మలో తల్లి, తండ్రీ, భర్త, భార్య, పిల్లలు, బంధువులో, ఆప్తులో అయినవారే. అలా జంతువులకు కూడా మనతో సంబంధం యేదో జన్మలో ఉన్నదే. అన్నింటిలో అందరిలో అంతటిలో ఉన్నది 'నేనే'. ఈ సత్యం గ్రహించితే ఉన్నది విశ్వప్రేమ మాత్రమే, వేరే దేనికీ అవకాశం ఉండదు. భగవాన్ యెప్పుడూ దేన్నీ తప్పు అనలేదు, దేన్నీ తప్పుగా చూడలేదు, దేన్నీ ఖండించలేదు. ఆయనకు అలాంటి పదాలే లేవు. ఏమి జరుగుతున్నా, లేకపోయినా కర్త నడిపించేవాడు ఈశ్వరుడే. సదా సర్వత్రా భగవాన్ నిరామయంగా విశ్వప్రేమనే వర్షించారు, కారణాలతో యెలాంటి సబంధం లేకుండా.

అధ్యాయం - 22

ఇంకా నేను కుటుంబం పిల్లలు బంధువులు స్నేహితులను ప్రేమించగలనా?

మన సాధారణ ఆనందాలన్నీ మనుషుల చుట్టూ నిర్మించబడ్డాయి, వారు యెవరైనాసరే, భర్త, భార్య, పిల్లలు, బంధువులు, స్నేహితులు. ఇంకా ఆస్తులు, సంపదలు, పేరు ప్రతిష్టలు, హోదాలు కూడా ఉన్నాయి. ఈ ఆనందాలన్నీ కూడా వాటన్నిటితో సంబంధాలు వాటి యెగుడు దిగుడులుతో ముడిపడి ఉన్నాయి. మనమాట వినని చెడు తిరుగుడుల పిల్లలతో దుఃఖాలే వస్తాయి. అవతలి వారి స్పందన అసంపూర్ణము, ఆగిపోయిన దవవచ్చును. వారికి ప్రేమగా స్పందించడం రాకపోవచ్చు, లేకపోవచ్చు. ధనానికి యెలాగూ దాని సంఘర్షణలు, భయాలు, కొట్లాటలు ఉన్నాయి.

బాధలు, దుఃఖాలు వచ్చేవే అయినా, మనకు ఫర్వాలేదు అనిపిస్తుంది. తన స్వంతమైన వ్యక్తిగతమైన ప్రేమలే లేకపోతే మనం యెట్లా ఉంటాము? ఒంటరితనంతో, సంకుచితంగా మూసుకునిపోయి హృదయం కుచించుకుపోయి ఉంటాము. ఒకరి చేతి స్పర్శ, అర్ధవంతమైన చూపుల కలయికలు, హాయినిచ్చే మాటలు యిలా యెన్నో తెలుస్తూ కోరుకుంటాము.

ముళ్లులు, బాధలు, దుఃఖాలు లేని ప్రేమ అనేది ఉన్నదా? అలాంటిది ఊహల్లోనో, సిద్ధాంతాల్లోనే ఉంటూ, మనకు అసాధ్యమా? కానేకాదు. ఎందుకంటే మనకు ముందు నిలువెత్తు భగవాన్ ఉదాహరణగా ఉన్నారు. ఆయన ఆత్మనిష్టులై స్థిరంగా తన పదహారవయేటనే ఉన్నారు. అతని మహా నిర్వాణం 1950 సం॥. అతనికి 70 సం॥ల వయసులో జరిగింది. ఇన్ని సంవత్సరాలు ఆయన నేను, నాది అనే భావనే లేకుండా విశ్వప్రేమకు నిదర్శనంగా ఉన్నారు. అతని ప్రేమ అందరివైపు ప్రవహించింది. పెద్దా-చిన్నా, ధనికులు పేదలు, జ్ఞానులు-అజ్ఞానులు యెవరైనా అందరినీ సమాన దృష్టితోనే చూశారు. వారి ప్రేమ యేదో కొందరికే పరిమితం కాలేదు. ఈ విషయంలో ఆయన శిష్యులు భక్తులు కూడా ప్రపంచంలోని మిగతా అందరితో సమానమే. అంటే దీని అర్థం వ్యక్తిగతమైన ప్రేమకు స్థానం లేదా? రమణులు వ్యక్తిగతమైన శ్రద్ధ చూపించలేదా?

ఈ ప్రశ్న వస్తున్నదెందుకంటే మనకు సర్వమానవ విశ్వప్రేమ, వ్యక్తిగతమైన ప్రేమ రెండూ కలసి ఉండవు అనే అపోహ వలన. ఒక భక్తురాలు రమణుల బోధలపై ప్రవచనములు జరుగుతున్నపుడు యిలాంటి సమస్యనే లేవనెత్తినపుడు సమాధానం కోరినపుడు, యీ విషయం వెలుగులోనికి వచ్చినది. ఆత్మజ్ఞానం, విశ్వప్రేమ గురించి ప్రవచనం విన్న తరువాత, ఒకామె 'రమణుల మార్గంలో నేను ప్రస్తుతం సాధన చేస్తున్నట్లు పూర్ణ సాధనలో అంకితమైతే, నా ప్రియమైన వారందరితో సంబంధ బాంధవ్యం యింతకుముందు ఉన్నట్లే, తరువాత కూడా కొనసాగుతుందా? ఆత్మజ్ఞానం ఉదయించిన తరువాత, నాకున్న అన్ని సంబంధాలు యేమవుతాయి? ఫలితంగా కలిగే విశ్వప్రేమ, యీ వ్యక్తిగత ప్రేమలనన్నీ తుడుచేస్తుందా?' అని ప్రశ్నలు ఆసక్తితో పలికింది. రమణుల మార్గాన్ని అంతిమ విజయం వరకు సాధన చేయాలనే పట్టుదల వలన ఆమెకీ అనుమానాలు ఉదయించేయి.

ప్రవచనాల యొక్క సారాంశం ఆమె తప్పుగా గ్రహించింది. అయినా ఆమె లేవనెత్తిన ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి, స్పష్టత అవసరమైనవే. ఒకరి హృదయం ప్రపంచమంతా అల్లుకుని పోయినపుడు, వ్యక్తిగత ప్రేమకు స్థానమెక్కడ? భక్తులందరూ, ప్రతీవారు యెవరికి వారు భగవాన్ ప్రేమను వారిపైనే ప్రత్యేకంగా కురిపించినట్లు భావించుకునేవారు. ఆయన అనుగ్రహంతో వారిని ముంచెత్తేవారు. భగవాన్‌ను కొందరు తండ్రిగా, కొందరు తల్లిగా, కొందరు స్నేహితునిగా, కొందరు రక్షకుడిగా యిలా యెన్నో విధాల చూసేవారు, భావించేవారు.

ఎప్పుడైనాగాని తన పాత బంధువులు చిన్నప్పటి పాఠశాల మిత్రులు రమణుల వద్దకు వచ్చినపుడు, ఆయన వారితోని అనుబంధం, ఆ రోజుల్లో కలసి చేసిన పనులు గుర్తుచేసి వాళ్ళకి యెంతో హాయి గొలిపేవారు. షాబ్‌జాన్, ఒక ముస్లిం సహవిద్యార్థి, రమణులకు యెంతో సన్నిహితుడు, వారాంతంలో అతన్ని తన తిరుచ్చుజిలోని గృహానికి తోడ్కొనిపోయేవారు. రమణుల సత్య దర్శనం, తిరువణ్ణామలైకి వచ్చేయడం తరువాత యిక కలుసుకోలేదు. షాబ్‌జాన్ పోలీసు సర్వీసులో చేరాడు. ఒకరోజు అతను వండివాస ఊరులో భగవాన్ ఫోటోను చూసాడు. వెంటనే తన స్నేహితుణ్ణి చూడాలనే తీవ్రమైన కోరిక కలిగింది. కానీ ఒక సందేహం కలిగింది. తనను అతను అసలు గుర్తుపడతాడా అని. ఈ అనుమానంతోనే అరుణాచలం వచ్చాడు. రమణులు ఆత్మనిష్ఠలుగా ఉన్నా అతని స్నేహంలో యెలాంటి మార్పు లేదని తెలుసుకున్నాడు. ఇలాగే యింకో చిన్ననాటి

స్నేహితుడు రంగన్ విషయంలో కూడా జరిగింది. అతన్ని 'గ్రహదోషాల' నుంచి కాపాడేందుకు భగవాన్ అతనిపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపించారు. సుబ్బరామయ్యగారు మరణించిన భార్యను స్వప్నంలో చూడాలనుకున్నారు, దేవరాజ మొదలియార్, ఆశ్రమంలోనే ఉండి కొనసాగించేందుకు దెబ్బ తగిలిన తన కన్ను వెంటనే నయమవ్వాలనుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్ తన కుమార్తె పెళ్లికి భగవాన్ ఆశీస్సులను కోరారు. ఇవన్నీ కూడా భగవాన్ తన అతి సహజమైన పద్ధతిలోనే తీర్చారు. ఇవన్నీ కూడా కొద్ది ఉదాహరణలే, యిలాంటివి యెన్నో లెక్కలేనన్ని సంఘటనలు. విశ్వమంతా విస్తృతంగా విస్తరించిన భగవాన్ విశ్వప్రేమ వలన ఆయన వ్యక్తిగతమైన సంబంధం, ప్రేమకు యే మాత్రం కొరత రాలేదని యీ ఉదాహరణలు చాటి చెపుతున్నాయి.

వీటన్నిటినిబట్టి తెలుస్తున్నదేమంటే, ఆత్మజ్ఞానం కలిగిన తరువాత ప్రస్తుతం ఉన్న అన్ని సంబంధాలకు ఉత్సాహకరమైన కొత్త అర్థం, బలం చేకూరుతుంది. వారికి ఆశ అనే పాశం, స్పందన కోసం కోరిక ఉండదు. వారు యివ్వడం, యింకా యివ్వడం అంతే. అలా యివ్వడమనే దాంట్లోని ఆనందం ప్రతీ సంబంధానికి ఆశ్చర్యకరమైన కొత్త పరిమళాన్నిస్తుంది. ఇప్పుడున్న వ్యక్తిగత ప్రేమల్లోని నాది, నా వారనే బంధం, ప్రీతీ, భ్రాంతీ, ఆశలూ, కన్నీళ్లు అన్నవి వారికి యేమాత్రం లేనివే. వ్యక్తిగతమైన ప్రేమల్లో యెంతో సంతృప్తికరంగా ఉన్నపుడు కూడా పోని అంతర్గత భయం మాయమైపోతుంది. దానికి చోటే లేదు. ఈ పరిమితులన్నీ పోయి, ఉన్నదంతా ఆనందం, పరమానందం.

అధ్యాయం - 23

తనకు తాను బద్ధుడా?

ఎవరైనా, తనకు తాను బద్ధుడా? అని ప్రశ్న వస్తే?, కుటుంబానికి, సంస్థకూ, విశ్వాసానికి, స్నేహానికి, ఒక కారణానికి యిలా యెన్నో బాధ్యతలు ఉంటాయి. ఒక పాత పరిచయస్థులు ఒకాయన అకస్మాత్తుగా వచ్చారు. జంకూ, గొంకూ లేకుండా 'నేను జీవితంలో అన్ని బాధ్యతలను పూర్తిచేసేసాను. కుమారులు అమెరికాలో చక్కగా స్థిరపడ్డారు. అమ్మాయి కూడా మంచి కుర్రవాడినే వివాహం చేసుకుని అమెరికాలోనే ఉంటుంది' అన్నాడు. అతని మొహం గర్వంగా వెలిగిపోతుంది. అతనిలో సంతృప్తి కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. ఆలోచిస్తే, వివాహం కాకపోయినా పిల్లలు లేకపోయినా పెద్ద తేడా కనుపించదు. ఎవరి బాధ్యతలైనా పరిమితమైనవే. తప్పనిసరి అన్న బాధ్యతలు కూడా చాలా తక్కువ పరిధి గలవే.

జీవితానికి అర్థం యేమిటన్న ప్రశ్నను యీ సంబంధాలకు అతీతంగా చూడటం లేదు. జీవితానికి ఒక ఉద్దేశం ప్రయోజనం ఉన్నదా? ఉంటే దాన్ని నేను నిర్వర్తిస్తున్నానా? ఇదే ప్రశ్న యింకోలా, 'నాకు నా గురించి బద్ధత, బాధ్యత ఉన్నాదా, అది నేను నిర్వర్తిస్తున్నానా?'. అందరూ సామాన్యంగా ప్రపంచం మొత్తంగా, యీ యెంతో ప్రాముఖ్యమున్న సంగతని విస్మరిస్తున్నారు. మనకి ప్రియమైన వారి గురించే ప్రాముఖ్యమంతా, ఆరాటమంతా. స్వజీవితం గురించి ఉన్న యీ అంధకారం యెంత గాఢం విస్తృతమైనదంటే, యెవరికైనా దీని గురించి వివరించి చెప్పడమే కష్టం, అసాధ్యమే. దీనినే మాయ అన్నారు, సత్యంపై ముసుగు వేస్తుంది. జ్ఞానాన్ని మరుగునుంచుతుంది. అజ్ఞానం అవిద్యలతో ఆడిస్తుంది. ఈ మాయ పురాతనమైనది, అనాది.

జాలారి తన వలను యెంతో విస్తృతంగా అత్యంత నైపుణ్యంతో వేయవచ్చు. అతని కలవాటయిన నేర్పయిన వల విసురు యెంతో ఆకర్షణ కలిగించవచ్చు. అయినా కొన్ని చేపలు దొరక్కుండా తప్పించుకుని పోతాయి. సమయం చిక్కినవారు, సత్యాన్వేషణపై దృష్టి మరలినవారూ యిలాంటివారే. ఈ ప్రాపంచిక విషయాలనే ఉచ్చునుండి తప్పించుకుంటారు. ఎందుకు జరుగుతుందనేది ముఖ్యంకాదు. ఇది జరిగే సత్యం అని తెలిస్తే చాలు. వారు దారిమళ్లి, మార్పులు

చెందే బంధాల్లో చిక్కుకొనకపోతే, పరమానందమనే అంతర్గత సహజానందం వారికోసమై వేచి ఉంది, ఆహ్వానిస్తుంది, లభిస్తుంది.

అలాంటివారు, వారి హృదయాల్లో రమణులను సద్గురువులుగా అనుభవం చెందుతారు. ఎందుకంటే, తపన శ్రద్ధ ఉన్నవారి గురించి గురువు వేచి చూస్తుంటాడు. అతను మానవ రూపంలో అవతరించడం అందుకోసమే. అనుగ్రహం మార్గదర్శకత్వంతో సదా నడిపిస్తున్న సద్గురువు ఆయనే. ప్రేరణద్వారా, స్వప్నాలద్వారా యితర సాధకులద్వారా ఆయన సహాయం చేరుతుంటుంది.

రమణుల మార్గంలో సాధన అంతా, కాలం నుంచి దూరమై కాలాతీతమైన జీవనానికి చేరుకోవడమే. మనసు / అహంకారం భూత, భవిష్యత్తులను కలిపే గొలుసు. భూత, భవిష్యత్తుల్లోనికి మనసు చరించడం మనకు తెలియకుండా, మన ప్రమేయం లేకుండా దానికదే జరుగుతున్నది. మనసు కదలికలు ఒక వి.సి.ఆర్.లో రివైండ్, ఫాస్ట్ ఫార్వర్డ్ బటన్లను నొక్కినపుడు జరిగినట్లుంటుంది. ఎవరూ గతంలో బాధలను, భవిష్యత్తు భయాలను పైన వేసుకోవాలనుకోరు. కానీ అలానే జరుగుతుంది. ఎందుకంటే, వర్తమానంలోనే ఉండడానికి అవసరమైన పద్ధతులను, సాధనలను పాటించలేదు కాబట్టి. అలాంటి సాధన లేదు కాబట్టి భూత, భవిష్యత్తులు వర్తమానాన్ని ముంచేస్తున్నాయి. ముందుకు వెనుకకు యెలాంటి కదలికలూ లేకుండా మనసు మౌనంగా ఉన్నపుడే కాలాతీతంగా మనసు కదలికలకు దూరంగా ఉండటం జరుగుతుంది.

ఇక్కడే భగవాన్ సదా వర్తమానంలో జీవించడానికి మనకు సాధనం అందిస్తున్నారు. ఇందులో ధ్యాసంతా ఒకే కేంద్రంపై, మనసు దృష్టినంతా దానిపైకే మళ్లించి, మనందరిలోనూ ఉన్న వ్యక్తి/నేను అన్న భావన / అహంకారంపై లగ్నం చేయబడింది. ఒక సందేహం, ఒక ప్రశ్న – విచారణ తన నిజస్థితి గురించి, యీ కదలిక, ఎవరికి 'నేను' నుంచి దూరంగా కలుగుతుందని ప్రశ్న మొదలవుతుంది. ఇది అవగాహనకు కష్టం అనిపించవచ్చు. ఆచరణలో చాలా సులభమయినది. సత్యదర్శనం, హృదయంలోని బ్రహ్మానందం తలుపులు తెరుస్తుంది కాబట్టి. నేను అనే భావన/అహంకారంపై ధ్యాస దృష్టి ఆ సత్యం కోసమే. ఏ పనిలోనైనా ఏకాగ్రత అవసరమే. ఏ పనిలో విజయం కావాలన్నా, యింట్లో ఆఫీసులో, ఆటల్లో ఏకాగ్రత కీలకమయినదే.

అజాగ్రత్త, ధ్యాస లేకపోవడం వలన నేను అనే భావన గురించి అనుభవం లేకపోవడం వలన అపోహలు పెరుగుతున్నాయి. తలంపుల కదలిక యెవరిదైతే ఆ అహంకారంపై దృష్టి పెడితే, నిశ్చలత నిలుస్తుంది. ఈ నిశ్చలత జీవితంలోని పనులు, కార్యక్రమాలవల్ల భంగం కాదు. వారు పరమానందంలో మునుగుతూ జీవితం ప్రతీక్షణం పూర్ణంగా అనుభవిస్తారు.

తన జీవితం యొక్క ముఖ్యమైన బాధ్యతను మరచిపోవడం వలన యీ అజాగ్రత్త కలిగింది. రమణగీతలో దైవరాతుడు భగవాన్‌ని అడిగిన ప్రశ్న యిలాంటిదే.

దై : భగవాన్, జనన మరణ చక్రభ్రమణంలో యిరుక్కుని తిరుగుతున్న మానవుడి ముఖ్యమైన బాధ్యత యేమిటి? దయతో ఒకటి నిర్ణయించి నాకు బోధించండి.

భ : అతి ఉన్నతమైనదీ, అత్యుత్తమమైనదీ కోరుకున్న వారెవ్వరికైనా, తన సహజ స్వభావము యేమిటని తెలుసుకోవడమే అన్నిటికన్నా అతి ముఖ్యమైనది. అదే అన్ని కర్మలకూ, వాటి ఫలితాలకూ ఆధారం, ఉద్దేశ్యమూ.

రమణులు ఆత్మజ్ఞాన విషయంలో, ఒకరి ముఖ్యమైన బాధ్యత యేమిటో చెప్పి, అంతటితో ఆగక దానికి కారణం, యెలా సాధించాలో కూడా తెలిపారు. నేను అనే అహంకారంపై దృష్టి నిలిపి ప్రయత్నించాల్సిన అవసరం కూడా గట్టిగా చెప్పారు. దీన్ని అప్రాపంచిక విచారణ అనికూడా అనవచ్చు. ఎందుకంటే ధ్యాసనంతా ఆలోచనలన్నీ బాహ్యంనుంచి తీసివేసి, ఆలోచించేవాడిపై లగ్నం చేయడం జరిగింది కాబట్టి. అలా నిరంతర సాధన నిలకడగా చేయడంవలన, తన సహజ ఆనందమయ స్థితిని కనుక్కొని తన అతి ముఖ్యమైన బాధ్యతను నిర్వర్తించడం జరుగుతుంది.

అధ్యాయం - 24

పని - విరామం - సెలవులు

అందరూ సేద తీర్చుకోవాలని విశ్రాంతి కోసమని విరామం కోరుతారు. ఎక్కడికెక్కడికో విహార యాత్రలకు పోయి సుఖంగా ఉండి, ఆనందించాలనుకుంటారు ఎందుకు? చేస్తున్న పనిలో విసుగు, రోజూ అదే, కొత్తదేమీ లేదు, మార్పులేదు, అలా చాలా చేస్తూనే ఉన్నాము. ఇంకా యెంతో చేయాలి. దాన్నించి తప్పించుకోవాలి. పనిపట్ల యీ అవగాహన, ఉద్దేశ్యము సరి అయినదేనా? ప్రస్తుతం పరిస్థితి యేమిటి? ఎన్నో పథకాలు వేస్తాము. అన్నింటికి గమ్యాల్ని, కాలాన్ని నిర్దేశిస్తాము. పోటీలు పడతాము. నిరంతరంగా పరుగెడుతుంటాం. ఆరాటం పోరాటం. పనిచేయునపుడు కూడా, మనసుకు విరామమంటే తెలియదు. మనసు శక్తి అంతా ఖర్చయిపోయింది. ఎందుకు? మనం మనసును వేలాది తలంపులతో శక్తిహీనం చేస్తున్నాం. నిద్రలో కూడా స్వప్నాల్లో కూడా మనసు అదేచేస్తూ శక్తిని కోల్పోతుంది.

రమణాశ్రమంలో వంటశాలలో సహాయం సేవచేసే సుబ్బలక్ష్మమ్మకు భగవాన్ యీ విషయం గురించే స్పష్టం చేస్తారు. ఆమెకు భగవాన్ పాత హాలులో ధ్యానం చేయాలని గాఢమైన కోరిక, కానీ వంటశాలలోని పని వలన అందుకు సమయం చిక్కడం లేదు ఆమెకు.

భ : నీ మనసు ధ్యానం కోసం తహతహలాడుతున్నట్లున్నదే?

సు : అయినా ప్రయోజనం యేమిటి? ఇక్కడంతా వంటశాల పనే కదా?

భ : నువ్వు సదా, కదలికలేని, తలంపుల రహితమైన దానివే. ఇది నువ్వు తెలుసుకోలేనంతకాలం సమస్యలు ఉంటాయి. పనిచెయ్యడంలో కష్టం కనుపిస్తుంది. నువ్వు పని ఆపివేసినా సరే మనసు పరుగులెడుతూనే ఉంటుంది.

భారమైన తలంపులను పట్టుకుని వేలాడుతూ ప్రస్తుతంలా మనం పరుగులెడుతూ పనులు చేస్తున్నంతకాలం విరామం, విశ్రాంతికోసం ఖాళీ సమయం, విహారయాత్రలు లాంటివి తప్ప వేరే గత్యంతరం లేదు. ఎందుకంటే తలంపులతో కలసి పరుగుల వలన యెంతో శక్తి ఖర్చయిపోతున్నది కాబట్టి. అందుకే యెవరైనా

నరే తలంపులకు విరామం యెలా యివ్వాలో ప్రయత్నం చేయాలి. తలంపుల మధ్య విరామం యెలా వస్తుందో పరీక్షగా గమనించండి. సందర్భాలకు సంబంధించి స్పందించడం, భావాలను యిచ్చిపుచ్చుకొనడం అనేవి లేనపుడు కలుగుతుంది యీ తలంపుల మధ్య విరామం. అందరూ అలాంటి విరామస్థితి పనికిరానిది, విసుగైనది అనుకుంటారు. ఆలోచనలకు తప్పుడు విలువలను ఆపాదించడం వలన అలా అనుకోవడం (అపోహ) జరుగుతుంది.

అంతేకాదు, యీ విరామ స్థితి తలంపులు లేని సమయం మాత్రమే కాదు. యింకా యెంతో విశాలమైనది, మధురమైనది, అందమయినది, పరమానంద మయినది. ఎందుకంటే, అవసరం లేని తలంపులే నీ సహజస్థితిని మూసి ఉంచుతున్నవి. నిన్ను నువ్వు కనుక్కోవడానికి అడ్డంగా గోడలా ఉన్నవి యీ తలంపులే, భావాలే. ఇక్కడ భగవాన్ ఒకసారి సరదాగా అన్నమాట చూడండి. ఒకరు 'ఎవరైనా కోరికలను విడిచిపెట్టవలయునా' అంటే, భగవాన్ 'కాదు, కాదు తలంపులను విడిచిపెట్టాలి' అన్నారు. నేనెవరువిచారణ, ఒకరి ధ్యాసను దృష్టిని వారి తలంపులపై నుండి తప్పించి, తన ఆనందమయ స్వభావమైన తలంపులు లేని చురుకైన శక్తివంతమైన స్థితికి చేరుస్తుంది. తలంపుల సమూహాలు తగ్గినపుడు, అవి రహితమైనపుడు, మనసు విశాలమై తనను తాను తెలుసుకుంటుంది. ఒకరు క్రికెట్ బ్యాటింగ్ చేసేటపుడు బంతి ఆడేందుకు జాగా యెలా చేసుకుంటారో అలానే నేనెవరువిచారణ సాధకులు మనసును విశాలం చేసుకుంటారు. అపుడు 'నేను' యొక్క విస్తృతమైన అనంతమైన మనోమౌనం అఖండమైన బ్రహ్మానందంను అనుభవిస్తూ ఉంటుంది.

అహంకారం తన మూలమైన హృదయం (నేను)లో కలసిపోయినపుడు, దైవత్వంతో కలవడం వలన అది మనసుకు, శరీరానికి అనంత శక్తినిచ్చి ఉత్సాహపరుస్తుంది. వాటికవే, మనసుకు గానీ, శరీరానికి గానీ చైతన్యం, స్వయం ప్రకాశం, శక్తి ఉన్నవి కాదు. ఆత్మ (నేను) నుంచే అవి శక్తి చైతన్యం ప్రకాశాన్ని పొందుతున్నాయి. ఈ దివ్యత్వం అనంత చైతన్యశక్తి హృదయంలో 'నేను, నేను...' అంటూ స్పందిస్తూ ఉంటుంది సదా.

శరీరానికి యేమైనా స్వతంత్రంగా తన స్వయం చేతన ఉందా అని కొంచెం శోధిస్తే యీ విషయం అర్థం అవుతుంది. శరీరానికీ, శవానికీ తేడా యేమిటి? భగవాన్ తన 12వ యేటనే, తన తండ్రి మృతదేహం తిరుచ్చుళి తన గృహంలో నేలపై ఉండగా రమణులకు యిదే ప్రశ్న ఉదయించింది. "తన తండ్రి

మరణించినరోజు అసలు మరణం అంటే యేమిటన్నది తనలో తొలుస్తూ ఉండగా దానిపై శోధన జరిగింది. కుటుంబం బంధువులందరూ రోదిస్తూ ఉండగా తను గంటల తరబడి ఆలోచిస్తూనే ఉన్నాడు. యెంతో తర్కం శోధన జరిగిన తరువాత శవాన్ని దహనం చేసిన తరువాత, ఒక విషయం గ్రాహ్యమయింది. 'నేను' అనేది శరీరంలో ఉన్నపుడే చూడడం, మాట్లాడడం, తినడం, పరుగులూ అన్నీ జరుగుతాయి, నేను యిపుడు ఆ 'నేను'ను తెలుసుకున్నాను, కానీ నా తండ్రి యొక్క 'నేను' ఆ దేహాన్ని వదలిపోయినది".

మరి మనసు సంగతి యేమిటి? గాఢమైన నిద్రలో మనసు కోల్పోయిన శక్తి తిరిగి తరచూ దానికి యివ్వవలసి వస్తున్నది. దైవపథకం ప్రకారం యీ నింపడం జరుగుతున్నది. అందుకోసం ఆ శక్తిని పూరించే సమయంలో తలంపుల రహితంగా చేసి, తనలోని దివ్యత్వము మనసుకు, శక్తిని నింపుతుంది. అలా, తలంపులు రహితమైనపుడు మనసు ఆత్మతో హృదయంలో అనుసంధానమవుతుంది, కలసి ఉంటుంది. అలాగే, యెవరైనా శ్రద్ధగా తీవ్రంగా నేనెవరువిచారణ సాధన స్థిరంగా చేస్తూ సూటిగా సదా దివ్యత్వంతో అనుసంధానమై ఉంటే మనసు యెల్లప్పుడూ సర్వశక్తివంతంగా ఉండి, ఉత్సాహం యెప్పుడూ ఉరకలేస్తుంది. బద్ధకం విసుగు మరి యెక్కడ? చోటు అడ్రసు వాటికి లేవు. ఇక చేసే పని నుంచి దూరంగా విశ్రాంతికై పోవలసిన అవసరం లేనేలేదు. ఎంత పని ఉన్నా, పని యేమీ లేకపోయినాసరే, అంతా పరమానందమయమే తప్ప యింకో స్థితి లేనేలేదు, అవకాశమే లేదు.

అధ్యాయం - 25

అవకాశాలను చేజార్చుకుంటారు

జీవితం వరుసగా యెన్నో అవకాశాలను యిస్తూనే ఉంటుంది. అసలు జీవితమే ఒక అవకాశం, తానంటే యెవరో తెలుసుకోవడానికి, తన సహజ స్థితిని కనుక్కుని తెలుసుకుని అనంత ఆనందమయంగా ఉండడానికి. దివ్యత్వానికి చేర్చే తరంగాలను చాలామంది గ్రహించలేరు, గుర్తించలేరు. అందుకే అవకాశాలను చేజార్చుకుంటారు. ఒక యింటర్వ్యూకు వెళ్లిన అభ్యర్థి తనకు కేటాయించిన సమయంలోనే తన ఉత్తమ ప్రతిభను కనపరచాలి. అలాగే ఒక కళాకారుడు కూడా తనకు కేటాయించిన పరిమిత కాలంలోనే తన ఉత్తమ ప్రదర్శన జరపాలి. ఆటల పోటీల్లో కూడా విజయానికై కీలకమయిన సమయాల్లోనే అత్యంత ప్రతిభ ప్రావీణ్యం సమయస్ఫూర్తి చూపించాలి, అది యే ఆట అయినాసరే, యెక్కడైనా సరే. అలాకాకపోతే, యెంత సమర్థులు నైపుణ్యం గలవారయినా ఓడిపోతారు, గెలవలేరు. అలాగే జీవితం యిచ్చే అవకాశాలను చేజార్చుకుంటే, గాలికి వదిలేస్తే, యెన్నో జన్మలు, ఆందోళనలు, కష్టాలు, దుఃఖాలు, బాధలు, యేడుపులు తప్పవు.

ఆధ్యాత్మిక సాధన, కృషి విషయానికి వచ్చినపుడు అది అంత కష్టమైనది కాదు, జాగ్రత్తగా ఉండాలన్నది సరే. ఎందుకంత కష్టం కాదు? ఎందుకంటే సద్గురువు రమణుల శిష్యులకు, భక్తులకు సదా అవకాశాలను కల్పిస్తూనే ఉంటారు. అవి యెలా ఉంటాయంటే, ఒక ద్వారం తలుపు మూసుకునిపోతే, యింకో ద్వారం తలుపు తెరుచుకుంటుంది. భక్తిశ్రద్ధలతో ఉన్న సాధకులకు వారి అహంకారాన్ని చెరిపేయడానికి, స్థిరంగా నేనెవరువిచారణకు ప్రయత్నిస్తున్న వారికీ, భగవాన్ నిరంతరంగా అనుగ్రహం, సహాయం అందించి ముందుకు తీసుకునిపోతూనే ఉంటారు. భగవాన్‌యొక్క విశ్వప్రేమ, సర్వశక్తివంతంపై పూర్ణ విశ్వాసం ఉంటే తనను తాను తెలుసుకోవడంలో అపజయం అనేది కలుగదు. విచారణ సాధన చేస్తూ, మళ్లీ మళ్లీ తన పాత అలవాట్లయిన విషయ వాసనలవైపు, మనసు పరుగులెత్తిస్తుంటే, ప్రాపంచిక సుఖాలకై, తనలోన చూడడం వదిలేసి పోయిన వారికి కూడా భగవాన్ తన సహాయ హస్తం అందించి పైకి లాగుతారు.

కనుపించని, కనుపించే భగవాన్ సహాయక హస్తం, మనల్ని నేనెవరు విచారణలో స్థిరంగా నిలువడానికి ప్రయత్నిస్తుంటే, మనలో ప్రతీ ఒక్కరికీ మన

బాధ్యతను యింత సులభతరం చేస్తూ యిస్తున్న అవకాశాన్ని పూర్ణంగా ఉపయోగించుకోవడం మన విధి కాదా? ఆచరణలో దీని అర్థం యేమిటి? అంటే, యెవరైనా తన అహంకారాన్ని వదిలించుకోవాలన్న దానిపై దృష్టిని కేంద్రీకరించి లగ్నం చేసి, తన నిజ స్వభావం యేమిటని ప్రశ్నించి శోధించాలి.

ఎంతవరకైతే అహంకారం స్వభావం యేమిటని పరీక్షించకపోతే, ఎంతకాలమైతే మనసుకు మూలం యేమిటని శోధించకపోతే, యెవరి జీవితంలో నైనా మార్పు ఉండదు, రాదు. వారు ఒక మూసలో పోసినట్లు ఉన్న తలంపులు, పనులు, పూజ, పునస్కారాలు, ధ్యానాలు యేవయితే అవి చేస్తూనే ఉంటారు. వాటివలన లాభం అనేది తప్పక ఉంటుంది. కానీ వారిలో నిజమైన మార్పు, మౌళికమయిన మార్పు ఉందా? అంటే, 'రమణుల పద్ధతిలోని పూర్తి లాభం వారు పొందుతున్నారా?' అని ప్రశ్నిస్తే, లేదు అనే జవాబే వస్తుంది. కొత్త జీవితం, ఆనందమయ స్థితిలో సదా ఉండే జీవనం ఉండేటపుడు, అంతకంటే తక్కువ దానికి యెందుకు పోవాలి. ఇదీ యీ జీవితంలోని అవకాశాన్ని పోగొట్టుకోవడమే, చేజార్చుకోవడమే, గాలికి వదిలివేయడమే. సదా ఉంటూ చురుగ్గా సర్వశక్తివంతంగా ఉన్న మౌన నిశ్చల మనసు వారికి లేదు.

ఎన్నుకున్న మార్గం నుండి యెన్నో మళ్లింపులుంటాయి. ఆ యెన్నుకున్న మార్గంలో ముందుకు పోతూ ఉంటే, ఆటంకాలు మళ్లింపులు కూడా యింకా పెరుగుతుంటాయి. అందుకే యెంతో యెంతో జాగ్రత్త చాలా చాలా అవసరం. ఇందులో మొదటిది, మనకి సంబంధంలేని విషయాల్లోకి మనం తలదూర్చడం. నేనెవరు విచారణ చేస్తున్న శివప్రకాశం పిళ్లైకు భగవాన్ గట్టిగా స్పష్టంగా యితరుల విషయాల నుండి దూరంగా ఉండమని హెచ్చరించారు. ఎవరూ మనల్ని అడగకపోయినాసరే, మనకి తెలుసు మనం పోయి అడిగి తెలుసుకుని మరీ అందరికీ సలహాలిస్తాము. శ్రీ రమణాశ్రమ విషయాల్లో ఒక్కొక్కరూ యెలా జోక్యం చేసుకుంటారో హాస్యంగా భగవాన్ చెప్పినది చూడవచ్చు. ఇక్కడకు వచ్చినవారు మొదట యిక్కడ ఉన్న ఆనందమయ వాతావరణాన్ని గ్రహించి ఆస్వాదిస్తూ ప్రశాంతంగా ఉంటారు. కొంతకాలానికి, యిక్కడ జరుగుతున్న పనుల్లో, పద్ధతుల్లో యేయే లోట్లు ఉన్నాయో అని వెదుకుతారు చూస్తారు. మరి కొంతకాలానికి నిర్వాహకులకు, యిది అలా ఉండాలి, అది యిలా జరగాలని సలహాలు యిస్తారు, వినకపోతే యిక కోపాలు, ఫిర్యాదులు, ఖండనలు. అలా మెల్లగా, వారు శ్రీ

రమణాశ్రమమునకు యెందుకు వచ్చారన్న విషయాన్ని మరచిపోతారు, అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని యిరుక్కుంటారు.

పాల్‌బ్రంటన్, తన మరణం తరువాత ప్రచురణ అయిన 'రిఫ్లెక్షన్స్' అన్న పుస్తకంలో, జాగ్రత్తపడవలసిన యిలాంటి యెన్నో ప్రమాదాల గురించి వివరించారు. మొదటిది, రహస్యంగా అంతరంగంలో ఉన్న పేరు, ప్రతిష్ఠల కోసం అత్యంత ఆరాటం కోరిక. ఒకరికి తను రమణుల బోధనల్లో ఆరితేరిన ప్రావీణ్యమున్న అధికారిననీ లేక రమణుల దగ్గరి శిష్యులు, భక్తులతో యెంతో సన్నిహితంగా తిరిగినవాడిననీ లేక రమణుల రచనలు బోధనలన్నీ ఔపోసన పట్టినవాడిననీ ఉంటుంది. 'ఉల్లదునాఫదు'కు అనుబంధంలోని పద్యంలో యిలాంటి పేరు ప్రతిష్ఠల గురించి ఆరాటం కోరికను తీవ్రంగా ఖండించారు రమణులు. ఇంతకుముందు అనుకున్నట్లు, సుఖదుఃఖాలు, పేరు ప్రతిష్ఠలు, మానావమానాలు, పదవులు, బంధువులు, ఆస్తిపాస్తులు అన్నీ కూడా రావడం పోవడం అనేది గత కర్మల ఫలితాల వలన జరుగుతుంది. అంతేకాని మన సహజ స్వభావంతో వాటికి యెలాంటి సంబంధం ఉండదు, లేదు. ఎంతో పొగిడిన నోళ్ళే మళ్లీ ఉమ్మేసి తిట్టడానికి కూడా వెనుకాడవు. రెండింటినీ పూర్తిగా సమర్థించవచ్చు.

ఇంకో కోరిక ఆరాటం, ఆస్తి సంపద, ఆడంబర జీవితం గురించి. సాధారణమైన నిరాడంబర జీవనం ఆధ్యాత్మిక జీవనానికి నిదర్శనం. సత్యాన్వేషణకై సాధన చేస్తూ ముందుకుపోగా, దివ్యత్వంతో అనుసంధానం కలుగుతుంది. అందువలన వారికి ఒక ఆకర్షణ దానికదే వస్తుంది. చాలామంది వారికి వసతులు, అలంకారాలు, కారులు, విరాళాలు యివ్వడానికి సిద్ధమౌతారు. లేకపోతే తన స్వంత ఆస్తిపాస్తుల వలననే కలుగవచ్చు యివన్నీ. వాటన్నింటికీ అలవాటుపడే కంటే వాటికి దూరంగా ఉంటేనే, అంటకుండా ఉంటేనే చాలా మంచిది. ఈ అనవసరమైనవి వారిని అగాధంలోనికి తోసివేసినా ఆశ్చర్యం యేమీలేదు.

ఇంకో అతి ప్రమాదం భౌతికమైన ఆకర్షణలు. మనం నిలకడగా సదా నిరంతరం గుర్తు ఉంచుకోవలసినది మన నిజ స్వభావం దివ్యత్వం అనీ, యింతకు ముందు యెన్నో జన్మల్లో అనంతమైన భౌతిక సుఖాలను యెన్నో అనుభవించామని, ఆ కోరికలకు అంతం లేదని. ఈ భౌతిక సుఖాలు వాంఛలు, మోహాలకు తావిస్తే జనన మరణ చక్ర భ్రమణం నుంచి తప్పించుకోవడం అసలు సాధ్యం కానిదే.

ఇవన్నీ చెప్పడం, భక్తిశ్రద్ధ ప్రపత్తులతో తపన ఆర్తితో ఉన్న సాధకులను



భయపెంచాలని కాదు. అలాంటి వారికెలాగూ సద్గురు రమణుల రక్షణ తప్పక ఉంటుంది. అలాంటి వారు దారి తప్పినా, భగవాన్ సహాయం వస్తుంది. కానీ దారి తప్పవలెనా? అన్నది ప్రశ్న. దారి తప్పితే, భగవాన్ తన జీవితంలోనికి వచ్చి, తన ఆత్మజ్ఞానం తెలుసుకోవడానికి యిచ్చిన గొప్ప సువర్ణ అవకాశాన్ని చేజార్చుకుని గాలికి వదిలివేసినట్లే.

ఈ ఉన్నవన్నీ కనుపించేవన్నీ చూసేవన్నీ సత్యమే, ప్రపంచం విషయాలు వస్తువులు, సంబంధాలు అన్నీ నిజమైనవే అని అందరికీ మనసులో యెంతో యెంతో బలంగా, యెన్నో గత జన్మల నుండీ లోతుగా నాటుకునిపోయి ఉంది. అందువలన వాటిని వదులుకోవాలేమో, అవి తనకు తనవి కాకుండా పోతాయేమో అన్న భయం దృఢంగా ఉంటుంది. దీన్ని పెకలించడం అనేది సామాన్యంగా సాధ్యంకాదు. వీటన్నిటి నిజతత్త్వము, సత్యం గురించి సందేహమూ, ప్రశ్న తీవ్రంగా ఉదయించినపుడు మాత్రమే అవకాశం కలుగుతుంది. కంటిపై భయం పొరలు తొలగుతాయి. శోధన, సత్యం గురించి అన్వేషణ జరుగుతుంది. నేనెవరువిచారణ జరుగుతుంది. గమ్యం చేరుతుంది.

అలాకాక వీటన్నిటిలో మునిగిపోయి యివే సర్వం అంతా అంటూ జీవిస్తూ ఉంటే, యింకా యింకా మళ్లీ మళ్లీ పుట్టడం, చావడం, శ్మశానం.... యిలా అంతం ఉండదు, జరుగుతూనే, సాగుతూనే ఉంటుంది. యిదే ప్రయాణం, యిలాంటి ప్రయాణమే.

అధ్యాయం - 26

ప్రపంచం ఆనందమయమైన సయ్యాట

ఉత్సాహం, ఉరకలు ఉన్నట్లు అనిపిస్తుంది. ఉద్వేగం, ఉద్రేకం ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ యే బంధం యేదీ అంటుకోకుండా, ఆట ఆడు, ఓ కథానాయకుడా, యీ ప్రపంచంలో. అన్ని అనురాగబంధాల నుండీ విముక్తుడవై, అన్నిటి యందు సమతత్త్వముతో, బాహ్యంలో అన్ని సమయాల్లో అన్ని పరిస్థితుల్లో నీ పాత్రకు సముచితంగా నటిస్తూ, చక్కగా నీవు ఆట ఆడు, నాయకా, యీ ప్రపంచంతో.

– ఉల్లసాభదుకు అనుబంధం, పద్యం : 27

రమణులు, ఆనందమయజీవనం, మనకు యెప్పుడూ మౌన ప్రశాంతంలోనే ఉండేటటువంటి జీవనం మనముందు ఉంచారు. పరుగులెత్తే ప్రాపంచిక జీవితం, జోరుగా మారే అదృష్ట ఫలితాలు, భయాలు, ఆందోళనలు అన్నీ మనకు లేనివే అవుతాయి. పొంగిపొరలే ఆనందసాగరంలో తేలియాడే మనసుకు బాహ్య ప్రపంచంలోని ఒడిదుడుకులేవీ ప్రభావితం చేయలేవు.

యోగవాశిష్ఠంలో నుంచి అనువదింపబడిన యీ పద్యానికి నేపథ్యం శ్రీరామునికి వశిష్ఠ మహర్షులిచ్చిన బోధ. శ్రీరాముడు తన 15వ యేటనే ప్రాపంచిక విషయాలు, భోగాలు, రాజ్యం, సంపదలు, సుఖాలు అన్నీ అనిత్యం వాటిననుసరించి నిర్మించుకున్న స్వప్నాలు, భవిష్యత్తు, దేహం కూడా అనిత్యాలే అర్థం లేనివే అని విరక్తితో అన్నపానాదులు వదలి దేహాన్ని అశ్రద్ధచేసి వైరాగ్యం పెంచుకుంటాడు. శ్రీరాముడు యీ స్థితిలోనే కొనసాగి ఉంటే ఆ అవతార కార్యక్రమం జరిగేదా? అపుడు వశిష్ఠులవారు, శ్రీరామునికి బోధించి, అంతర్ జీవితం, బహిర ప్రాపంచిక జీవితం ఒకదానితో ఒకటి ఘర్షణలేని సత్యమార్గాన్ని అతనికి స్ఫురింపజేస్తారు. ఈ మారే బాహ్య ప్రపంచ విషయాల గురించి తెలిసివున్నా, యెవరైనాసరే యీ ప్రతీ విషయానికి ఒక ఉద్దేశము గమ్యం దేనికదే ఉన్నట్లు తెలుసుకుని స్ఫురణతో బంధం లేకుండా జీవించగలరు. తప్పు, ప్రమాదం కర్మల్లో లేదు, ఆ విషయాల్లోనూ లేదు, మానసిక బంధంలోనే ఉంది. తనకు దైవమిచ్చిన యీ ప్రపంచంలోని పాత్రను తను యెలా నిర్వర్తిస్తున్నారా అని అది గ్రహించడంపైనే ఆధారపడి

ఉంటుంది. రమణుల, పాల్‌బ్రంటన్ సంభాషణలతో యీ విషయం స్పష్టమవుతున్నది.

పా : సత్యాన్ని కనుగొనాలంటే, యీ ప్రపంచాన్ని త్యజించి, సన్యసించి, అడవుల్లోనో, పర్వతాల్లోనో ఒంటరిగా ధ్యానం, తపస్సు చేయాలని యోగులు చెపుతుంటారు. పాశ్చాత్య దేశాల్లో అలాంటివి అసలు చేయడానికే వీలుపడదు, మా జీవితాలే యెంతో వేరైనవి. యోగులు చెప్పిన దాంతో మీరు యేకీభవిస్తారా?

భ : కర్మల జీవితాన్ని త్యజించాల్సిన పనేలేదు. ప్రతీరోజూ నువ్వు ఒకటి రెండు గంటలు ధ్యానంచేస్తే, నీ విధులను నువ్వు నిర్వర్తించుకోవచ్చు. నువ్వు సరి అయిన మార్గంలో ధ్యానంచేస్తే, ఆ ధ్యాన మనసులోని ప్రవాహము నీ అన్ని పనుల మధ్య కొనసాగుతుంది. అదెలాగునంటే, ఒకే విషయాన్ని రెండు రకాలుగా వ్యక్తీకరించినట్లు ఉంటుంది. నువ్వు నీ ధ్యానంలో నింపుకున్న స్ఫురణ నీ అన్ని పనుల్లోనూ వ్యక్తీకరణమవుతుంది.

పా : అలా జరగడం వలన ఫలితం యేమిటి?

భ : నువ్వు అలా ధ్యానం, నీ పనులు కొనసాగిస్తూ ఉంటే మెల్లగా యితరులు, సంఘటనలు, వస్తువులు, విషయాలు, ప్రపంచంపట్ల నీ ప్రవృత్తి మారుతుంది. నువ్వు చేసే కర్మలన్నీ, త్రికరణంగా, వాటికవే నీ ధ్యానంలోని స్థితిని అనుసరిస్తాయి.

పా : ప్రాపంచిక జీవితం కొనసాగిస్తూ, నిస్వార్థంగా ఉండటం అనేది యెలా సాధ్యమవుతుంది?

భ : జ్ఞానం, పని (కర్మలు) మధ్య అసలు యెలాంటి ఘర్షణ లేనేలేదు.

పా : ఎలాంటి విచ్ఛిన్నత, భంగం కలిగించని యీ అరణ్యం మధ్యలో ఉండే మీకు యీ స్థితిలో ఆధ్యాత్మిక ప్రశాంతత సులభమే.

భ : గమ్యం చేరిన తరువాత, యిదంతా తెలుసుకునే వాడిని తెలుసుకున్న తరువాత, లండన్‌లో జీవిస్తున్నా అరణ్యంలో జీవిస్తున్నా తేడా యెలాంటిదీ యేమీ లేనేలేదు, ఉండదు.

రమణులు, జ్ఞానం కర్మలకు మధ్య యెలాంటి ఘర్షణ, విభేదం లేనేలేదన్నారు. సరి అయిన పద్ధతిలో, అహంకారంపై కేంద్రీకరింపబడిన నేనెవరు, నేను యెక్కడినుంచి శోధనతో ధ్యానం వలన మనసు కర్మబంధాల చిక్కుముడుల నుండి విడుదల అవుతుంది.

అసలు సత్యం యేమంటే, మనకున్న ప్రారబ్దకర్మభారం నుండి త్యజించి పారిపోలేము. ఎవరైనా జీవితం నుంచి నిష్క్రమించుదామనుకొనినా అది చేయలేరు. ఈ సత్యం అర్థం అయినపుడు, యెన్ని ఒడిదుడుకులతో ఉన్నా, యీ జీవితాన్ని ప్రాపంచిక మైదానంలో ఆనందమయమైన ఆటగా మార్చుకోవాలి. నైపుణ్యం లేని ఆటగాళ్ళందరూ వారి ఆటను యెంతో ఆనందిస్తారు. మనము జీవితం అనే ఆటలో మనకు యిచ్చిన పాత్రలో ఆడుతున్నామని తెలుసుకుంటే ఆ జీవనం యెంతో మధురంగా హాయిగా గడిచిపోతుంది. ప్రతీవారు ప్రతీరోజూ ఆడవలసిన పాత్ర మారిపోతూ ఉంటుంది. తండ్రిగా, కొడుకుగా, భర్తగా, భార్యగా, స్నేహితుడుగా, డాక్టర్‌గా, వకీలుగా... యిలా యెన్నోగా మారుతూ ఉంటాయి. ఈ మార్పులన్నీ పూర్తి సాఫీగానే మారుతాయి. ఎందుకంటే అన్నిటిలోనూ కొనసాగే గొలుసు ఒకే ఒక 'నాది' అనేది కాబట్టి. కానీ విషయం యేమిటంటే యిలాంటి పాత్రలే, యిలాంటి ఆటలే లెక్కలేనన్ని గత జన్మల్లో మనమే ఆడాము అని మనకి గుర్తులేదు. ఇవన్నీ కూడా నాటకాల్లో, సినిమాల్లో, సీరియల్స్‌లో నటించే పాత్రలాంటివే అని స్ఫురణలో ఉంటే యే ఆందోళన, ఘర్షణ, భయం ఉండదు. ఒకరు ఒక సినిమా పాత్రలో నటించి, బయట కూడా తాను అదే అనుకుంటే ప్రవర్తిస్తే యెలా ఉంటుంది? భగవాన్, బ్యాంక్‌లోని నగదు గుమస్తా (క్యాషియర్) గురించి చెప్పేవారు. ఎన్నో లక్షల రూపాయలు అతని చేతుల్లో ఉంటాయి, లెక్క పెడతాడు, కానీ అతనికి సత్యం, అవి తనవి కాదని ఖాతాదార్లవనీ స్ఫురణలో ఉంటాడు. ఆ డబ్బుతో తనను, యింత లక్షాధికారినని, గుర్తించుకోడు. అందువలన, యెన్ని లక్షల లక్షలు వచ్చినా, పోయినా అతను ఒకేలా ఆందోళన భయరహితంగా ఉంటాడు. ఆ డబ్బు అంతా తనదే అనుకుంటే, అతని పరిస్థితి యెలా ఉంటుంది?

నటుడుగా, నటన గురించి భగవాన్ చెప్పిన యీ ఉదాహరణను చక్కగా అర్థం చేసుకుని విలువనిచ్చి స్ఫురణలో ఉంచుకుంటే జీవితం అంతా ఆనందమయమే కదా! మారిస్ ఫ్రెడ్‌మన్‌కు భగవాన్ సమాధానం యిస్తూ 'ఒక్కడే మనిషి రకరకాల పాత్రల్లో నటిస్తున్నా, అతను చేసేవన్నీ ఆ పాత్రను బట్టి

ఉంటాయి. ఒక రాజు పాత్రలో సింహాసనంపై కూర్చుని పరిపాలిస్తాడు. అదే ఒక సేవకుడైతే చెప్పులు తుడుస్తాడు. భిక్షగాడైతే జోలిపట్టి భిక్షమెత్తుతాడు. అలా చేయడం వలన అతని స్వస్వభావం యేమీ తరగలేదు, పెరగలేదు, మారలేదు. జ్ఞాని యీ పాత్రల్లో ఉన్నవాడిని 'నేనే' అని ఒక్క క్షణం కూడా మరచిపోడు.

ఒకరు నాటకంలో దుర్యోధనుని పాత్ర వేశారు. భీముని పాత్రలో ఉన్నవారు దుర్యోధనుడిని తిట్టేరు. అపుడు వారికి కోపం వస్తుందా లోపలినుండి? అతను ద్రౌపదిపై పంచభర్తృకా అని అరిచాడు. అపుడు అతనికి లోపల నుండి ఉద్వేగం ఉద్రేకం కలుగుతాయా? ఏమీ లేవు, అవకాశమే లేదు. ఉండవు. నాకటం అయిపోయింది, దుర్యోధన వేషం వేసిన తను యీ కిరీటం, సింహాసనం నాది అనీ రాజ్యపాలన చేస్తాడా? ఇంతసేపూ పాత్రలో నటనే అనే స్ఫురణతో, అసలు తానెవరో స్ఫురణ ఒక్కక్షణం కూడా పోదు, నేను దుర్యోధనుడిని రాజును అనే స్ఫురణ ఒక్కక్షణం కూడా కలుగదు, అందుకే అవకాశం లేదు. మరి మనమో, యిందుకు వ్యతిరేకంగా, ప్రతీక్షణం మన యీ పాత్ర మనమే అని స్ఫురణతో ఉంటాము, మనముగా ఒక్కక్షణం కూడా స్ఫురణతో ఉండము.

జీవితాన్ని ఒక ఆటలాటగా తీసుకున్నపుడు గెలిచినా ఓడినా, పడినా లేచినా అన్నింటిలోనూ ఆనందాన్నే చూస్తారు. గెలుపు ఓటములు సహజమే, తప్పనివే అని ఆనందంగానే అంగీకరిస్తారు. మానసికంగా జీవితం ఆట మాత్రమే అని తెలుసుకున్నవారు తప్పనిసరి పోటీల్లో, పరుగుల్లో కూడా ప్రశాంతంగా మౌనంగానే పాల్గొంటారు. ప్రతీ అపజయం, విజయానికి మెట్లే అని ముందుకు సాగుతారు, నిరాశపడి కృంగిపోరు.

ఈ సమస్యలను యింకో కోణం నుంచి కూడా దూరం చేయవచ్చు, మనం సత్యాన్ని మన దృష్టి నుంచి క్షణంకూడా దూరం కాకుండా ఉంచడం. ఈ కనుపించేదంతా మారేదే అదృశ్యమయ్యేదే యెప్పటికైనా. పుట్టేది యేదైనా పోయేదే. మారే దీనికంతటికీ వెనుక మార్పులేని నాశనంలేని సదా అంతటా నిండి ఉండే సత్యం ఒకటి ఉంది. మనసులో యీ సత్యాన్ని గట్టిగా స్ఫురణలో ఉంచి అనుభూతి అనుభవం పొందితే, అపుడు కూడా యెవరైనా జీవితాన్ని మధురమైన ఆటగానే సాగిస్తారు. ఇది, శ్రీరామునికి వశిష్ఠులు యింకోసారి చెప్పిన బోధన గుర్తు చేస్తుంది. 'అన్ని అనుభవాల్లోనూ హృదయంలో యీ

సత్యాన్ని తెలుసుకుని ఉండు. ఈ సత్యం నుండి క్షణంకూడా మరలిపోకుండా, ప్రపంచంతో ఆడు, ఓ రాజా!'

ఒకసారి జీవితంలో పోషించే వివిధ పాత్రలతోని నిజమైనవిగా గుర్తింపును కత్తిరించితే, యెవరైనా బంధాల ముడుల నుంచి విడుదల అవుతారు. మన సహజ స్వభావమైన పొంగిపొరలే పరమానందంపైకి ఉబికుతుంది. అపుడు, యీ విశ్వ రచన, జగన్నాటకంలో మనకు యివ్వబడిన పాత్రను ప్రతీక్షణం మనం దివ్యమైన ఆటగా జీవితంలో ఆనందంగా పోషిస్తాము.

తనకు తాను తెలుసుకోవడం కన్నా మించిన బాధ్యత యెవరికైనా మరేదీ లేదు, ఉండదు. ఇదే మానవుడిగా, మానవుడు సాధించాల్సిన ఒకే ఒక స్థితి, గమ్యం, ఉద్దేశ్యము అవసరము. మానవులు కోరుకునే, అనుకునే మిగిలినవన్నీ మిథ్య, భ్రమ, భ్రాంతి మాత్రమే. ఉన్నట్లు, నిజమైనట్లు, సత్యంగా అంతా అన్నీ గోచరిస్తాయి, కానీ యేమీ యేవీ లేనివే. ఇది సత్యం. జాగ్రత్ సుషుప్తి స్వప్న యే అవస్థల్లోనైనా యెవరైనా 'నేను ఉన్నాను' అంటారు గానీ 'నేను లేను' అనరు, అనలేరు యెప్పుడూ.

అణువులోనైనా, ఆకాశంలోనైనా 'నేను' ఉంది. చెప్పవలసి వస్తే నేను అణువు, నేను ఆకాశం, నేను చెట్టు, నేను పర్వతం, నేను పులి..., యిట్లానే చెప్పడం జరుగుతుంది. 'నేను' లేనిది యేమీలేదు, ఉండదు. అదే సర్వాంతర్యామి, నీవు, అందరూ, అన్నీ.... నీ స్వరూపమే. ఇది గ్రహించితే పరిమితమైన ప్రేమ, పూర్ణ విశాలంగా విశ్వప్రేమ అవుతుంది.

ప్రపంచం దేశం కాలం అహంకారమే, అహంకారానికే. ప్రపంచ విషయాలు వస్తువులు బంధాలు అన్నీ అహంకారానికే. ఇవన్నీ వస్తూ, పోతూ మారుతూ ఉండేవే. శాశ్వతం కాదు, సత్యం కాదు. సదా అన్ని కాలాలలో (కాలరహితంగా), సర్వత్రా అన్ని దేశ ప్రదేశాలలో (దేశరహితంగా) మార్పు లేనిదిగా పరిపూర్ణం అనంత శక్తి మౌనం చైతన్యం బ్రహ్మానందంగా ఉండేదే 'నేను'.

దానినే ఉన్నది, సత్, ఆత్మ, పరంబ్రహ్మం, పరమేశ్వరుడు, నారాయణుడు, శ్రీహరి.... యిలా యెన్నో, అన్ని పేర్లూ, యే పేరయినా దానికే, దానిదే. దానికంటే వేరుగా యేదీ యేమీ లేదు, ఉండదు.

ప్రపంచం (ఆబ్జెక్ట్), అహంకారం (సబ్జెక్ట్) లేనివే. చూచే అహంకారం వలననే ఉన్నట్లు ఉన్న ప్రపంచం కనుపిస్తున్నది. ఈ అహంకారంపైనే గురిపెట్టి 'నేనెవరు? విచారణ'తో సత్ అయిన 'నేను'ను కనుక్కోండి. భగవాన్ శ్రీ రమణ మహర్షి అనంతమైన ఓర్పుతో అనుగ్రహంతో బోధించిన యీ మార్గం యెవరికైనా అనుకూలమే, సాధన చేయగలిగేదే, సులభమైనదే, ఫలితాన్ని అంతిమ విజయాన్ని తప్పక యిచ్చేది.